


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 88

బుధవారం 19-6-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**17 సిక్స్‌లతో మోర్గాన్ రికార్డు**

ప్రపంచకప్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై ఇంగ్లండ్ విజయం - స్పోర్ట్స్‌లో



**మెగా బీమా సంస్థ**

మూడు జనరల్ ఇన్సూరెన్స్ సంస్థల విలీన ప్రతిపాదన - బిజినెస్‌లో

# స్నేహంతో సాధిస్తాం

## ఏపీ విభజన అంశాలపై పరస్పర సహకారం: కేసీఆర్

- రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో స్పష్టమైన నిర్ణయం
- ఇరు రాష్ట్రాల్లో ప్రతి అంగుళానికీ సాగునీరు తీసుకెళ్తాం
- నదీజలాల పంపకంపై రాష్ట్రాల స్థాయిలోనే పరిష్కారం
- 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో రెండు రాష్ట్రాల అధికారుల భేటీ
- రూ. 400 కోట్లతో నూతన సచివాలయం
- పార్లమెంటు తరహాలో రూ. 100 కోట్లతో కొత్త అసెంబ్లీ భవనం
- 27న రెండు భవన నిర్మాణాలకూ భూమి పూజ
- మంత్రివర్గ భేటీ తర్వాత మీడియాతో సీఎం కేసీఆర్

### ఐయాం ది అచీవర్..!

కాళేశ్వరం ప్రారంభోత్సవాన్ని నేనే సంతృప్తిగా చేద్దామనుకుంటున్నా. ఐయాం ది అచీవర్. ప్రధానిని ఆహ్వానించేందుకు సమయం సందర్భం ఉంటుంది. కొందరు సిల్లీ వ్యక్తులు ఏవేవో ఊహించుకుని విమర్శలు చేస్తున్నరు. మేం రాజకీయంగా ఉండాల్సినంత బలంగా ఉన్నాం.



మంగళవారం ప్రగతిభవన్‌లో కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో విద్యా శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, హోం మంత్రి మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌తో స్నేహపూర్వక, ఉల్లాసభరిత సంబంధాన్ని కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వెల్లడించారు. ఇరుగు పొరుగు రాష్ట్రాలతో కొనసాగించాల్సిన సంబంధాలు, తద్వారా రాబట్టాల్సిన ఫలితాలపై మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం విస్తృతంగా చర్చించిందన్నారు. 'తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని ప్రతి అంగుళానికీ సాగునీరు తీసుకెళ్లాలనే నిర్ణయానికి ఇద్దరు ముఖ్యమంత్రులం వచ్చాం. దాని ఫలితాలను రాబోయే రెండు మూడేళ్లలో ప్రజలకు చూపెడతాం. ఇవేకాదు.. రెండు రాష్ట్రాల మధ్య అనేక అంశాలుంటాయి. విభజన అంశాలు, రవాణా ఒప్పందాలు, పోలీసు బలగాల వినియోగం, శాంతిభద్రతలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరస్పర సహకారం లాంటి అంశాలుంటాయి. ఇరుగు పొరుగున ఉంటున్న వారు మంచిగా ఉంటేనే చక్కగా ఉంటుంది. అందుకే గతంలో ఎప్పుడూ చూడని మంచి ఫలితాలు రావాలని, తెలుగు ప్రజలకు శుభం కలగాలని అంటున్నా. ఇదే ఉత్తమమైన మార్గం. దీన్ని పాటించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ బంధం కొనసాగుతుందని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు చెబుతున్నాం'అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సుదీర్ఘంగా జరిగింది. సమావేశం అనంతరం మంత్రివర్గ నిర్ణయాలను సీఎం కేసీఆర్ మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

### గతంలో పంచాయితీలు.. నేడు సత్సంబంధాలు...

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మార్పు తదనంతర పరిణామాల్లో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులం వివిధ సందర్భాల్లో కలిశాం. మా కలయిక సందర్భంగా జరిగిన చర్చల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బేషజాలకు పోకుండా ఆ రాష్ట్రానికి చెందిన కార్యాలయాలను తెలంగాణకు అప్పగించింది. దీంతో మంచి వాతావరణం ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం రాక ముందు కర్ణాటక, మహారాష్ట్రతోనూ బస్తీమే సవాల్ అనే రీతిలో పంచాయితీలుండేవి. ఎడతెగని, అంతులేని వివాదాలు, కోర్టు వ్యాజ్యాలుండేవి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ ప్రభుత్వ చొరవతో కర్ణాటకతో సత్సంబంధాలు ఏర్పడ్డాయి. గతంలో పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే సందర్భం నుంచి మూడు సార్లు నీటిని ఇచ్చిపుచ్చుకునే స్థాయికి వచ్చాయి. మొదట వాళ్లు.. ఆ తర్వాత ఆర్డీసీ ద్వారా మేము.. మళ్లీ ఇటీవల మూడో పర్యాయం జూరాలకు 3 టీఎంసీలు ఇచ్చారు. అందులో 0.6 టీఎంసీలు వచ్చాయి. ఇది మంచి పరిణామం. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు ఐదు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. అది కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల నినాదం. కానీ ఈ రోజున చనాటా–కొరాటా రూపంలో చకచకా

మిగతా 2వ పేజీలో ▶

# జూలైలో పుర ఎన్నికలు

## ఆ నెలలోనే పూర్తిచేసేందుకు కసరత్తు: కేసీఆర్

- దర్శకుడు శంకర్‌కు మోకిల ప్రాంతంలో 5 ఎకరాలు కేటాయింపు.. విశాఖ శారదా పీఠానికి రెండెకరాలు ఇవ్వాలని నిర్ణయం
- 31 జిల్లాల్లో టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలకు స్థలాలు
- హైదరాబాద్‌పై కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలను త్వరగా నిర్వహించాలని నిర్ణయించినట్టు సీఎం కేసీఆర్ తెలిపారు. జూలైలోనే వాటిని పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీల పాలక వర్గాల పదవీకాలం జూలైలో అయిపోతుందని, ఆలోపే ఎన్నికల ప్రక్రియ ముగించాలని భావిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం కేబినెట్ భేటీ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్త మున్సిపాలిటీలు రావడంతో వాటి సంఖ్య 142కు పెరిగినట్టు చెప్పారు. రాష్ట్రంలో కొత్త మున్సిపల్ చట్టం తీసుకురావాలని అనుకుంటున్నామని, ఇందుకు అసెంబ్లీలో చట్టం చేయాలా లేక ఆర్డినెన్స్ తేవాలా అని ఆలోచిస్తున్నట్టు పేర్కొన్నారు. వెంటనే బీసీ రిజర్వేషన్లు, ఇతర రిజర్వేషన్లను పూర్తి చేయాలని మున్సిపల్ శాఖ కార్యదర్శిని ఆదేశించినట్టు వెల్లడించారు. "రిజర్వేషన్లు అయిపోతే వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించవచ్చు. తక్షణమే ఎన్నికలు నిర్వహించాలనే కృతనిశ్చయంతో ఉన్నం. పది పదిహేను రోజుల్లో రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తాం. జూలైలో 100 శాతం ఎన్నికలు ముగించే ప్రయత్నం చేస్తం. మున్సిపల్ ఎన్నికలు అయిపోతే పరిపాలన చూసుకోవచ్చు'' అని కేసీఆర్ పేర్కొన్నారు.

**భూ కేటాయింపులకు ఆమోదం:** తెలంగాణ ప్రాంత సినీ దర్శకుడు ఎన్.శంకర్‌కు శంకర్‌పల్లిలోని మోకిల ప్రాంతంలో 5 ఎకరాల స్థలాన్ని ఎకరాకు రూ.5 లక్షల చొప్పున

మిగతా 2వ పేజీలో ▶

## న్యూస్‌రీల్

### లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా



లోక్‌సభ స్పీకర్‌గా బీజేపీ తరఫున రెండు సార్లు ఎంపీగా గెలిచిన ఓం బిర్లా ఎన్నికకు రంగం సిద్ధమయ్యింది. బుధవారం స్పీకర్ పదవికి ఎన్నిక జరగనున్న సంగతి తెలిసిందే. ఈ పదవికి ఎన్డీయే అభ్యర్థిగా బిర్లాను ఖరారు చేసిన బీజేపీ.. ఆ మేరకు ఆయన పేరును ప్రతిపాదిస్తూ, అలాగే ఆయన ఎన్నిక కోసం తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఇప్పటికే లోక్‌సభ సెక్రటేరియట్‌కు నోటీసు ఇచ్చింది.

- వివరాలు 13లో

### తొందర్లోనే వెళ్లగొడతాం



అమెరికాలో ఉన్న లక్షలాది మంది అక్రమ వలసదారులను త్వరలోనే వెళ్లగొడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. వచ్చే వారమే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. వలసదారుల్ని వెనక్కి తీసుకునేందుకు ఉద్దేశించిన ఒప్పందంపై సంతకం చేసేందుకు గ్వాటెమాలా అంగీకరించిందన్నారు.

- వివరాలు 13లో

### చైనాలో భూకంపాలు



చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో రెండు వరుస భూకంపాలు సంభవించాయి. ఈ భూకంపాల్లో 12 మంది మృతి చెందగా 125 మంది గాయపడ్డారని అత్యవసర నిర్వహణ మంత్రిత్వ శాఖ తెలిపింది. సోమవారం రాత్రి 10:55 గంటలకు (స్థానిక కాలమానం) రిక్టర్ స్కేలుపై 6.0 తీవ్రతతో మొదటి భూకంపం రాగా, రెండవది మంగళవారం సంభవించిందని చైనా భూకంప విభాగం తెలిపింది.

- వివరాలు 13లో

# 2,3 తడులతో సరిపోయేలా..



మూడు, నాలుగు రోజుల్లో అల్పపీడనం...

కోస్తాంధ్ర తీరానికి దగ్గరలో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. రాగల 3, 4 రోజుల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. వీటి ప్రభావంతో బుధ, గురు వారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

- ప్రత్యామ్నాయ ప్రణాళిక దిశగా అడుగులు
- వర్షాభావ పంటలు.. స్వల్పకాలిక పంటల సాగుపైనే దృష్టి
- నైరుతి రుతుపవనాల ఆలస్యం.. ఖరీఫ్ పరిస్థితిపై సీఎం ఆరా
- మరో 2, 3 రోజులు చూసి ప్రత్యామ్నాయ ప్రణాళిక ప్రకటన

సాక్షి, హైదరాబాద్

నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రణాళికపై దృష్టి సారించింది. ఒకవేళ రుతుపవనాలు ఈ మూడు, నాలుగు రోజుల్లో వచ్చినా, ఆ తర్వాత వర్షపాతం అనుకున్నస్థాయిలో నమోదు కాకపోయినా తీసుకోవాల్సిన చర్యలపై కసరత్తు ముమ్మరం చేసింది. రైతులతో ఎటువంటి పంటలు సాగు చేయించాలనే దిశగా వ్యవసాయశాఖ ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేసింది. మరో రెండు, మూడు రోజులు వేచి చూసి ఈ ప్రణాళిక విడుదల చేయనున్నట్లు తెలిసింది. స్వల్పకాలిక రకాలైన విత్తనాలను కూడా వ్యవసాయ శాఖ సిద్ధంగా పెట్టుకుంది. ఈ నెల 23 వరకు రాష్ట్రానికి నైరుతి చేరుకునే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు ఇప్పటికే ప్రకటించారు. జయశంకర్ వ్యవసాయ వర్సిటీ, జాతీయ మెట్ట పంటల పరిశోధనల సంస్థ, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా కలిసి విడతల వారీ ప్రణాళికను సిద్ధం చేసుకున్నాయి. మరోవైపు నైరుతి రుతుపవనాలు ఆలస్యం, రాష్ట్రంలోని పంటల సాగు పరిస్థితిపై జయశంకర్ వర్సిటీ శాస్త్రవేత్తలు, అధికారుల దగ్గర నుంచి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నివేదికలు తెప్పించుకున్నట్లు తెలిసింది. వానల రాకలో ఏం తేడా వచ్చినా వెంటనే ప్రత్యామ్నాయం వైపు

మిగతా 2వ పేజీలో ▶

# బాహుబలి రైలింజిన్



- మన గూడ్స్ రైలుకు అమెరికా లోకోమోటివ్
- 6 వేల హెచ్‌పీ శక్తి... బరువు తక్కువ, వేగమెక్కువ
- రెండు ఇంజిన్లలో ఒకటి దక్షిణ మధ్య రైల్వేకు కేటాయింపు
- వికారాబాద్–వాడీ సెక్షన్ మధ్య త్వరలో పరుగులు

- వివరాలు 16లో

# మూడో టీఎంసీకి 'పైప్‌లైన్' క్లియర్

కాళేశ్వరంలో అదనపు నీటి తరలింపునకు రూ.14,362 కోట్లు

ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో పెరిగిన వ్యయాలకు ఓకే

ఎస్సారెస్పీ కాల్వల ఆధునీకరణకు గ్రీన్‌సిగ్నల్



### మరో టీఎంసీ...

ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రోజుకు 2 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా పనులు చేస్తున్నారు. అదనంగా మరో టీఎంసీ నీటిని తీసుకునేందుకు 3 పంప్‌హౌస్‌ల్లో కలిపి మరో 15 మోటార్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

### రూ.12,392 కోట్లకు..

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంప్‌హౌస్‌లకు కలిపి వ్యయం రూ.7,998 కోట్లు ఉండగా, ప్రస్తుతం అది రూ.12,392 కోట్లకు చేరుతోంది. ఈ పెరిగిన వ్యయాలకు కేబినెట్ ఓకే చెప్పింది.

### పైప్‌లైన్ ద్వారానే..

మిడ్‌మానేరు దిగువన మల్లన్నసాగర్ వరకు మొదట టన్నెల్ ద్వారా నీటిని తరలించాలని నిర్ణయించినా, దీని నిర్మాణాలకు చాలారోజులు పడుతున్న నేపథ్యంలో పైప్‌లైన్ వ్యవస్థ ద్వారా నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- వివరాలు 4లో



# జన విస్ఫోటనం

## మరో 8 ఏళ్లలో చైనాను దాటేస్తాం

- భారత్‌లో జనాభా రోజురోజుకీ పెరిగిపోతోంది. చైనాను దాటి నంబర్‌వన్ స్థానంలోకి రావడానికి మరెంతో కాలం పట్టేలా లేదు. మరో ఎనిమిదేళ్లలోనే అంటే 2027 నాటికి చైనా జనాభాను భారత్ దాటేస్తుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేస్తోంది.

- వివరాలు 13లో

# కస్టమ్స్, ఎక్సైజ్ అధికారులపై వేటు

- ఆదాయానికి మించిన ఆస్తులే కారణం
- వైజాగ్ జీఎస్టీ జోన్ అధికారి కూడా

- వివరాలు 13లో











*As applicable, brokerage will be levied flat @ ₹10 per executed order and not on percentage basis. The securities quoted are exemplary and are not recommendatory.

Investment in securities market are subject to market risks, read all the related documents carefully before investing. Maximum brokerage of 25 paise per share may be levied for shares having a sale / purchase value of ₹ 10/- or less. Brokerage will not exceed the SEBI prescribed limit.

Company Name: 5Paisa Capital Limited • Registered office: IIFL House, Sun Infotech Park, Road No.16V, Plot No. B-23, Wagle Estate, Thane 400 604, Tel.: 89766 89766 • CIN: L67190MH2007PLC289249 • Stock Broker SEBI Regn.: INZ000010231 • SEBI RA Regn.: INH000004680 • SEBI Depository Regn.: IN DP CDSL: IN-DP-192-2016 • AMFI REGN No.: ARN-104096, • NSE Member ID: 14300 • BSE Member ID: 6363 • MCX Member ID: 55945 • Compliance Officer: Ms. Namita Amod Godbole • Tel.: +91 89766 89766 • Email ID - compliance@5paisa.com

The scrips & charts used are for creative representation only.


ఇదంతే!



# నేడు ఎడ్‌సెట్ ఫలితాలు

**సాక్షి, హైదరాబాద్:** బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఎడ్) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎడ్‌సెట్–2019 ఫలితాలను ఈనెల 19న విడుదల చేయనున్నట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11:45 గంటలకు మండలి కార్యాలయంలో ఫలితాలను విడుదల చేస్తామని, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి విద్యార్థులు తమ ర్యాంకు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎస్.రామచంద్రం, మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, వెంకటరమణ, ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ మృణాళిని పాల్గొంటారని వెల్లడించారు. ఫలితాలను https://edcet.tsche.ac.in వెబ్‌సైట్‌లో పొందవచ్చునన్నారు.

# ఈ నెల 20న పీజీఈసెట్ ఫలితాలు

**సాక్షి, హైదరాబాద్:** ఎంఈ/ఎంటెక్, ఎం. ఫార్మసీ, ఎం. ఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పీజీఈసెట్–2019 ఫలితాలను ఈనెల 20న విడుదల చేసేందుకు సెట్ కమిటీ చర్యలు చేపట్టింది. 20వ తేదీ ఉదయం 11:30 గంటలకు ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఫలితాలను మండలి చైర్మన్, ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి విడుదల చేయనున్నారు. 19 రకాల కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఈ పరీక్షలకు 20,415 మంది దరఖాస్తు చేసుకోగా, 17,722 మంది హాజరయ్యారు.

# బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

### ఐక్య దళిత మహానాడు

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను రాష్ట్రాల వారీగా భర్తీ చేయాలని ఐక్య దళిత మహానాడు డిమాండ్ చేసింది. కొన్ని పోస్టులను జనరల్ కేటగిరిలో భర్తీ చేయడం వల్ల దళిత ఉద్యోగులకు ప్రమోషన్లు దక్కడం లేదని సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య మంగళవారం ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్ష నేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కలసి ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

# ఏప్రిల్ 30లోగా డిగ్రీ ఫైనల్ పరీక్షలు

### ‘సాక్షి’ కథనంపై స్పందించిన ఉన్నత విద్యా మండలి

**సాక్షి, హైదరాబాద్:** వచ్చే ఏడాది నుంచి ఏప్రిల్ 30వ తేదీలోగా డిగ్రీ మూడో సంవత్సర పరీక్షలు పూర్తయ్యేలా ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అన్ని రకాల చర్యలు చేపడతామని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. జూన్ నెలాఖరు వచ్చినా కొన్ని యూనివర్సిటీల్లో ఇంకా డిగ్రీ వార్షిక పరీక్షలు జరుగుతున్నాయని, జూలైలోనూ కొన్ని యూనివర్సిటీల్లో వార్షిక పరీక్షలు నిర్వహించేలా షెడ్యూలు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. కొత్త విద్యా సంవత్సర ప్రారంభంలో గందరగోళం నెలకొందని ‘సీబీసీఎస్ అమలులో గందరగోళం’శీర్షికన సాక్షిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పాపిరెడ్డి.. పాలనాపరమైన అంశాల వల్ల కొన్ని యూనివర్సిటీల్లో డిగ్రీ వార్షిక పరీక్షలు ఆలస్యంగా జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అన్ని యూనివర్సిటీల్లో చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్) పక్కాగా అమలు చేసేలా, సెమిస్టర్ పరీక్షలను సకాలంలో నిర్వహించేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఈమేరకు కామన్ అకడమిక్ కేలండర్ అమలుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తద్వారా భవిష్యత్తులో ఇబ్బందులు ఉండకుండా చర్యలు చేపట్టామని, పీజీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తామని ఆయన స్పష్టంచేశారు.

# అవసరమైన గోదాములు కేటాయించండి

### ఎఫ్‌సీఐకి అకున్ సబర్వాల్ విజ్ఞప్తి

**సాక్షి, హైదరాబాద్:** పెరుగుతున్న ధాన్యానికి అనుగుణంగా బియ్యం నిల్వలకు అవసరమైన గోదాములను కేటాయించాలని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి పౌర సరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం పౌర సరఫరాల భవన్‌లో ఎఫ్‌సీఐ, సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ అధికారులతో అకున్ సబర్వాల్ సమావేశమయ్యారు. నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల, వరంగల్ (రూరల్), మహబూబ్‌నగర్ జిల్లాల్లో గోదాముల సమస్య తీవ్రంగా ఉందని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీలో 77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఈ బియ్యాన్ని అప్పగించడానికి రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉన్నా.. ఎఫ్‌సీఐకి కావాల్సిన గోదాముల్లో స్థలం చూపించకపోవడంతో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. దీని వల్ల తెలంగాణ ప్రభుత్వానికి ఆర్థిక భారం పడుతోందన్నారు. వచ్చే ఏడాది కూడా ధాన్యం దిగుబడులు భారీగా ఉండే అవకాశాలున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని గోదాములు కేటాయించాలని కోరారు. దీనిపై త్వరలోనే కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశం కావాలని ఈ భేటీలో నిర్ణయించామని వివరించారు.

# ఆ సిబ్బంది వివరాలు పంపండి

### ఈనెల 30లోగా నివేదించాలని సీసీఎల్‌ఏ ఉత్తర్వులు

**సాక్షి, హైదరాబాద్:** రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వివరాలను పంపాలని ప్రభుత్వం కోరింది. టైపిస్టులు, డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీసు సబార్డినేట్లుగా వ్యవహరిస్తున్నవారి సమాచారాన్ని ఈ నెల 30వ తేదీలోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్లకు భూ పరిపాలనా ప్రధాన కమిషనర్(సీసీఎల్‌ఏ) లేఖ రాశారు. 2019–2020 ఏడాదికి సంబంధించిన బడ్జెట్ సన్నాహక పనుల్లో భాగంగా ఇప్పటివరకు ఔట్‌సోర్సింగ్ కింద మంజూరైన ఉద్యోగాలు, కచ్చితంగా పనిచేస్తున్న వారి వివరాలు లేకపోవడంతో సదరు సమాచారాన్ని నిర్దేశిత నమూనాలో పంపాలని ఆదేశించింది. గతంలో పాత జిల్లాల ఆధారంగా ప్రభుత్వం సిబ్బందిని కేటాయించింది. అయితే రాష్ట్ర విభజన, జిల్లాల పునర్విభజనతో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిలో ఎవరెక్కడ, ఎంత మంది పనిచేస్తున్నారనే పక్కా సమాచారం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో మంజూరు చేసిన పోస్టుల మేరకు ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారో వివరాలను పంపాలని సూచించింది.

# 11న గోదావరి బోర్డు సమావేశం

**సాక్షి, హైదరాబాద్:** వచ్చే నెల 11న గోదావరి బోర్డు సమావేశం నిర్వహించనున్నట్లు మంగళవారం ఇరు రాష్ట్రాలకు ఆ బోర్డు సమాచారం పంపింది. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు అంశంతోపాటు కొత్తగా ఇరు రాష్ట్రాలు సూచించే అంశాలపై ఇందులో చర్చిస్తామని పేర్కొంది.

# ఏపీ ప్రభుత్వ సలహాదారుగా సజ్జల

### కేబినెట్ హోదాతో నియామకం



**సాక్షి, అమరావతి:** వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఏపీ ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు)గా నియమితులయ్యారు. సజ్జల రామకృష్ణారెడ్డిని కేబినెట్ ర్యాంకులో ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ సాధారణ పరిపాలన (పొలిటికల్) శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా మంగళవారం జీవో జారీ చేశారు.

**పార్టీలో కీలక బాధ్యతలు నిర్వర్తించి..:** సౌమ్యుడిగా, మృదుస్వభావిగా పేరున్న సజ్జల రామకృష్ణారెడ్డి వైఎస్సార్‌సీపీలో కీలక భూమిక నిర్వహిస్తున్నారు. ఆవిర్భావం నుంచి ముఖ్య నేతల్లో ఒకరిగా పలు బాధ్యతలు చేపట్టారు. గత పదేళ్లుగా పార్టీలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ సీనియర్‌నేతగా, అధ్యక్షుడి రాజకీయ కార్యదర్శిగా, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వివిధ రూపాల్లో విశేష సేవలు అందించారు.

**జర్నలిస్టుగా ప్రస్థానం...:** సజ్జల రామకృష్ణారెడ్డి సాక్షి మీడియాకు ఫౌండర్ ఎడిటోరియల్ డైరెక్టర్‌గా పనిచేశారు. పత్రిక, టీవీ రంగాల్లో తనదైన ముద్ర వేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీని ఏర్పాటు చేసిన తరువాత పార్టీ అవసరాల కోసం ఆయనను వైఎస్ జగన్ రాజకీయ సలహాదారుగా నియమించారు. సజ్జల 1978లో ఈనాడులో పాత్రికేయ జీవితం ఆరంభించి ఆంధ్రభూమి, ఉదయం పత్రికల్లో అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదిగారు. తర్వాత అడ్వర్టయిజ్‌మెంట్‌తో పాటు వివిధ రంగాల్లో వ్యాపార కార్యకలాపాలు సాగించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి ఆయన అత్యంత సన్నిహితుడిగా వ్యవహరించారు.



మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, తలసాని, ఈటల, జగదీశ్‌రెడ్డి, మహమూద్‌అలీ, కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి

# స్నేహంతో సాధిస్తాం

మొదటి పేజీ తరువాయి

నిర్మాణమవుతోంది. త్వరలోనే పూర్తవుతుంది.

**ప్రపంచం అబ్బుర పడేలా కాళేశ్వరం...**

ప్రపంచమే అబ్బురపడే విధంగా కాళేశ్వరం ప్రాజెక్టును చకచకా నిర్మించాం. కొన్ని పనులు 50 శాతం పూర్తయ్యాయి. కొన్ని పనులు జరుగుతున్నాయి. ఇంత వేగంగా ప్రాజెక్టు నిర్మాణం జరగడానికి మహారాష్ట్ర ఇచ్చిన తోడ్పాటు, సహకారమే కారణం. వాళ్లు ఎంతగా తోడ్పాటు అందించారంటే ప్రాజెక్టులో భాగంగా కరకట్ట నిర్మాణం కోసం 15 ఎకరాల ప్రైవేటు భూమి, 25 ఎకరాల అటవీభూమిని ఉదారంగా ఇప్పించారు. పర్యావరణ అనుమతులు కూడా ఇప్పించారు. ఇది స్నేహ పూరితంగా ఉండటం వల్లే సాధ్యమైంది. శత్రు భావంతో ఉంటే ప్రాజెక్టును ఆపడానికి అదొక్క పాయింటు చాలు. ఇప్పుడు ఈ ప్రాజెక్టు కింద 45 లక్షల ఎకరాల్లో రెండు పంటలు పండుతాయి. ఫేజ్–1 కింద గతంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పూర్తిగా... సిరిసిల్ల, హుస్నాబాద్ ప్రాంతాల్లోని మరో 5 లక్షల ఎకరాలకు నీరందుతుంది. ఫేజ్–2లో మరో 20 లక్షల ఎకరాలకు నీరు వస్తుంది. రాష్ట్ర పారిశ్రామిక అవసరాలు, తాగునీటి అవసరాలకు కూడా ఈ ప్రాజెక్టు సమృద్ధిగా నీటిని అందిస్తుంది. ఇంత వేగంగా ఈ ప్రాజెక్టు పూర్తి కావడం అందరూ ఆశ్చర్యపోయే సందర్భం.

**దుష్ట పన్నాగాలను దాటుకొని వెళ్లాం...**

కొన్ని దుష్టశక్తులు దుష్ట పన్నాగాలు పన్నినా.. ధైర్యంగా ముందుకు వెళ్లి కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తి చేశాం. ఈ నెల దాటితే శుభ ముహూర్తం లేదనే ఉద్దేశంతో ప్రారంభోత్సవం చేస్తున్నాం. ఈ విషయంలో కొందరు అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారు. వాళ్లకు జిమ్మేదార్ తనం లేదు. బయట కూర్చున్న వాళ్లు ఎన్నైనా మాట్లాడొచ్చు. రాష్ట్రంలో 45 లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీళ్లు ఇచ్చే ప్రాజెక్టు విషయంలో విమర్శలు చేసే వాళ్లకు జ్ఞానం ఉండాలి. ప్రతిపక్షంలో ఉన్న వారికి మరీ ఇంత అసహనం పనికిరాదు. ప్రజలకు ఎప్పుడు, ఎవరికి అధికారం ఇవ్వాలో తెలుసు. ఒక రాష్ట్ర సీఎంను ఆహ్వానించేందుకు వెళ్తే రావొద్దంటూ లేఖలు రాయడం సంస్కారం అనిపించుకోదు. మీకు 50 ఏళ్ల అధికారం ఇచ్చినా ఒక్క ప్రాజెక్టూ కట్టలేదు. దేశంలో 45 లక్షల ఎకరాలకు సాగునీరు.. 80% తెలంగాణకు తాగునీరు.. 85% పారిశ్రామిక అవసరాలకు నీరు అందించే అతిపెద్ద ప్రాజెక్టు కాళేశ్వరం. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం చేసి, వక్ర భాష్యాలు చెప్పి 200కుపైగా కేసులు వేశారు. విమర్శలు చేసేవాళ్లు ఇప్పుడు చేసేదేమీ లేదు.

**కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వలేదు...**

ఇంత తక్కువ సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తి చేయడం ప్రభుత్వ ఘనతగా భావిస్తున్నాం. ప్రాజెక్టు వ్యయంలో కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వ సొంత నిధులతోపాటు బ్యాంకుల కన్సార్షియం, ఇతర ఆర్థిక సంస్థల ద్వారా నిధులు సేకరించాం. ఎన్నో సవాళ్లను అధిగమించి బ్యాంకుల కన్సార్షియాన్ని ఒప్పించి రుణం పొందాం. వాళ్లు ఇచ్చిన రుణం వినియోగించిన తీరును చూపించేందుకు ఈ నెల 20వ తేదీనే కన్సార్షియం అధికారులు చేరుకునేలా ఏర్పాట్లు చేశాం. బహుముఖంగా చేసిన పనులతో రికార్డు స్థాయిలో పనులు పూర్తి చేశాం. ఇందులో 400 కేవీ సబ్‌స్టేషన్లు ఉండటం అందుకు ఉదాహరణ. రాష్ట్రంలో ఇప్పటికే మిషన్ భగీరథ ద్వారా బిందెల ప్రదర్శన లేకుండా చూశాం. నాణ్యమైన విద్యుత్‌ను ఇచ్చాం. జూలై నెలాఖరుకు మిషన్ భగీరథ పూర్తి చేస్తాం. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా దేవాదుల, సీతారామ ప్రాజెక్టు పనులు కూడా పూర్తి చేసి ప్రారంభిస్తాం. కృష్ణా నదిపై పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు పనుల కోసం బ్యాంకుల కన్సార్షియం రూ. 10 వేల కోట్ల రుణం ఇచ్చింది. మొత్తంగా ఏడాదిన్నరలోగా రాష్ట్రంలో సాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

**సాగు నీరు ఇవ్వాలనే పట్టుదలతో జగన్**

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రావాలని స్వయంగా మహారాష్ట్ర, విజయవాడలకు వెళ్లి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించా. ఇద్దరూ వచ్చేందుకు అంగీకరించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయితే ఒప్పందం చేసుకొని కొన్ని రోజులే అయింది కదా... అప్పుడే ప్రాజెక్టు పూర్తి చేశారా అంటూ అభినందించారు కూడా. ఇక ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముఖ్యమంత్రి యువకుడు, ఉత్సాహవంతుడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమలోని మెట్ట ప్రాంతాలకు నీరివ్వాలని ఆయన పట్టుదలతో ఉన్నాడు. అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసుకోవాలని, బేషజాలు పనికి రావనే అభిప్రాయంతో ఉన్నాడు. అందుకోసం ఈ నెల 27, 28 తేదీల్లో ఏపీ సాగునీటిశాఖ అధికారులు ఇక్కడకు వస్తున్నారు. ఒకట్రెండు రోజులపాటు ఇక్కడ చర్చలు జరుపుతారు. రెండో సమావేశం విజయవాడలో ఉంటుంది. అవసరమైతే క్షేత్రస్థాయి పరిశీలనకు సంయుక్త బృందాలు కూడా వెళ్తాయి.

**4,800 టీఎంసీలు వాడుకోవచ్చు...**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమైనా... ఏపీ, తెలంగాణ అయినా రెండు రాష్ట్రాలకు కలిపి 1,480 టీఎంసీల గోదావరి నీరు వినియోగించుకోవచ్చు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 811 టీఎంసీల కృష్ణా నీటిని కూడా వినియోగించుకోవచ్చు. రెండూ కలిపి రమారమి 2,300 టీఎంసీల నీరుంది. ఇక తెలుగు రాష్ట్రాల తర్వాత బంగాళాఖాతమే కాబట్టి మిగులు జలాలు మీరే వాడుకోవచ్చని ట్రిబ్యునల్ చెప్పింది. 50 ఏళ్ల కేంద్ర జలవనరుల సంఘం రికార్డులను పరిశీలిస్తే 3,500 టీఎంసీల పైచిలుకు నీరు సముద్రంలోకి వెళ్తోంది. ఒక్కో ఏడాది అది 5–6 వేల టీఎంసీలు కూడా ఉంది. చిన్నచిన్నవి కలిపి మరో 500 టీఎంసీలు కూడా ఉంటాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు సరాసరి 1,200 టీఎంసీల నీరు వస్తుంది. అంటే దాదాపు 4,700 నుంచి 4,800 టీఎంసీల నీరు రెండు రాష్ట్రాలు వాడుకోవచ్చు. పొరపొచ్చాలు, అపార్థాలు, అవసరంలేని కయ్యాలు, కీచులాటల వల్ల ఈ నీటిని వాడుకోకుండా తెలుగు రాష్ట్రాల ప్రజలు నష్టపోయారు. అందుకే కేంద్రం వద్దకు వెళ్లి పరిష్కారం చేసుకోవాల్సిన దుర్గతి కూడా వద్దనుకున్నాం. ఇదే ఉత్తమ మార్గమని మా కేబినెట్ కూడా నిర్ణయానికి వచ్చింది.

**ఐయాం ది అచీవర్..!**

ఢిల్లీలో జరిగే అఖిలపక్ష సమావేశానికి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో తలమునకలుగా ఉండటం వల్లే నేను హాజరు కాలేకపోతున్నా. దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు జరపాలనే ప్రతిపాదనకు మద్దతిస్తున్నాం. గతంలో మిషన్ భగీరథ ప్రారంభోత్సవానికి ప్రధానిని పిలిచాం. కాళేశ్వరం ప్రారంభోత్సవాన్ని నేనే సంతృప్తిగా చేద్దామనుకుంటున్నా. ఐయాం ది అచీవర్. ప్రధానిని ఆహ్వానించేందుకు ఒక సమయం, సందర్భం ఉంటుంది. కొందరు సిల్లీ వ్యక్తులు ఏవేవో ఊహించుకొని విమర్శలు చేస్తున్నారు. మేం రాజకీయంగా ఉండాల్సినంత బలంగా ఉన్నాం. అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మేం చాలా రికార్డులు బ్రేక్ చేస్తున్నాం. ఇవన్నీ చాలా మందికి నచ్చవు. మాకు ఎవరితోనూ పంచాయితీ లేదు. మేం ఎన్డీయేలో భాగస్వాములను కాదని ప్రపంచమంతా తెలుసు. నేను ప్రమోట్ చేసిన ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదనకు కట్టుబడి ఉన్నా. కేంద్రంతో రాజ్యాంగపరమైన సంబంధాలు కొనసాగిస్తాం. మేం చేయాల్సింది మేము.. వారు చేయాల్సింది వారు చేస్తారు. దీనికి లేనిపోని కథలు అల్లొద్దు.

**కేంద్రానికి అంశాలవారీ మద్దతు...**

మోదీ ప్రధాని అయిన తర్వాత గతంలో అతికఠినంగా విమర్శించింది నేనే.. సీలేరు పవర్‌ప్లాంటుతోపాటు ఏడు మండలాలు లాక్కోవడంపై ప్రధానిని ‘ఫాసిస్ట్’అని విమర్శించా. అయితే కేంద్రానికి అంశాలవారీగా మద్దతు ఇచ్చాం. మాకు నచ్చని చోట వ్యతిరేకించాం. ఇప్పుడు అలాంటి సంబంధమే కొనసాగిస్తాం. కేంద్రం నుంచి గత ఐదేళ్లలో మాకు రూపాయి రాలేదు. నిధుల విషయంలో అమిత్ షాను ‘ఆపరేషన్ బ్లూస్టార్’చేసింది నేనే. మాకు కేంద్రం నుంచి నిధులు రాలేదనే అంశంలో కాగ్ నివేదిక చూస్తే విషయాలు తెలుస్తాయి. గతంలో మిషన్ భగీరథకు రూ. 24 వేల కోట్లు ఇవ్వాలంటే 24 రూపాయలు కూడా ఇవ్వలేదు. బీఆర్‌జీఎఫ్ గ్రాంటు కింద రూ. 450 కోట్లు నాలుగేళ్లు ఇచ్చి చివరి ఏడాది ఎగ్గొట్టారు. కేంద్రం నుంచి సాయం లేకున్నా రుణమాఫీ చేస్తాం. నిధుల కోసం ఆర్జీలు ఇస్తాం. లేకున్నా ముందుకు సాగుతాం. ప్రాజెక్టుల విషయంలో కేంద్రం మాకు మెహర్బానీ ఏం చేయలేదు.

**మధ్యవర్తిత్వం అవసరం లేదు**

నదీ జలాల పంపకానికి సంబంధించి కేంద్రం ఏర్పాటు చేసిన బ్రజేష్ ట్రిబ్యునల్ 2004 నుంచి ఇప్పటివరకు 15 ఏళ్లుగా తీర్పు ఇవ్వలేదు. ఇలా అయితే అనుమతులు ఎప్పుడు వస్తాయి. ప్రాజెక్టులు ఎప్పుడు కట్టాలి. ఇదే అంశాన్ని ఏపీ సీఎం జగన్‌కు చెప్పా. సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీకి వెళ్లాల్సిన అవసరంగానీ, గవర్నర్ మధ్యవర్తిత్వంగానీ అవసరం లేదు. ఐదు నిమిషాలు కూర్చుంటే సమస్యలు పరిష్కారం అవుతాయి. ట్రిబ్యునల్, కోర్టుల తీర్పుతో సంబంధం లేకుండా రెండు ప్రభుత్వా లు పరస్పరం సహకరించుకొని త్వరితగతిన ప్రాజెక్టులు పూర్తి చేసి నీళ్లిస్తే ప్రజలు స్వాగతిస్తారు. ప్రాజెక్టుల అనుమతి విషయంలో మేము కష్టపడి అనుమతులు తెచ్చుకున్నాం. తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణంలో అహోరాత్రులు శ్రమించా. ఇప్పుడు అదే రీతిలో కష్టపడతాం. ఎత్తిపోతల పథకాలతో ప్రయోజనం లేదని భావించే వాళ్లు అందులో దూకి చావాలి.

## త్వరలో పీఆర్‌సీపై నిర్ణయం

పీఆర్‌సీతోపాటు ఉద్యోగుల వయోపరిమితి పెంపు అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. రాబోయే కొద్దిరోజుల్లో ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు జరిపి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తాం. 61 ఏళ్ల వరకు ఉద్యోగ విరమణ వయసు పెంపు ప్రతిపాదన ఎప్పటి నుంచి, ఎలా అమలు చేయాలనే అంశంపై చర్చిస్తాం. పీఆర్‌సీ, ఉద్యోగ విరమణ వయసు పెంపు పరస్పరం ముడిపడిన అంశాలు కావడంతో రాష్ట్ర ఆర్థిక వనరులను అధ్యయనం చేసి ఎంత మేరకు భారం పడుతుందో చూసి ఒక ప్యాకేజీ కింద ఇస్తాం.

## కాళేశ్వరం ప్రారంభోత్సవం ఇలా..

గవర్నర్ నరసింహన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరుగుతుంది. నేనే ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నా. ఏపీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు జగన్‌మోహన్‌రెడ్డి, దేవేంద్ర ఫడ్నవిస్ ముఖ్య అతిథులుగా వస్తున్నారు. వారితోపాటు ఆయా రాష్ట్రాల మంత్రులూ వస్తున్నారు. మేడిగడ్డ, కన్నెపల్లి ప్రాంతాల వద్ద ఏర్పాట్లను మంత్రి ఈటల రాజేందర్ సమన్వయపరుస్తారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు, ఐదు పంపింగ్ స్టేషన్ల వద్ద ఏర్పాట్లను మరో ఐదుగురు మంత్రులు పర్యవేక్షిస్తారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవ సమయానికి వారు అక్కడ టెంకాయ కొట్టి పూజలు చేస్తారు. ప్రధానమైన బ్యారేజీ మేడిగడ్డ వద్ద నేనే పూజ చేస్తాను. హోమం కూడా నిర్వహిస్తున్నాం. గతంలో శంకుస్థాపన అక్కడే చేశాం. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కూడా పూజ చేసి గ్రావిటీ కెనాల్‌కు నీళ్లు ఎత్తిపోసే విధంగా స్విచ్ ఆన్ చేస్తాం. మధ్యాహ్న భోజనం అనంతరం అతిథులను సత్కరించి వారికి వీడ్కోలు పలుకుతాం.

**5 హెలికాప్టర్లు.. 6 హెలిప్యాడ్లు...**

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఆరు హెలిప్యాడ్లు సిద్ధం చేశాం. ఏపీ సీఎం జగన్ ఆ రాష్ట్ర ప్రభుత్వ హెలికాప్టర్‌లో వస్తుండగా గవర్నర్, మహారాష్ట్ర సీఎంతో పాటు బ్యాంకు కన్సార్షియం అధికారులను తీసుకెళ్లేందుకు మరో నాలుగు హెలికాప్టర్లు ఉపయోగిస్తున్నాం. ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగే చోట విశాలమైన స్థలం లేకపోవడంతో బహిరంగ సభ నిర్వహించడం లేదు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర కూడలి పూర్తిగా అడవితో ఉండటం, వర్షం పడితే తలెత్తే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మీడియాకు కూడా ఆహ్వానం పంపడం లేదు.

## ప్రస్తుతమున్న చోటే సచివాలయం.. ఎర్రమంజిల్‌లో అసెంబ్లీ..

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారడం వల్ల హైదరాబాద్‌లో సచివాలయం, శాసన సభ భవనాల అప్పగింత దాదాపు పూర్తయింది. బుధవారం అధికారికంగా అప్పగించే అవకాశం ఉంది. ఈ రెండు భవనాలు ఖాళీ అయిన తర్వాత తెలంగాణకు కొత్తగా సచివాలయం, అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలని మంత్రివర్గం తీర్మానించింది. సెక్రటేరియట్‌ను ప్రస్తుతమున్న చోటే నిర్మించడంతో పాటు ఎలా నిర్మించాలనే దానిపైనా చర్చించాం. గతంలో సచివాలయం నిర్మాణం కోసం బైసన్ పోలో మైదానం ఇవ్వాల్సిందిగా కేంద్రాన్ని అడిగాం. అయితే సెక్రటేరియట్ భవనాలు ఇచ్చేది లేదని ఏపీ ప్రభుత్వం భీష్మించడంతో ప్రత్యామ్నాయం కోసం అన్వేషించాం. ప్రస్తుతమున్న చోటే అనువుగా ఉండటంతో సెక్రటేరియట్ ఇక్కడే నిర్మించాలని నిర్ణయించాం. సుమారు ఐదారు లక్షల చదరపు అడుగుల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆధునిక హంగులతో కూడిన భవన నిర్మాణం కోసం రూ. 400 కోట్లలోపు ఖర్చయ్యే అవకాశం ఉంది. అసెంబ్లీ భవనం కూడా దాదాపు రూ. 100 కోట్లతో పూర్తయ్యే అవకాశం ఉంది. శాసన మండలి, శాసనసభ, సెంట్రల్ హాల్ సమాహారంగా పార్లమెంటు తరహాలో లెజిస్లేచర్ సెక్రటేరియట్‌తోపాటు ఎర్రమంజిల్‌లోని ఇంజనీరింగ్ కార్యాలయాల సముదాయంలో 17 ఎకరాల స్థలంలో నిర్మిస్తాం. ప్రస్తుతమున్న అసెంబ్లీ భవనం చారిత్రక సంపదను కాపాడుతూ.. కొత్తగా కట్టే అసెంబ్లీ భవనం కూడా ఇదే ఎలివేషన్ ఉండాలని నిర్ణయించాం. రాజులు కట్టి ఇచ్చిన చరిత్ర రిచ్ కాబట్టి బయటకు పాత, కొత్త భవనాలు ఒకేలా కనబడేలా నిర్మించాలనుకుంటున్నాం. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్కిటెక్టులు భవనాల డిజైన్లు పంపిస్తున్నారు. ఫౌంటెయిన్లు, గార్డెన్లతో హుస్సేన్‌సాగర్‌కు అభిముఖంగా సెక్రటేరియట్ నిర్మిస్తాం. దసరా వరకు మంచిరోజులు లేకపోవడంతో ఈ నెల 27న దశమి రోజున సెక్రటేరియట్, సచివాలయం భవనాలకు భూమి పూజ చేస్తాం. సెక్రటేరియట్ కూల్చివేత తదితరాలకు సంబంధించి మంత్రి ప్రశాంత్ రెడ్డి నేతృత్వంలో ఉపకమిటీ వేశాం. సబ్ కమిటీ నివేదికపై తుది నిర్ణయం తీసుకునే బాధ్యతను సీఎం కేసీఆర్‌కు అప్పగిస్తూ కేబినెట్ నిర్ణయించింది. కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని నిర్ణయించాం. పంచాయతీరాజ్ సంస్థలన్నింటినీ క్రియాశీలకం చేయాలని, వారికి హరితహారం, ఉపాధి హామీ వంటి పథకాల అమలు అప్పగింతపై పరిశీలన చేస్తున్నాం. వచ్చే కేబినెట్ భేటీ నాటికి ఓ నిర్ణయానికి వస్తాం. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఇవ్వాల్సిన అధికారాలు, నిధులను ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించాం.

# జూలైలో పుర ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

కేటాయించాలని నిర్ణయించినట్లు సీఎం కేసీఆర్ తెలిపారు. ‘‘స్టూడియో కట్టుకోవడానికి శంకర్ చాలా రోజుల నుంచి స్థలం కోరుతున్నరు. తెలంగాణవాది కావడం, తెలంగాణ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించడం, తెలంగాణ బిడ్డ కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నం. విశాఖ శారదా పీఠం ట్రస్టుకు కూడా రెండెకరాల స్థలం కేటాంచాలని నిర్ణయించినం. అలాగే రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను 31 జిల్లాల్లో టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల స్థాపన కోసం స్థల కేటాయింపులు జరపాలని నిర్ణయించాం. ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయాన్ని ఇప్పటికే నిర్మించినం. వరంగల్ రూరల్ జిల్లా పార్టీ కార్యాలయానికి సంబంధించి స్థల కేటాయింపుల్లో మార్పు చేయాలని ఆ జిల్లా మంత్రులు, శాసనసభ్యులు అభిప్రాయపడడంతో ఆ జిల్లా పార్టీ కార్యాలయానికి స్థల కేటాయింపులను వాయిదా వేశాం. హైదరాబాద్ జిల్లా పార్టీ కార్యాలయం కోసం స్థలాన్ని అన్వేషిస్తున్నం’’ అని తెలిపారు.

**కిషన్‌రెడ్డి జోక్‌గా మారారు..**

ఉగ్రవాదానికి హైదరాబాద్ అడ్డాగా మారిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు విని జనం నవ్వుకుంటున్నారని కేసీఆర్ తెలిపారు. కిషన్‌రెడ్డి ఒక జోక్‌గా మారారని ఎద్దేవా చేశారు. ఏపీ చరిత్ర తిరిగేసి చూస్తే ప్రతి సంవత్సరం పది, పన్నెండుసార్లు మత కల్లోలాలు జరిగేవని, గత 5 ఏళ్ల పరిపాలనలో ఒక్కసారి కూడా మత కలహాలు జరగలేదని గుర్తుచేశారు. విపరీతంగా నేరాలు తగ్గాయని కేంద్ర హోంశాఖ స్వయంగా చెప్పిందన్నారు. ఉగ్రవాదానికి అడ్డాగా మారిందని అనడానికి ఏమైనా అర్థం ఉందా అని పేర్కొన్నారు. బాధ్యత గల వ్యక్తులు ఇలా మాట్లాడవచ్చా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక చిన్న సంఘటన లేదని, ఒక ఉగ్రవాద దాడి జరగలేదని, తాము చాలా క్రియాశీలంగా ఉన్నామని స్పష్టంచేశారు. భారత దేశంలో ఇంత చక్కగా ఏ రాష్ట్రం లేదని వ్యాఖ్యానించారు.

**టీఆర్టీ అభ్యర్థులకు త్వరలో ఉద్యోగాలు**

టీఆర్టీ ఉద్యోగాలకు ఎంపికై న వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వాలని ఆదేశించినట్టు కేసీఆర్ తెలిపారు. టీఆర్టీ అభ్యర్థులు నిర్వహించిన ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమం రాజకీయ ప్రేరేపితమని, అలాంటి ధర్నాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, కోర్టు కేసులున్న పోస్టులను పక్కనబెట్టి మిగిలిన పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించినట్లు విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు.

# ఉద్యోగ సంఘాల అసంతృప్తి

**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఉద్యోగులకు మధ్యంతర భృతి, పీఆర్సీ, ఉద్యోగ విరమణ వయస్సు 61 ఏళ్లకు పెంపు తదితర అంశాలపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటారని భావించగా.. ప్రభుత్వం తమను నిరాశ పరిచిందని ఉద్యోగ సంఘాల నేతలు విమర్శించారు. ఇది ఉద్యోగులు, పెన్షనర్లకు అవమానించడమేనని టీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ అబ్దుల్లా, చందూరి రాజిరెడ్డి పేర్కొన్నారు.

**ఆందోళన అవసరం లేదు: వి.మమత**

ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ప్రకారం ఉద్యోగుల సమస్యలకు త్వరలో పరిష్కారం లభిస్తుందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సెక్రటరీ జనరల్ వి.మమత తెలిపారు. కేబినెట్ నిర్ణయం మేరకు త్వరలోనే ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి తగిన నిర్ణయం తీసుకుంటారన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం ప్రకటిస్తారని, అందువల్ల ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె పేర్కొన్నారు.

**త్వరగా సమావేశం ఏర్పాటు చేయాలి: టీఈఏ**

కేబినెట్ నిర్ణయం మేరకు ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసేందుకు త్వరగా చర్యలు చేపట్టాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ సంపత్ కుమార స్వామి విజ్ఞప్తి చేశారు. మధ్యంతర భృతి తదితర అంశాలపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెప్పడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

# 2, 3 తడులతో సరిపోయేలా..

మొదటి పేజీ తరువాయి

మళ్లే విధంగా సిద్ధంగా ఉండాలని అధికారులకు మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఎలాంటి పంటలు సాగు చేయాలనే దానిపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**తక్కువ నీటితో పంటల సాగు...**

నైరుతి రుతుపవనాలు సాధారణంగా ఈ నెల 8వ తేదీన రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించినా ఇప్పటి వరకు వాటి జాడలేదు. ఈ నెల 22 లేదా 23వ తేదీన వస్తాయని ప్రకటించారు. ఆ తేదీల్లోగా వచ్చినా రాకున్నా ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులు లక్షల ఎకరాల్లో విత్తనాలు ఇప్పటికే చల్లాల్సి ఉండగా, వేలాది ఎకరాల్లో కూడా వేయలేకపోయారు. ఆ మధ్య ఆదిలాబాద్‌సహా అక్కడక్కడా పత్తి విత్తనాలు వేసినా, చినుకు పడక వేడికి అవి భూమిలోనే మాడిపోయాయి. జూన్‌లో సాధారణం కంటే 60 నుంచి 70 శాతం తక్కువ వర్షపాతం నమోదయ్యే పరిస్థితి నెలకొంది. వాస్తవంగా ఈ నెల 20 నాటికి వరి నార్లు పోసుకోవాల్సి ఉండగా ఎక్కడా ఆ ఊసు లేదు. ఖరీఫ్‌లో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల విత్తనాల పంపిణీ లక్ష్యంగా ఉంది. ఇందులో ఇప్పటివరకు 1.85 లక్షల క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే విక్రయించినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఇందులో వరి ఈసారి 2.80 లక్షల విత్తనాల పంపిణీ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 31 వేల క్వింటాళ్లు మాత్రమే అమ్ముడుపోయాయి. సోయాబీన్ 2 లక్షల క్వింటాళ్లకుగాను 85 వేల క్వింటాళ్లు విక్రయించారు. మొక్కజొన్న 80 వేల క్వింటాళ్లకుగాను ఒక క్వింటా కూడా రైతులు కొనుగోలు చేయలేదు. ఈ ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 1.10 కోట్ల ఎకరాలలో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ ముందుగా అంచనా వేసింది. అయితే, నైరుతి ఆలస్యంతో దీనిని తగ్గించనున్నారు. వర్షధార పంటల్లో కూడా చాలా తక్కువనీటితో రెండు, మూడు తడులు ఇస్తే పండే పంటల వైపు రైతులను మళ్లించనున్నారు. వర్షాలు ఆలస్యం అవుతుండటంతో పత్తి సాగు తగ్గించడం, ఈ పంటను నల్ల నేలలకే పరిమితం చేయడం వంటివి ప్రత్యామ్నాయ ప్లాన్‌లో భాగంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎక్కువ నీటి అవసరంలేని మొక్కజొన్న, జొన్న, కంది, సోయాబీన్ సాగును ప్రోత్సహించనున్నారు. ఇందులో స్వల్పకాలిక రకాల విత్తనాలు వ్యవసాయశాఖ, విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అందుబాటులో ఉంచనుంది. మొక్కజొన్న, పత్తి, సోయాచిక్కుడు జూలై 15 వరకు విత్తుకోవచ్చని వ్యవసాయవర్సిటీ శాస్త్రవేత్తలు



తెలిపారు. కంది జూలై 31 వరకు, పెసర, జొన్న జూన్ 30 వరకు, మధ్యకాలిక రకాలతో వరి నారు పోసుకోవడానికి జూలై 10, స్వల్పకాలిక రకాలకు జూలై 31 వరకు అవకాశముంది. వర్షాభావ పరిస్థితుల్లో ఎరువుల వాడకంపై, నీటి ఆదాపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.




మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి. చిత్రంలో సంఘం ప్రతినిధులు

# తప్పుదోవ పట్టించొద్దు

## కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ పక్షాలకు రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం సూచన

సాక్షి, హైదరాబాద్

- ప్రాజెక్టులో మొత్తంగా 64%, అందులో మేడిగడ్డ–ఎల్లంపల్లి వరకు 90% పనులు పూర్తి
- దక్షిణ తెలంగాణకు కూడా ఈ ప్రాజెక్టు వరప్రదాయిని
- ప్రాజెక్టులో వైఎస్సార్, కేసీఆర్ ఇద్దరూ భాగస్వాములే

కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం వివిధ రాజకీయ పక్షాలకు సూచించింది. ప్రాజెక్టు విషయంలో దుష్ప్రచారాలు మానుకోవాలని హితవు పలికింది. ప్రాజెక్టు పనులు కేవలం 15% మాత్రమే పూర్తయ్యాయని, అందుకు రూ.50వేల కోట్లు ఖర్చయ్యాయంటూ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేసిన విమర్శలు సరికాదని పేర్కొంది. ఇప్పటివరకు కాళేశ్వరం ప్రాజెక్టు పనులు 64% పూర్తవగా, మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు 90 శాతానికి పైగా పూర్తయ్యాయని స్పష్టం చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం ప్రతినిధులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు చేపట్టిన నిర్మాణాల ఒప్పంద విలువే రూ.11 వేల కోట్లని, పెరిగిన అంచనా వ్యయాలు రూ.2వేల కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని తెలిపారు. అయితే కొందరు ఎల్లంపల్లి వరకు చేపట్టిన పనులకే రూ.50 వేల కోట్లు ఖర్చు చేశారనడం వాస్తవం కాదన్నారు. ప్రాజెక్టు పూర్తి కాకుండానే నీటి విడుదల చేస్తున్నారంటూ కొందరు మాట్లాడుతుండటం సరికాదన్నారు. ఏ ప్రాజెక్టు అయినా దశలవారీగా నీటి విడుదల చేయడం సర్వసాధారణమన్నారు. గతంలో ఎస్సారెస్పీ ద్వారా ఏకంగా ఏడెనిమిది దశల్లో నీటి విడుదల జరిగిందని, నాగార్జున సాగర్, ఏఎంఆర్పీ ప్రాజెక్టుల్లోనూ దశలవారీ నీటి విడుదల జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం కాళేశ్వరం ద్వారా నీటి విడుదలతో శ్రీరాంసాగర్ రెండు దశల కింద ఉన్న ఆయకట్టు స్థిరీకరణ చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఏపీ సర్కారు కేసులు వేయడం అర్థం చేసుకోవచ్చని, కానీ మన ప్రాంతం నాయకులే కేసులు వేయడం దురదృష్టకరమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉత్తర తెలంగాణకు మాత్రమే కాకుండా మున్ముందు దక్షిణ తెలంగాణకు కూడా వరప్రదాయిని, ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధమైనట్లు ఆయన వెల్లడించారు.

**వైఎస్సార్, కేసీఆర్ ఇద్దరూ మహానుభావులే..**

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఒక్క పంట కోసం చేపట్టాలని సూచించారని, దానికి అనుగుణంగా ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.38వేల కోట్లుగా తేల్చారని, అయితే తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ మాత్రం రెండు పంటల కోసం రీడిజైన్ చేశారని అందుకే వ్యయం రూ.80వేల కోట్లకు పెరిగిందని రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ వెంకట్రామారావు అన్నారు. వైఎస్ హయాంలో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని డిజైన్ చేస్తే ఇప్పుడు ఏకంగా స్థిరీకరణతో సహా 37 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా డిజైన్ చేశారని, కాబట్టి ఈ ప్రాజెక్టులో వైఎస్సార్, కేసీఆర్‌లు ఇద్దరూ భాగస్వాములేనని తెలిపారు. గోదావరి జలాల వినియోగం విషయంలో వైఎస్సార్, కేసీఆర్ చూపిన చొరవ మరువరానిదని, ఇద్దరూ ఈ విషయంలో మహానుభావులేనని అన్నారు. ఈ ప్రాజెక్టు సాకారం అయితే వైఎస్ ఆత్మ ఆనంద పడుతుందన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వస్తే ఆయన హర్షం వ్యక్తం చేస్తారని తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఏ ఒక్కరూ మాట్లాడవద్దని విశ్రాంత ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి కోరారు. తెలంగాణకు ఎత్తిపోతల పథకాలు భారమంటూ లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాశ్‌నారాయణ మాట్లాడటం ఆయన దుష్ట బుద్ధికి నిదర్శనమని రిటైర్డ్ ఇంజనీర్ భూమయ్య అన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఇంజనీర్లు కెప్టెన్ జనార్దన్, సత్తిరెడ్డి, దామోదర్‌రెడ్డి, రాంరెడ్డి, జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

### అత్యధిక ఫీజులు కలిగిన

# నగరం మనదే..

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్

- ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం..
- 4 వేల ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధం

హైదరాబాద్



ఫీజుల పెంపు అంశంపై మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్.

ప్రస్తుత పరిస్థితుల్లో ధనం లేనిదే విద్య లేదని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఫీజుల పెంపు అంశంపై మంగళవారం అబిడ్స్‌లోని మెథడిస్ట్ ఇంజనీరింగ్ కళాశాలలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే అత్యధిక ఫీజులు కలిగిన నగరంగా హైదరాబాద్ ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ లేకపోవడం వల్ల ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకుండా ప్రైవేటు పాఠశాలలకు ఊతమివ్వడం దారుణమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు లేరనే సాకుతో దాదాపు 4 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 8,792 పోస్టుల భర్తీకి టీఆర్‌టీ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ రెండేళ్లుగా వారికి పోస్టింగ్ ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రశ్నపత్రాలను మూల్యాంకనం చేసే సిబ్బంది అర్హులో కాదో కూడా చూసుకోకపోవడం వల్ల పలువురు ఇంటర్ విద్యార్థులు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలా పరీక్షలు నిర్వహించలేదన్నారు. ఫీజుల పెంపు విషయంలో తల్లిదండ్రుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని, ఒత్తిడి పెంచే విధంగా పలు కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

**19, 20 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు...**

యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌గౌడ్ మాట్లాడుతూ అడ్డగోలుగా ఫీజులు పెంచడాన్ని నిరసిస్తూ ఈ నెల 19, 20 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలోని కార్పొరేట్ పాఠశాలల ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 24న రాష్ట్ర విద్యాశాఖ కమిషనరేట్ ముట్టడి, మహాధర్నా, ఈ నెల 29న ఇందిరాపార్కు వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి మహార్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మనోహర్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్, హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ ఫోరం అధ్యక్షుడు ఆశీష్, ఓయూ జూనియర్ లెక్చరర్ల ఫోరం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, బీజేవైఎం జాతీయ కార్యదర్శి బద్దం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 22న కొన్ని ఎంపీపీ పదవులకు ఎన్నికలు

**సాక్షి, హైదరాబాద్:** ఈనెల 22న మధ్యాహ్నం 3 గంటలకు ఐదు మండలాల్లో ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష, మరో ఐదు మండలాల్లో ఎంపీపీ ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ప్రకటించింది. గతంలో కోరం లేకపోవడం, ఇతరత్రా కారణాలతో ఈ పదవులకు ఎన్నికలు జరగకుండా వాయిదా పడడంతో మరో తేదీని ఎస్ఈసీ ఖరారు చేసింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల కోసం ఏర్పాటు చేసే ప్రత్యేక సమావేశానికి రెండుసార్లు కోరంలేక వాయిదా పడితే... మూడోసారి కోరం ప్రకారం సభ్యులు హాజరైనా, కాకపోయినా ఆ ఎన్నికలు పూర్తి చేయాలని ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 22న 5 మండలాల్లో ఎంపీపీ అధ్యక్ష, మరో 5 మండలాల్లో ఎంపీపీ ఉపాధ్యక్ష స్థానాలకు జరుగుతాయి. ఈ నెల 22న ఎన్నికల నిర్వహణకు సంబంధించి 21న నోటీసులు జారీ చేయనున్నారు.






# అగ్రి బిజినెస్.. సేవల కోసం 'అభ్యాస్'

సాక్షి, హైదరాబాద్

**వ్యవసాయంపై దృష్టి సారించేలా ఏడాది డిప్లొమా కోర్సు**

- రెండేళ్లలో దేశవ్యాప్తంగా 50వేల మంది నిపుణులను తయారు చేసే లక్ష్యం
- ఐకార్ నిర్ణయం.. సూచనలు ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయశాఖకు లేఖ
- ఏడాదిలో మూడు నెలలు తరగతి గదిలో.. మిగతా కాలం రైతుల వద్ద



అగ్రి సర్వీసెస్ అండ్ బిజినెస్ బై హార్‌నెస్సింగ్ యూత్ త్రూ అగ్రికల్చర్ స్కిల్స్ (అభ్యాస్) పేరుతో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) ఏడాది డిప్లొమా కోర్సును రూపొందించింది. రైతులకు అవసరమైన సేవలు అందించడం ద్వారా గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు పొందేలా యువతీ యువకులను నిపుణులుగా తీర్చిదిద్దడమే అభ్యాస్ ప్రధాన లక్ష్యం. దేశవ్యాప్తంగా వచ్చే రెండేళ్లలో ఈ కోర్సు ద్వారా 50 వేల మంది నిపుణులను తయారు చేయాలని ఐకార్ నిర్ణయించింది. ఈ మేరకు డిప్లొమా కోర్సుపై సూచనలు ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయశాఖకు లేఖ రాసింది. ఈ నెల 21 నాటికి సూచనలు పంపాలని తెలిపింది. ఏడాది కోర్సు అనంతరం శిక్షణ పొందిన యువతీ యువకులు గ్రామాలు, మండల కేంద్రాల్లో భూసార పరీక్ష కేంద్రాలు, డయాగ్నస్టిక్ లేబరేటరీస్, వ్యవసాయ యంత్రాలను అద్దెకు ఇచ్చే కేంద్రాలను, విత్తన పరీక్ష ప్రయోగశాలలను నెలకొల్పుకోవడానికి ప్రోత్సహిస్తారు. ఆ మేరకు వారికి శిక్షణ ఉంటుంది. అలాగే సేంద్రియ వ్యవసాయం, మొక్కల ఆరోగ్య యాజమాన్యం, సురక్షిత వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు సేవలు అందించడం కోసం ప్రత్యేకంగా కన్సల్టెన్సీల అవతారం ఎత్తవచ్చు. దీనికోసం అవసరమైన ప్రోత్సాహకం కూడా ఇస్తారు. ఇక నాణ్యమైన విత్తనాలు, సేంద్రియ ఎరువులు, పశువులకు దాణా వంటి వాటిని కూడా ఈ నిపుణులు రైతులకు అందుబాటులో ఉంచుతారు. ఆయా రంగాల్లో ఔత్సాహిక అగ్రి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా విద్యార్థులను తీర్చిదిద్దుతారు.

**రూ. 15 వేల వరకు ఫెలోషిప్..**

ఏడాది డిప్లొమా కోర్సుకు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు. ఈ కోర్సులో ప్రవేశాలకు ప్రత్యేకమైన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఐకార్ ద్వారా స్కాలర్‌షిప్ ఇస్తారు. ఈ కోర్సు రెండు దశల్లో జరుగుతుంది. మొదటి మూడు నెలలు తరగతి గదిలో శిక్షణ ఇస్తారు. వీరికి ఈ మూడు నెలలకు నెలకు రూ. 15 వేల చొప్పున ఫెలోషిప్ ఇస్తారు. ఇక మిగిలిన తొమ్మిది నెలలు గ్రామ పంచాయతీల్లో రైతుల వద్దకు వెళతారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి రెండు గ్రామ పంచాయతీలు అప్పగిస్తారు. వీరు రైతులకు వ్యవసాయంలో వస్తున్న మార్పులపై అవగాహన కల్పిస్తారు. అలాగే రైతుల అవసరాలను నేరుగా గమనిస్తారు. తద్వారా మున్ముందు ఎటువంటి కార్యకలాపాలు చేపట్టవచ్చో గుర్తిస్తారు. శిక్షణ కాలంలో వీరిని ఐకార్ ఆధ్వర్యంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కేవీకే కేంద్రాలు తదితర సంస్థలకు అనుసంధానం చేస్తారు.

**ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు కోసం..**

2022 నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ అభ్యాస్ అనే కోర్సుకు శ్రీకారం చుట్టిందని ఆ లేఖలో ప్రస్తావించింది. తద్వారా వ్యవసాయ పంటల ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం కోసం ఈ నిపుణులు కృషిచేస్తారు. అగ్రి బిజినెస్ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంపొందించడంలో తాము కూడా భాగస్వాములవుతారు. మరోవైపు యువత వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందుతారని కేంద్రం తెలిపింది. దీనిపై రాష్ట్ర వ్యవసాయశాఖ అధ్యయనం చేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా రెండేళ్లలో దాదాపు 3 వేల మందికి ఈ కోర్సులో అవకాశం ఉండొచ్చని అంచనా.


**హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్**

**HP ల్యూబ్రికెంట్స్ కోసం క్లియరింగ్ & ఫార్వార్డింగ్ ఏజెంట్స్ (CFAs) నియామకం**

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఫార్చ్యూన్ 500 కంపెనీ మరియు భారతదేశంలోని అతిపెద్ద ల్యూబ్ మార్కెటర్, భారతదేశంలో కెల్ల అతిపెద్ద ల్యూబ్ బేస్ రిఫైనరీతో మద్దతుగా ఉంది. HP ల్యూబ్రికెంట్స్ తయారు చేసే గ్రేడ్లు ఇతర రంగాలతో పాటు ఆటోమోటివ్, పారిశ్రామిక, గనులు & నిర్మాణం, వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, రక్షణ మరియు రైల్వేలలో వినియోగించబడుచున్నవి. HPCL దిగువ తెలిపిన ప్రదేశాలలో "క్లియరింగ్ & ఫార్వార్డింగ్ ఏజెంట్ల (CFAs)" ను నియమించదలచింది.

| క్ర.సం. | బేస్ లొకేషన్ | బేస్ లొకేషన్‌లోని రెవెన్యూ జిల్లా | రాష్ట్రం |
| --- | --- | --- | --- |
| 1. | అనంతపూర్ | అనంతపూర్ | ఆంధ్రప్రదేశ్ |
| 2. | నల్గొండ | నల్గొండ | తెలంగాణ |

తదుపరి వివరాలు మరియు విధానాల కోసం మా వెబ్‌సైట్ : www.hplubricants.in చూడండి.
ఫారం దాఖలుకు ఆఖరు తేదీ : 19-07-2019.
మీకు ఏవేని తదుపరి స్పష్టీకరణలు కావలసివస్తే సంప్రదించండి సేల్స్ ఆఫీసర్–కన్స్యూమర్ ల్యూబ్స్: శ్రీ రాహుల్ రెడ్డి సింగిరెడ్డి (మొబైల్ నం. 9440744944)
INDIA'S LARGEST LUBE MARKETER


## అరెస్టయితే బయటకు రాలేడు

- కఠిన షరతులతోనైనా బెయిల్ ఇవ్వండి: రవిప్రకాశ్ న్యాయవాది వాదన

**సాక్షి, హైదరాబాద్:** టీవీ9 లోగో కంపెనీ పేరిటే రిజిస్టర్ అయిందని, ఆ సంస్థ మాజీ సీఈవో రవిప్రకాశ్ వ్యక్తిగతం కాదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్‌రెడ్డి హైకోర్టులో వాదించారు. లిటిగేషన్ కోసమే రూ.వంద కోట్ల విలువ చేసే టీవీ9 లోగోను రూ.99 వేలకే రవిప్రకాశ్ అమ్మేశారని చెప్పారు. ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ రవిప్రకాశ్ దాఖలు చేసిన రిట్‌పై హైకోర్టులో మంగళవారం వాదనలు ముగిశాయి. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును తర్వాత వెల్లడిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి ప్రకటించారు. టీవీ9 లోగోను 15 సంవత్సరాలు వాడుకున్నందుకు 4 శాతం వాటా ఉంటుందనే వాదనలో అర్థం లేదని ప్రతాప్‌రెడ్డి వాదించారు. టీవీ9 చానల్ కొనుగోలు చేసేందుకు కోట్ల రూపాయలు చేతులు మారాయన్న రవిప్రకాశ్ ఆరోపణను ఖండించారు. రూ.500 కోట్లు బ్యాంకు లావాదేవీల ద్వారానే జరిగాయని చెప్పారు.కొత్త యాజమాన్యం చట్ట ప్రకారం డైరెక్టర్లను నియమించిందని, అయితే రవిప్రకాశ్ ఫోర్జరీ పత్రాలు తయారు చేసి వాటా బదిలీ అయినట్లు చేశారని చెప్పారు. రవిప్రకాశ్‌కు బెయిల్ మంజూరైతే సాక్ష్యాలను తారుమారు చేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కాగా, టీవీ9 యాజమాన్యం పెట్టిన కేసుల్లో పోలీసులు రవిప్రకాశ్‌ను అరెస్ట్ చేస్తే బయటకు రావడం కష్టమని ఆయన తరపు న్యాయవాది దిల్జిత్‌సింగ్ అహ్లూవాలియా వాదించారు. ముందస్తు బెయిల్ ఇస్తే పోలీసుల దర్యాప్తుకు రవిప్రకాశ్ సహకరిస్తారని, అందుకు ఎలాంటి కఠినమైన షరతులు పెట్టినా ఫర్వాలేదన్నారు. కావాలని 3 కేసుల్లో ఇరికించినప్పుడు ముందస్తు బెయిల్ ఇవ్వొచ్చని, సిబ్బియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కంపెనీ లా ట్రిబ్యునల్ స్టే ఇచ్చినా అందుకు విరుద్ధంగా టీవీ9 యాజమాన్యం చేతులు మారిందని వాదించారు.




# మూడో టీఎంసీకి 'పైప్‌లైన్' క్లియర్

**కాళేశ్వరంలో అదనపు నీటి తరలింపునకు రూ.14,362 కోట్లు ● ఆమోదం తెలిపిన రాష్ట్ర కేబినెట్**



**సాక్షి, హైదరాబాద్:** బహుళార్థ సాధక ప్రాజెక్టు కాళేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. మేడిగడ్డ నుంచి రోజుకు రెండు టీఎంసీల గోదావరి నీటిని ఎత్తిపోసేలా పనులు కొనసాగిస్తున్న ప్రభుత్వం, కొత్తగా మూడో టీఎంసీ నీటిని తీసుకునే ప్రణాళికకు అంగీకారం తెలిపింది. మంగళవారం జరిగిన కేబినెట్ భేటీలో అదనంగా మరో టీఎంసీ తీసుకునే ప్రణాళికను ఆమోదించడమే కాకుండా, దానికయ్యే వ్యయ అంచనాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పైప్‌లైన్ వ్యవస్థ ద్వారానే నీటిని తీసుకునేలా రూపొందించిన ప్రణాళికకు ఓకే చెప్పింది. దీంతో పాటే ఇప్పటికే నిర్మాణంలో ఉన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో అదనపు మోటార్ల ఏర్పాటుకయ్యే అదనపు వ్యయాల అంచనాలను సమ్మతించింది.

**మిడ్‌మానేరు దిగువన పైప్‌లైన్ ద్వారా..**

ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రోజుకు 2టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా మేడిగడ్డ పంప్ హౌస్ వద్ద 11, అన్నారం వద్ద 8, సుందిళ్ల వద్ద 9 మోటార్లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం మూడో టీఎంసీ నీటిని తీసుకునేందుకు వీటికి అదనంగా 3 పంప్‌హౌస్‌ల్లో కలిపి మరో 15 మోటార్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పుడున్న వాటితో కలిపి అదనంగా మేడిగడ్డలో 6, అన్నారంలో 4, సుందిళ్లలో 5 మోటార్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ అదనపు మోటార్ల ఏర్పాటుతో పాటు, వాటికి అనుగుణంగా పలు నిర్మాణాలు చేయాల్సి ఉండటంతో వ్యయం పెరుగుతోంది. గత అంచనా 3 పంప్‌హౌస్‌లకు కలిపి రూ.7,998 కోట్లుండగా, ప్రస్తుతం అది రూ.12,392 కోట్లకు చేరుతోంది. ఈ పెరిగిన వ్యయాలకు కేబినెట్ ఓకే చెప్పింది. ఇక మిడ్ మానేరు దిగువన మల్లన్నసాగర్ వరకు మొదట టన్నెల్ ద్వారా నీటిని తరలించాలని నిర్ణయించినా, దీని నిర్మాణాలకు చాలారోజులు పడుతున్న నేపథ్యంలో పైప్‌లైన్ వ్యవస్థ ద్వారా నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నీటి తరలింపునకు 3 స్థాయిల్లో లిఫ్టులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని లో మిడ్‌మానేరు నుంచి అనంతగిరి రిజర్వాయర్ వరకు పైప్‌లైన్ వ్యవస్థ నిర్మాణానికి రూ.4,142 కోట్లు, అనంతగిరి నుంచి మల్లన్నసాగర్ వరకు పైప్‌లైన్ నిర్మాణానికి రూ. 10,260 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఈ నిర్మాణానికి మొత్తం రూ.14,362 కోట్ల మేర వ్యయం అవుతుండగా, దీనికి ఆమోదం తెలిపిన కేబినెట్ వచ్చే ఏడాది నాటికి ఈ పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది.

**పాలమూరు రుణాలు.. ఎస్‌ఎల్‌బీసీ.. ఎస్సారెస్పీ కాల్వలు..**

ఇక వీటితో పాటే కేబినెట్ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.10వేల కోట్లు రుణాలు తీసుకునేందుకు కేబినెట్ అనుమతినిచ్చింది. కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారానే ఈ రుణాల సేకరణ జరుగనుంది. ఇక దీంతో పాటే ఎస్సారెస్పీ స్టేజ్-2లో కాల్వల లైనింగ్ పనులకు రూ.653 కోట్ల కేటాయింపునకు ఓకే చెప్పింది. అలాగే ఏఎంఆర్‌పీ ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టు పనుల సత్వర పూర్తికి రూ.63.50 కోట్ల అడ్వాన్సులు కోరగా దానికి సమ్మతించింది. దీంతో పాటే కొత్తగా గొలుసుకట్టు చెరువుల అనుసంధానానికి వీలుగా తూములు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేయాలని నిర్ణయించి, పనులు సైతం మొదలు పెట్టగా, ఆ పనులను చేపట్టేందుకు అంగీకారం తెలిపింది.

**పంప్‌హౌస్‌ల్లో ఆమోదం పొందిన అంచనాలు ఇలా (రూ.కోట్లలో)**

| పంప్‌హౌస్ | గత ఆమోదం | ప్రస్తుత ఆమోదం |
|---|---|---|
| మేడిగడ్డ | 3,524 | 4,966 |
| అన్నారం | 2,140 | 3,810 |
| సుందిళ్ల | 2,334 | 3,616 |

## రూ.45 వేల కోట్ల భారమా?: జీవన్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన విధంగా తుమ్మిడిహెట్టి వద్ద 154 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి ఉంటే ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్లు ఇప్పటికే వచ్చేవని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేవలం 1,800 ఎకరాల ముంపును మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఒప్పించలేక రూ.లక్ష కోట్ల రుణాన్ని ప్రజలపై భారంగా మోపుతున్నారని ఆయన విమర్శించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పుడు మేడిగడ్డ వద్ద ఎంత నీరుందో తుమ్మిడిహెట్టి వద్ద కూడా అంతే ఉందని తెలిపారు. ఎల్లంపల్లి బ్యారేజీ ఇప్పటికే పూర్తయిందని, కాల్వలు కూడా సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ ఒక్కటి పూర్తి చేస్తే ప్రాజెక్టు వినియోగంలోకి వచ్చేదన్నారు. రూ.38 వేల కోట్లతో 16.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రాజెక్టును రూపొందిస్తే కేవలం 1.4 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టు పేరుతో రూ.45 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా వచ్చే అవకాశం ఉందని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లి ఆ రాష్ట్రానికి కావాల్సిన హక్కులు కాపాడుకునే ప్రయత్నం చేస్తే.. సీఎం కేసీఆర్ మాత్రం ఆ సమావేశానికి కూడా ఎగ్గొట్టి కనీసం రాష్ట్రానికి కావాల్సిన విషయాలను కూడా కేంద్రం ముందుంచలేకపోయారని ఎద్దేవా చేశారు.

## వారికి న్యాయం చేయాలి: నాగం



**సాక్షి, హైదరాబాద్:** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో ఇంటికో ఉద్యోగం ఇచ్చిన తరువాతే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్.. ఇప్పుడు న్యాయం కోసం పోరాడుతున్న వారిని నోరు కూడా ఎత్తనీయడం లేదని మాజీ మంత్రి నాగం జనార్దనరెడ్డి వ్యాఖ్యానించారు. మాజీ ఎంపీ మల్లు రవితో కలిసి మంగళవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో ఆంధ్రా పాలకులు కనీసం ధర్నాలు చేసుకునేందుకైనా అనుమతి ఇచ్చారని, కేసీఆర్ మాత్రం ఇప్పుడు ధర్నా కూడా చేయనీయడం లేదని, న్యాయం కోసం మాట్లాడనివ్వడం లేదని విమర్శించారు. మూడు రోజులకోసారి ప్రాజెక్టు అంచనాలు పెంచుతూ, 15 టిప్పర్ల మట్టిని తీస్తే రూ.4.5 లక్షలు ఇస్తున్న కేసీఆర్ ఈ ప్రాజెక్టు కింద భూములు పోగొట్టుకున్న రైతులకు మాత్రం పరిహారం చెల్లించడం లేదని విమర్శించారు. మరికల్ రైతులు న్యాయం కోసం రోడ్డు మీదకు వస్తే లాఠీచార్జ్ చేశారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ముంపు బాధితులకు ఎకరానికి కనీసం రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మల్లు రవి మాట్లాడుతూ.. కేసీఆర్‌ను ఒప్పించి మల్లన్న సాగర్‌లాగా పరిహారం ఇప్పిస్తానని స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు నిరాహారదీక్ష చేస్తున్న వారిని పోలీసులు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరచి రైతులకు న్యాయం చేయాలని లేదంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తుందని హెచ్చరించారు.

## మంచిరెడ్డిపై కేసులు పెట్టాలి: రంగారెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** ఇబ్రహీంపట్నం చెరువు నుంచి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అక్రమంగా మట్టిని తవ్వి అమ్ముకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టిని తరలిస్తున్నారని, ఈ విషయంలో కలెక్టర్, జేసీలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ మట్టి కుంభకోణం కోట్ల రూపాయల్లో ఉందని, ఎమ్మెల్యేపై క్రిమినల్ కేసులు పెట్టి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఫోన్ చేస్తే పార్టీ మారొద్దని చెప్తా: పొన్నం



**సాక్షి, హైదరాబాద్:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తనకు ఫోన్ చేసి రాజకీయ భవిష్యత్తుపై చర్చించారని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ చెప్పారు. రాజగోపాల్‌రెడ్డి తనకు ఫోన్ చేయలేదని, ఒకవేళ చేస్తే పార్టీ మారొద్దని చెబుతానని మంగళవారం 'సాక్షి'తో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. తాను పార్టీ మారే ప్రసక్తే ఉండదని, అసలు అలాంటి ఆలోచనే చేయబోనని ఆయన స్పష్టం చేశారు.

## టీఆర్‌ఎస్‌ను ఫ్రెండ్లీ పార్టీగా భావించినందుకే వైఫల్యం: రాజనర్సింహ



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రజలకు, కాంగ్రెస్ నాయకత్వానికి మధ్య గ్యాప్ ఉందని, ప్రజల్లో ఉండి ఉద్యమాలు చేయలేకపోవడం వల్లే పార్టీ విఫలమవుతోందని మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. పదేళ్లుగా టీఆర్‌ఎస్ తమకు ఫ్రెండ్లీ పార్టీ అన్నట్టే వ్యవహరించామని, కానీ కాంగ్రెస్‌లో టీఆర్‌ఎస్ శ్రేయోభిలాషులు ఎక్కువయ్యారని ఆయన ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీఆర్‌ఎస్‌ను తాము ఎప్పుడూ శత్రువుగా భావించలేదని అన్నారు. అయితే, టీఆర్‌ఎస్‌లో ప్రస్తుతం స్థిరత్వం కనిపించడం లేదని, అందుకే ఎమ్మెల్యేలను తీసుకుంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. టీఆర్‌ఎస్‌కు బీజేపీ నుంచి రాజకీయ ముప్పు ఉందని, కిషన్‌రెడ్డికి హోంశాఖ సహాయ మంత్రి పదవి ఇవ్వడమే ఇందుకు సంకేతమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బాగుపడాలంటే అధిష్టానం ఆలోచనం విధానం మారాలని చెప్పిన రాజనర్సింహ.. తనకు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇస్తానంటే తీసుకుంటానని, ఆ పదవి నిర్వహించే సత్తా తనకుందని స్పష్టంచేశారు.

## పాలనా కేంద్రం ప్రగతిభవనా..?: చాడ



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా కేంద్రం సచివాలయమా లేక ముఖ్యమంత్రి నివాసం ప్రగతి భవనా అని సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రశ్నించారు. సచివాలయం నుంచి నిర్వహించాల్సిన కేబినెట్ భేటీని ప్రగతి భవన్‌లో ఎలా జరుపుతారని నిలదీశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రాచరిక పాలన సాగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. మంగళవారం పార్టీ సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డితో కలిసి చాడ విలేకరులతో మాట్లాడుతూ.. భూప్రక్షాళన, భూదాన బోర్డు భూముల రక్షణ, పోడు రైతుల సమస్యలపై మరో భూపోరాటానికి సీపీఐ సిద్ధమవుతోందని తెలిపారు. ఈ నెల 25, 26 తేదీల్లో కాళేశ్వరం, కన్నెపల్లి, సుందిళ్ల, మేడిగడ్డ, అన్నారం, కొండపోచమ్మ, మిడ్‌మానేరు ప్రాజెక్టులను పార్టీ ఆధ్వర్యంలో సందర్శిస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలు, నియంతృత్వ విధానాల కారణంగా మొత్తం 190 ప్రజావ్యాజ్యాలు, ఇతర కేసులు నడుస్తున్నాయని ధ్వజమెత్తారు. కోర్టులు మొట్టికాయలు వేస్తే తప్ప సర్కార్ స్పందించడం లేదన్నారు. ఇక్కడ కేసీఆర్ అనేక అంశాలను పెండింగ్‌లో పెట్టగా, ఏపీలో వైఎస్ జగన్ అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతున్నారని వ్యాఖ్యానించారు.

## వసతి గృహాల సదుపాయాలకు నిధుల పెంపు



**సాక్షి, హైదరాబాద్:** పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో సదుపాయాలు, మౌలిక వసతుల కల్పనకు నిధులు పెంచుతున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజేయ్‌మిశ్రా, సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు కరుణాకర్, ఇతర అధికారులతో కొప్పుల భేటీ అయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని సంబంధిత శాఖాధికారులను ఆయన ఆదేశించారు. ప్రస్తుతం ఒక్కో విద్యార్థిపై వెచ్చిస్తున్న రూ. 4వేలను ఇకపై రూ. 6వేలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల ప్రకారం ఉచిత నిర్బంధ విద్యను పక్కా ప్రణాళికతో అమలు చేస్తున్నామని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మంత్రి ఆదేశాలతో నిధులను పెంచుతూ మంగళవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# 5 నెలల సమయం కావాలి..

- మున్సిపల్ ఎన్నికల పూర్తికి గడువు కోరిన సర్కారు
- విలీనం, కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు సమయం అవసరం
- హైకోర్టుకు వెల్లడించిన మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు కనీసం 151 రోజులు (5 నెలలు) సమయం కావాలని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం కోరింది. సమీప గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం, మేజర్ గ్రామాలను కొత్త మున్సిపాలిటీలుగా చేసేందుకు, ఆ తర్వాత వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు చేసేందుకు ఆ సమయం పడుతుందని తెలిపింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ అఫిడవిట్ దాఖలు చేశారు. 53 మున్సిపాలిటీలు, 3 మున్సిపల్ కార్పొరేషన్ల పాలకవర్గాల గడువు జూలై 2తో ముగిసిందని, ఈలోగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం హైకోర్టును ఆశ్రయించింది. ఎన్నికలు నిర్వహించాల్సిందిగా గతేడాది డిసెంబర్ 31న, ఈ ఏడాది మార్చి 28న ప్రభుత్వానికి లేఖలు రాసినా ఫలితం లేకపోవడంతో కోర్టుకెక్కింది. ఎన్నికల ప్రక్రియ చేపట్టేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కూడా మరో వ్యాజ్యం దాఖలు చేసింది. ఈ వ్యాజ్యాలను బుధవారం విచారిస్తామని న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు పేర్కొన్నారు.

**అన్నింటికీ ఒకేసారి.. కష్టం!**

53 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లలో ఒక్క గ్రామ పంచాయతీ విలీనం కూడా కాలేదని, వీటి ఎన్నికల విషయంలో తగిన ఉత్తర్వులు జారీ చేస్తే అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అఫిడవిట్‌లో హైకోర్టుకు చెప్పారు. జవహర్‌నగర్, నిజాంపేట, కొంపల్లి, మణికొండ, నార్సింగ్, బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీలుగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏర్పడ్డాయి. బడేపల్లి (జడ్చర్ల) నకిరేకల్ మున్సి,పాలిటీల పాలకవర్గాల గడువు వచ్చే ఏడాది డిసెంబర్ 15 వరకు ఉంది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం గడువు జూన్ 1తో ముగిసిందని పేర్కొన్నారు. పాలకవర్గాల గడువు ముగిసిపోతున్నందున వాటన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం కష్టమవుతుందని కౌంటర్‌లో తెలిపారు. 'సమీపంలోని చిన్న గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడం, మేజర్ గ్రామాల్ని కొత్త మున్సిపాలిటీలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని జనవరి 19న జిల్లా కలెక్టర్లను ఆదేశించాం. దీంతో రాష్ట్రంలోని 131 గ్రామాలను సమీపంలోని 42 మున్సిపాలిటీలు, 173 గ్రామాలను 68 మున్సిపాలిటీలుగా మార్చాం. వీటికి ఎన్నికలు నిర్వహించాలంటే ఆయా గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు పూర్తి కావాలి. ఈలోగానే 14 పంచాయతీలను మున్సిపాలిటీలుగా చేయడాన్ని, 28 గ్రామాల్ని మున్సిపాలిటీల్లో విలీనం చేయొద్దన్న రిట్లను గత మార్చి 8న హైకోర్టు తోసిపుచ్చింది'అని అరవింద్ కుమార్ హైకోర్టుకు తెలిపారు. వార్డుల పునర్విభజనకు 30 రోజులు కావాలని, వార్డుల పునర్విభజన తుది నోటిఫికేషన్‌కు 7 రోజులు పడుతుందని వివరించారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు మరో 30 రోజులు పడుతుందని, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తించేందుకు 60 రోజుల సమయం పడుతుందని, వార్డులను వివిధ వర్గాలకు కేటాయించేందుకు 7 రోజులు, మున్సిపల్ వార్డులు, చైర్మన్/మేయర్ పదవుల రిజర్వేషన్ల ఖరారుకు మరో 7 రోజులు పడుతుందని తెలిపారు. అవన్నీ ఖరారయ్యాక ప్రభుత్వానికి మరో 10 రోజుల సమయం అవసరం అవుతుందని చెప్పారు.

# ఎంపీపీ, జెడ్పీపీలకు అపాయింటెడ్ డే

- 4న ఎంపీపీలు.. 5న జెడ్పీపీల భేటీ
- తేదీలు నిర్ణయించిన ఎస్‌ఈసీ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని కొత్త మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌ల మొదటి సమావేశం తేదీని (అపాయింటెడ్ డేట్) రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్‌ఈసీ) ఖరారు చేసింది. జూలై 4న (కొన్ని జిల్లాల్లోని ఎంపీపీలు మినహా) ఎంపీపీలకు, జూలై 5న (నాలుగు జెడ్పీపీలు మినహా) 28 జిల్లాల్లోని జెడ్పీపీల మొదటి సమావేశం తేదీగా ప్రకటిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సమావేశం తేదీ నుంచి వీరి పదవీకాలం మొదలై ఐదేళ్ల పాటు కొనసాగనుంది. ఎంపీపీలకు సంబంధించి ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోని అన్ని ఎంపీపీలు, ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, మంగపేట, మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, నాగర్‌కర్నూలు జిల్లాలోని నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల ఎంపీపీ మినహా మిగిలిన జిల్లాల్లోని ఎంపీపీలకు జూలై 4న మొదటి సమావేశం నిర్వహిస్తారు. అప్పటి నుంచి ఆ ఎంపీపీల పరిధిలోని కో ఆప్టెడ్, మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం మొదలవుతుంది. ఎంపీపీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తమ స్థానాల్లో కూర్చోవడానికి ముందే ఎంపీటీసీ సభ్యుల ప్రమాణస్వీకారాన్ని ముగించాల్సి ఉంటుందని ఎస్‌ఈసీ ఈ నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఆగస్టు 6న ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోని అన్ని ఎంపీపీలు, ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, మంగపేట, మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, నాగర్‌కర్నూలు జిల్లాలోని నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల ఎంపీపీల మొదటి సమావేశ తేదీగా ఎస్‌ఈసీ నిర్ణయించింది. అప్పటి నుంచి ఈ మండలాల్లోని ఎంపీపీ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల పదవీకాలం మొదలుకానుంది. వీరు తమ స్థానాల్లో ఆసీనులు కావడానికి ముందే ఎంపీటీసీ సభ్యులందరి ప్రమాణ స్వీకారం పూర్తి చేయాల్సి ఉంటుంది.

**28 జిల్లాల్లో జూలై 5న జెడ్పీపీ చైర్‌పర్సన్లు**

రాష్ట్రంలోని 28 జిల్లాల్లో జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లు, కో ఆప్టెడ్ సభ్యులు జూలై 5న పదవీ బాధ్యతలు చేపట్టేలా తొలి సమావేశం నిర్వహిస్తారు. అయితే, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ఆగస్టు 7న జెడ్పీపీ చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లు, కో ఆప్టెడ్ సభ్యులు పదవీబాధ్యతలను చేపడతారు. వీరు బాధ్యతలను చేపట్టడానికి ముందే జెడ్పీటీసీల ప్రమాణ స్వీకారం పూర్తిచేయాల్సి ఉంటుంది. అదేరోజు ఈ జెడ్పీపీల మొదటి సమావేశం ఉంటుందని ఎస్‌ఈసీ తెలిపింది.

# 24న నేతన్నల 'చలో ఢిల్లీ'



అభివాదం చేస్తున్న చాడ, కోదండరాం, కృష్ణయ్య

**హైదరాబాద్:** రాష్ట్రంలో వృత్తి కులాలకు జరుగుతోన్న అన్యాయాల గురించి ఆయా కులాల వారు అందరూ ఏకమై ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు కోదండరాం పిలుపునిచ్చారు. వృత్తి కులాల విషయమై అసెంబ్లీలో చర్చ పెడదామంటే ప్రతిపక్షం లేకుండా పోయిందని వాపోయారు. ప్రతిపక్షంలో ఉన్న వారు కూడా ఏ పార్టీలో ఉండి ఎవరికి పనిచేస్తున్నారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వీవర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ అధ్యక్షుడు దాసు సురేష్ అధ్యక్షతన మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స మావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ నెల 24న తలపెట్టనున్న 'నేతన్నల సమరనాధం-చలో ఢిల్లీ' కార్యక్రమం గురించి చర్చించారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి సమాయత్తం చేస్తూ వివిధ సంఘాలతో కలిసి రాజకీయ ఐక్య కార్యాచరణ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశానికి హాజరైన కోదండరాం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ఎంత ముఖ్యమో, కుల వృత్తులను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ కేవలం వ్యాపారాలే ప్రధానంగా ముందుకు సాగుతున్నాయని.. ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో ప్రజలు సంఘాలుగా ఉద్యమిస్తేనే వారి సమస్యలు పరిష్కారం అవుతాయని వెల్లడించారు. బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. చేనేత సమస్యను పాలకులు ఓటుగానే చూస్తున్నారని, ఎన్నికల సమయంలో వాగ్దానాలు ఇస్తున్నారే కానీ వారిని ఆదుకోవడం లేదని వాపోయారు. బడ్జెట్‌లో ఏటా రూ.1,200 కోట్లు కేటాయిస్తున్నట్లు చెబుతున్నా.. రూ.200 కోట్లు కూడా ఖర్చు చేయడం లేదని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం చేనేతల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందన్నారు. కేటాయించిన నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంవల్లే ఆ వర్గాలకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. చేనేత ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. పార్లమెంట్‌లో చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలపై గళం విప్పుతామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం చేనేత కార్మిక విభాగం కార్యదర్శి రమేశ్, తలకొక్కుల రాజు, కాశీనాథ్ పాల్గొన్నారు.

# వైద్యుల గరంగరం..

- పదవీ విరమణ వయసు పెంపు నిర్ణయంపై ఆగ్రహం
- డీఎంఈ కార్యాలయాన్ని ముట్టడించిన వైద్య అధ్యాపకులు
- పోలీసుల రంగప్రవేశం... పరిస్థితి ఉద్రిక్తం
- మరోవైపు జూడాల ఆందోళన... నిరుద్యోగ డాక్టర్ల దీక్ష



**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ బోధనాసుపత్రుల్లోని వైద్య అధ్యాపకుల పదవీ విరమణ వయసును పెంచడాన్ని నిరసిస్తూ తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) కార్యాలయాన్ని ముట్టడించారు. డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి చాంబర్ వద్ద బైఠాయించి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ కావాల్సిన రమేశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి వయసు పెంపును ముందుకు తోస్తున్నారని ఆరోపించారు. తద్వారా తన పదవిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. విరమణ వయసును 65 ఏళ్లకు పెంచడం ఏమాత్రం సబబు కాదని వారు నినదించారు. డాక్టర్లను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డాక్టర్లు పెద్దఎత్తున ప్రతిఘటించడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. సుమారు రెండు గంటలపాటు కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు డాక్టర్ పల్లం ప్రవీణ్ మాట్లాడుతూ, వయసు పెంపుకంటే ముందు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్)ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. సీఏఎస్ అమలు చేయకుండా డీఎంఈ రమేశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సీఏఎస్ అమలుచేస్తే ప్రొఫెసర్ల కొరత ఉండదన్నారు. ఈ నేపథ్యంలో తన పదవిని కాపాడుకోవడానికి రమేశ్‌రెడ్డి సీఏఎస్‌ను పక్కనబెట్టి, వయసు పెంపు కోరుకుంటున్నారని విమర్శించారు. ఇదే రమేశ్‌రెడ్డి ప్రొఫెసర్ల వయసు పెంపుపై 2018లో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడు వ్యతిరేకించారని ఆరోపించారు. ఇప్పటికే అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదేళ్లకు పైగా పనిచేశామని, ఇప్పుడు విరమణ వయసును ఏడేళ్లు పెంచితే మరో ఏడేళ్లు తాము అసోసియేట్లుగానే ఉండిపోవాల్సి వస్తుందన్నారు. అందుకే, తాము సీఏఎస్ కోరుకుంటున్నామన్నారు. సీఏఎస్ ఇస్తే విరమణ వయసు ఎంత పెంచినా తమకు అభ్యంతరం లేదని సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరహరి అన్నారు.

**విధులు బహిష్కరించిన జూడాలు**

పదవీ విరమణ వయసు పెంపును నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు మంగళవారం విధులు బహిష్కరించారు. గాంధీ, ఉస్మానియా, నీలోఫర్‌సహా బోధనాసుపత్రుల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకూ విధులకు హాజరుకాబోమని జూడా అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ విజయేందర్ తెలిపారు. బోధనాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న 1,200 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై హెల్త్ రిఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరుద్యోగ డాక్టర్ల సభ నిర్వహించింది. అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మహేశ్, నిమ్స్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తదితరులు రోజంతా నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవీ విరమణ వయస్సు పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని, పోస్టుల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు. అవసరమైనచోట ప్రొఫెసర్లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకోవాలని సూచించారు.

# విదేశాలకూ యాదాద్రి ప్రసాదం

- ఎల్లలు దాటి భక్తుల చెంతకు దైవ ప్రసాదం, అక్షింతలు
- కొత్త విధానానికి రాష్ట్ర దేవాదాయశాఖ శ్రీకారం
- వచ్చే నెల నుంచి మొదలు.. యాదాద్రి తర్వాత మరిన్ని ఆలయాల్లో..

**సాక్షి, హైదరాబాద్:** అమెరికాలో ఉంటున్న నాగేందర్ ఇలవేల్పు యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి. ఏటా తన పుట్టిన రోజున స్వామిని అర్చించి తీర్థ ప్రసాదాలు తీసుకోవాలనేది ఆయన కోరిక. కానీ వివిధ కారణాల వల్ల ఆయనకు యాదాద్రి వచ్చి దైవ దర్శనం చేసుకునేందుకు కుదరట్లేదు. దీంతో పుట్టిన రోజున ఏదో వెలితి ఆయనను వెంటాడుతోంది. ఇలాంటి ఎందరో ప్రవాస తెలుగువారు వేదన పడుతున్నారు. ఇకపై భక్తుల చింత తీరనుంది. కొద్దిరోజుల్లోనే వారి ఇలవేల్పు దేవాలయం నుంచి ఆయా దేశాల్లోని భక్తుల చెంతకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, పసుపు-కుంకుమ చేరనున్నాయి. ప్రత్యేక సందర్భాల్లో వారు కోరిన రోజున ఆలయంలో వారి పేరుతో పూజాదికాలు నిర్వహించి ప్రసాదాన్ని వారికి పంపుతారు. దేవాదాయశాఖ తాజాగా తీసుకున్న ఈ నిర్ణయం వచ్చే నెల నుంచి అందుబాటులోకి రాబోతోంది.

**యాదగిరిగుట్టతో మొదలు....**

విదేశాల్లోని భక్తులకు మానసిక సంతోషాన్ని కలిగించేలా వారి ఇష్టదైవం కొలువైన కోవెల నుంచి ప్రసాదం ఎందుకు వారికి చేరకూడదన్న ఉద్దేశంతో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో చర్చించి దీనికి అనుమతి తీసుకున్న ఆయన... విదేశాలకు స్వామి ప్రసాదం చేరవేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా ఐటీ శాఖను కోరారు. దీనికి సంబంధించిన అనుమతులు తీసుకోవడం నుంచి విధివిధానాలను ఖరారు చేయడం వరకు ఆ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల నుంచి ప్రారంభించే ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా తొలుత యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంతో మొదలుపెట్టాలని నిర్ణయించారు. వీలైతే భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి కూడా ఈ సేవ మొదలుపెట్టాలనుకుంటున్నారు. ఇటీవలే బెల్లం ప్రసాదాల వితరణ ప్రారంభించి భక్తుల అభిమానాన్ని చూరగొన్న దేవాదాయశాఖ అదే ఉత్సాహంతో దేవాలయాల్లో నిర్వహించే ఆర్జిత సేవలు, గదుల కేటాయింపు తదితరాల బుకింగ్‌ను ఆన్‌లైన్ చేసింది. ఇప్పుడు విదేశీ భక్తులకు ప్రసాదం అందజేసే కార్యక్రమాన్ని మొదలుపెడుతున్నారు.



**నిల్వ ఎలా?**

రాష్ట్రంలోని చాలా దేవాలయాల్లో పులిహోర, లడ్డూ ప్రధాన ప్రసాదంగా ఉంది. పులిహోరను ఒక రోజుకు మించి నిల్వ చేసే అవకాశం లేనందున దాన్ని విదేశాలకు పంపరు. ఇక లడ్డూ కూడా రెండు మూడు రోజులే నిల్వ ఉంటుంది. దాన్ని గాలి చొరబడని ప్యాకింగ్‌లో ఉంచితే ఒక రోజుకు మించి నిల్వ ఉండదు. లడ్డూ నిల్వ ఉండాలంటే తిరుమల ప్రసాదం తరహాలో తేమ లేకుండా ఉండాలి. దీంతో ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతానికి ప్రసాదంగా స్వామి పసుపు-కుంకుమ, అక్షింతలు, ఇతర పూజా వస్తువులను పంపాలని నిర్ణయించారు. తేమలేని లడ్డూ తయారీ, రవ్వతో చేసే పొడి ప్రసాదం తదితరాల విషయంలో తుది నిర్ణయం తీసుకొని దాన్ని అందించనున్నారు.

**మరిన్ని దేవాలయాల్లో ఆన్‌లైన్ సేవలు....**

దేవాలయానికి వెళ్లేలోపే ఆర్జిత సేవలు, గదులను బుక్ చేసుకునేందుకు వీలుగా ఆన్‌లైన్ సేవలకు ఇటీవలే దేవాదాయశాఖ శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లో యాదాద్రి భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆన్‌లైన్ సేవలను మొదలుపెట్టింది. తొలుత యాదగిరిగుట్ట, భద్రాచలం, వేములవాడ, బాసర, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయం, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం, కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ సేవలను మొదలుపెట్టారు. జూలై 6వ తేదీ నుంచి వరంగల్‌లోని భద్రకాళి దేవాలయం, ధర్మపురి, కొండగట్టు, కొమురవెల్లి, జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయం, సికింద్రాబాద్ గణపతి దేవాలయాల్లో ప్రారంభించనున్నారు. ఆ తర్వాత దశలవారీగా మిగతా ప్రధాన ఆలయాల్లో మొదలుపెడతారు. విరాళాలను కూడా ఆన్‌లైన్ ద్వారా చెల్లించే అవకాశం కల్పించారు.

## రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తాం

### ప్రమాణ స్వీకారం అనంతరం టీఆర్ఎస్ ఎంపీలు

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో పనిచేస్తామని టీఆర్ఎస్ ఎంపీలు స్పష్టం చేశారు. 17వ లోక్‌సభకు ఎన్నికైన టీఆర్ఎస్ సభ్యులు 9 మంది మంగళవారం ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు, గెలిపించి ఆశీర్వదించిన నియోజకవర్గ ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ..తెలంగాణకు హక్కుగా రావాల్సిన నిధులు, విభజన చట్టంలో పెండింగ్‌లో ఉన్న అంశాల సాధనకు ఎంపీలమంతా కలసికట్టుగా కృషి చేస్తామన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు టీఆర్ఎస్ పార్టీకి తిరుగులేని ఆధిక్యతను ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెడుతూ కేంద్రం నుంచి తెలంగాణ ప్రయోజనాల సాధనకు పనిచేస్తామన్నారు. వివిధ వర్గాలకు తెలంగాణ ప్రభుత్వం పెంచిన రిజర్వేషన్ల ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు.

**టీఆర్ఎస్ పథకాల్ని కేంద్రమే కాపీ కొట్టింది**

గత ఐదేళ్లకాలంలో కేంద్రంతో పోరాడి ప్రత్యేక హైకోర్టు, జాతీయ రహదారులు సాధించుకున్నట్టే.. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా, విభజన చట్టంలోని పెండింగ్ అంశాలు సాధించుకుంటామని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ రోజు దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలిచిందని, కేంద్ర ప్రభుత్వ పథకాలకు పేర్లు మార్చుచేసి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందన్న వాదనల్లో వాస్తవం లేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలనే కేంద్ర ప్రభుత్వం కాపీకొట్టిందన్నారు.

## పార్లమెంటులో తొలి ఫైటర్ పైలట్‌గా ఉత్తమ్

### ఎంపీగా ప్రమాణం చేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** యుద్ధవిమానాలు నడిపిన మాజీ పైలట్, టీపీసీసీ అధ్యక్షుడు కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణం చేశారు. ఒక ఫైటర్ పైలట్ లోక్‌సభ సభ్యుడిగా ఎన్నిక కావడం ఇదే ప్రథమమని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో కూడా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్లుగా పనిచేసిన రాజేశ్‌పైలట్, సురేశ్‌కల్మాడీలు ఎంపీలుగా ఎన్నికైనా.. వారు రవాణా పైలట్లు కావడం గమనార్హం. పుణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఉత్తమ్.. మిగ్–21, మిగ్–23 విమానాలు నడిపారు. పాకిస్తాన్, చైనా సరిహద్దుల్లో తిరిగే ఈ విమానాలను ఆయన ముందుండి నడిపించారు.

**నిధులు రాబడతా: ఉత్తమ్‌కుమార్**

తన ప్రమాణాన్ని జైహింద్, జై తెలంగాణ అంటూ ముగించిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంతో పోరాడుతానని చెప్పారు. ఢిల్లీ నుంచి ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ పునర్వ్యవస్థీకరణ చట్టంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నెరవేర్చడం, వివిధ పథకాల కింద రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలోనూ కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే వివిధ కేంద్ర పథకాల కింద నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గానికి నిధులు, ప్రోత్సాహకాలను కూడా తీసుకువస్తానన్నారు.

## తొలి బంజారా మహిళా ఎంపీగా గర్వంగా ఉంది

### ఎంపీ మాలోతు కవిత

**సాక్షి,న్యూఢిల్లీ:** తొలి బంజారా మహిళగా లోక్‌సభలో అడుగుపెట్టడం గర్వంగా ఉందని మహబూబా బాద్ ఎంపీ మాలోతు కవిత హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె లోక్‌సభ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బంజారా మహిళగా ఎంపీగా గెలుపొంది లోక్‌సభలో అడుగుపెట్టడం సంతోషంగా ఉందన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ సూచనల మేరకు తన నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కవిత పేర్కొన్నారు.

## టీఆర్ఎస్ తీరు ప్రజల ముందుంచుతాం: బండి

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించి, పథకాల పేర్లు మార్చి తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటున్న టీఆర్ఎస్ ప్రభుత్వ తీరును ప్రజలకు వివరిస్తామని బీజేపీ ఎంపీ బండి సంజయ్ అన్నారు. మంగళవారం ఆయన లోక్‌సభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మోదీ ప్రధాని అయితేనే దేశం సురక్షితంగా ఉంటుందని, పేదలకు న్యాయం జరుగుతుందని నమ్మి ప్రజలు మళ్లీ పట్టం కట్టారన్నారు. దేశ రక్షణే ధ్యేయంగా పని చేస్తున్న మోదీ నాయకత్వంలో పనిచేసే అవకాశం కల్పించినందుకు కరీంనగర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

## యాదాద్రిలో రక్షిత అటవీ భూమిగా 87 ఎకరాలు

**సాక్షి, హైదరాబాద్:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపూర్ గ్రామం సర్వేనంబర్ 64 ఏలోని 87.06 ఎకరాల (35.26 హెక్టార్లు) అటవీయేతర భూమిని రక్షిత అటవీ భూమిగా రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ మేరకు వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించాక ఈ భూమిని మల్లాపూర్ ఫారెస్ట్ బ్లాక్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంగళవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌మిశ్రా ఉత్తర్వులు జారీచేశారు. ఈ నోటిఫికేషన్‌ను ఈ నెల 25న తెలంగాణ స్టేట్ గెజిట్‌లోప్రచురించాలని ఆదేశించారు.


నామా నాగేశ్వరరావు


పోతుగంటి రాములు


మాలోత్ కవిత


పసునూరి దయాకర్


బోర్లకుంట వెంకటేశ్ నేత


మన్నెం శ్రీనివాస్‌రెడ్డి


కొత్త ప్రభాకర్‌రెడ్డి


బీబీ పాటిల్


రంజిత్‌రెడ్డి


ధర్మపురి అరవింద్


బండి సంజయ్ కుమార్


సోయం బాపూరావు


ఉత్తమ్ కుమార్‌రెడ్డి


కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


రేవంత్‌రెడ్డి


అసదుద్దీన్ ఒవైసీ

# పార్లమెంటులో 'జై తెలంగాణ'

### తెలంగాణ ఎంపీల ప్రమాణ స్వీకారం

**సాక్షి, న్యూఢిల్లీ:** 17వ లోక్‌సభ కొలువుదీరిన రెండో రోజు(మంగళవారం) తెలంగాణ ఎంపీలు ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం 17 మంది సభ్యులకుగాను కిషన్‌రెడ్డి సోమవారమే ప్రమాణ స్వీకారం చేశారు. మిగిలిన 16 మందిలో పది మంది తెలుగులో, నలుగురు ఇంగ్లిష్‌లో, ఒకరు హిందీలో, మరొకరు ఉర్దూలో ప్రమాణం చేశారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు(బీజేపీ), పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత(టీఆర్ఎస్) తెలుగులో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. జై తెలంగాణ, జైజై భారత్ అంటూ ముగించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్(బీజేపీ) తెలుగులో దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేసి, భారత్ మాతా కీ జై అంటూ ముగించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ (బీజేపీ) ఆంగ్లంలో దైవసాక్షిగా ప్రమాణం చేసి, భారత్ మాతా కీ జై అంటూ ముగించారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్(టీఆర్ఎస్) హిందీలో దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేసి, జై తెలంగాణ అంటూ నినదించారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి (టీఆర్ఎస్) తెలుగులో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి(కాంగ్రెస్) తెలుగులో, తన ఫోన్‌లో ఉన్న ప్రమాణ స్వీకార ప్రతిని చదివారు. చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి(టీఆర్ఎస్), మహబూబ్‌నగర్ ఎంపీ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి(టీఆర్ఎస్), నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి(కాంగ్రెస్) ఇంగ్లిష్‌లో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. భువనగిరి, నాగర్‌కర్నూలు ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (కాంగ్రెస్), పోతుగంటి రాములు (టీఆర్ఎస్) తెలుగులో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. వెంకట్‌రెడ్డి (కాంగ్రెస్) తెలుగులో దైవసాక్షిగా ప్రమాణం చేస్తుండగా బీజేపీ ఎంపీ బండి సంజయ్ వెంకట్‌రెడ్డిని ఉద్దేశించి బీజేపీలోకి స్వాగతం అంటూ పిలిచారు. వెంకట్‌రెడ్డితో మంత్రి కిషన్‌రెడ్డి కరచాలనం చేశారు. వరంగల్లు ఎంపీ పసునూరి దయాకర్(టీఆర్ఎస్), మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత (టీఆర్ఎస్) తెలుగులో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు(టీఆర్ఎస్) తెలుగులో దైవసాక్షిగా ప్రమాణం చేశారు.

**అసదుద్దీన్ రాకతో హోరెత్తిన నినాదాలు**

ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఉర్దూలో దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసేందుకు తన స్థానం నుంచి అసదుద్దీన్ వస్తుండగా బీజేపీ సభ్యులు బండి సంజయ్ కుమార్ తదితరులు భారత్ మాతా కీ జై, జై శ్రీరాం, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. మరింత గట్టిగా అరవండి అంటూ అసదుద్దీన్ చేతులతో సైగ చేశారు. ప్రమాణ స్వీకారాన్ని ముగిస్తూ 'జై భీమ్, జై మీమ్, తక్బీర్ అల్లా హో అక్బర్, జై హింద్'అంటూ నినదించారు. ప్రమాణ స్వీకారం అనంతరం అసదుద్దీన్ ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడారు. 'నన్ను చూడగానే వారికి ఆ నినాదాలు గుర్తొచ్చినందుకు సంతోషం. వారు రాజ్యాంగాన్ని, ముజఫర్‌పూర్ చిన్నారుల మరణాలను కూడా గుర్తుపెట్టుకుంటారని ఆశిస్తున్నా'అంటూ పేర్కొన్నారు.

### తరలివచ్చిన కుటుంబ సభ్యులు, నేతలు

ప్రమాణ స్వీకారానికి ఎంపీల కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గస్థాయి నేతలు తరలివచ్చారు. ఎంపీలు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుటుంబసభ్యులు, వెంకట్‌రెడ్డి సోదరుడు, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి గ్యాలరీ నుంచి ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. ఎంపీ ధర్మపురి అరవింద్ కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. ఆయన తండ్రి డి.శ్రీనివాస్ రాజ్యసభ సభ్యుల గ్యాలరీ నుంచి వీక్షించారు. నామా, పోతుగంటి కుటుంబ సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్, ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, సురేందర్‌రెడ్డి,మాణిక్‌రావు, తదితరులు ఎంపీ బీబీ పాటిల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మెదక్ లోక్‌సభ స్థానం పరిధిలోని నియోజకవర్గ నేతలు భారీగా తరలివచ్చి కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# పకడ్బందీగా వాల్టా చట్టం

- ప్రత్యేక కార్యాచరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల్లో పర్యవేక్షక కమిటీలు
- ఒక చెట్టు నరికితే 5 మొక్కలు నాటాలి... సంరక్షణ బాధ్యతా వారిదే

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో మరింత సమర్థంగా నీరు, భూమి, చెట్టు (వాటర్, ల్యాండ్, ట్రీ యాక్ట్ – వాల్టా) చట్టం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. గతంలో పది జిల్లాల్లో ఈ చట్టం పర్యవేక్షణ, అమలుకు కమిటీలు వేయగా ఇప్పుడు కొత్తగా ఏర్పాటైన 33 జిల్లాలు, కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలవారీగా ఆయా స్థాయిల్లో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా వాల్టా నిర్వహణ కమిటీల నియామకానికి సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తాజాగా నిర్ణయం తీసుకున్నారు. తదనుగుణంగా ఆయా స్థాయిల కమిటీలను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయనుంది. దీనికి అనుగుణంగా జిల్లా స్థాయిలో కలెక్టర్, రెవెన్యూ డివిజన్‌లో ఆర్డీవో/సబ్ కలెక్టర్, మండల స్థాయిలో ఎమ్మార్వో ఎక్స్ అఫీషియో చైర్మన్‌గా వ్యవహరిస్తారు. త్వరలోనే ఈ కమిటీలు ఆయా స్థాయిల్లో ఉనికిలోకి రానున్నాయి.

**జిల్లా స్థాయి నుంచి కమిటీ...**

వాల్టా చట్టం అమలుకు జిల్లా స్థాయిలో కలెక్టర్లు ఎక్స్ అఫీషియో చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అదేవిధంగా ముగ్గురు ఎంపీపీలు, ఇద్దరు జెడ్పీటీసీ సభ్యులు కమిటీ సభ్యులుగా ఉంటారు. వారిని కలెక్టర్ నియమిస్తారు. వ్యవసాయశాఖ జేడీ, నీటిపారుదలశాఖ ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, భూగర్భ గనులశాఖ డీడీ, గ్రౌండ్ వాటర్ డీడీ, అటవీశాఖ డిప్యూటీ కన్జర్వేటర్, ఐటీడీఏ పీవో లేదా మాడా పీవో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ ఆఫీసర్, డీపీవో, మున్సిపాలిటీల్లో కమిషనర్లు, హైదరాబాద్, రంగారెడ్డి పరిధిలో హెచ్ఎండీఏ ఆఫీసర్లు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల సభ్యుల నుంచి మొత్తం ఐదుగురు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. జిల్లా కమిటీకి డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎక్స్ అఫీషియో మెంబర్ సెక్రెటరీగా వ్యవహరిస్తారు. రెవెన్యూ డివిజన్ల స్థాయిలో ఆర్డీఓలు లేదా సబ్ కలెక్టర్లు చైర్మన్లుగా ఉంటారు. ఆయా డివిజన్ల పరిధిలో డివిజన్ స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. డివిజన్ స్థాయిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు ఎక్స్ అఫీషియో కన్వీనర్‌గా ఉంటారు. మండల స్థాయిలో ఎమ్మార్వోలు ఎక్స్ అఫీషియో చైర్మన్లుగా, ఎంపీడీవోలు వైస్ చైర్మన్లుగా వ్యవహరిస్తారు. మండలాల్లోని వివిధ శాఖల అధికారులు సభ్యులుగా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మెంబర్ సెక్రెటరీగా వ్యవహరిస్తారు.

### చెట్టు కొట్టాలంటే అనుమతి తప్పనిసరి...

ఇకపై ఎవరైనా ఒక చెట్టును పడగొట్టాల్సిన పరిస్థితి వస్తే దాని స్థానంలో కచ్చితంగా ఐదు మొక్కలు నాటేలా చట్టంలో పొందుపరిచారు. గ్రామాల్లో ఒక్క చెట్టును నరికినా సదరు వ్యక్తిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్లు కొట్టకుండా ఇందులో ప్రతిపాదించారు. ముందుగా సంబంధిత అధికారుల నుంచి చెట్టు కొట్టేందుకు అనుమతి పత్రం తీసుకోవాలని ఇందులో సూచించారు. అయితే ఒక్క చెట్టును నరికితే 5 మొక్కలు సంబంధిత ప్రాంతాల్లోనే నాటాల్సి ఉంటుంది. దీని పర్యవేక్షణ కూడా సదరు వ్యక్తిదే. భూగర్భ జలాలు అడుగంటిపోతున్న నేపథ్యంలో విచక్షణారహితంగా బోర్లు వేసే వారిపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. ఈ చట్ట నిబంధనల ప్రకారం వ్యవసాయ బోర్లు, బావులకు మధ్య ఉన్న తేడాలు, వ్యత్యాసాలను పాటించాల్సి ఉంటుంది. బోర్లు వేసేందుకు ఆయా స్థాయిల్లోని సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అధికారుల అనుమతి లేకుండా బోర్లు వేస్తే బోరింగ్ వేసే లారీని కూడా స్వాధీనం చేసుకునే అధికారాన్ని కల్పించారు.



## నడ్డా నాయకత్వంలో బీజేపీ బలోపేతం

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

**సాక్షి, న్యూఢిల్లీ:** జేపీ నడ్డా నాయకత్వంలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన జేపీ నడ్డాను కిషన్ రెడ్డి, తెలంగాణ బీజేపీ ఎంపీలు ధర్మపురి అరవింద్, బండి సంజయ్ కుమార్, సోయం బాపూరావులు మంగళవారం ఢిల్లీలో కలిశారు. పార్టీ అధిష్టానం నడ్డాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడంతో మర్యాదపూ ర్వకంగా కలసిన నేతలు ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి రాజకీయ అనుభవం ఉన్న నడ్డాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాకు ఆయన అభినందనలు తెలిపారు. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేలా పనిచేయాలని నడ్డా సూచించినట్లు కిషన్‌రెడ్డి చెప్పారు.

# నాలుగో సింహానికి మూడో నేత్రం

- శాంతి భద్రతల పోలీసులకు బాడీ వోర్న్ కెమెరాలు
- పోలీసింగ్‌లో మరింత పారదర్శకతే లక్ష్యం
- త్వరలోనే అన్ని పోలీస్‌స్టేషన్లకు

**సాక్షి, హైదరాబాద్:** ఫ్రెండ్లీ పోలీసింగ్, వుమెన్ ప్రొటెక్షన్ వింగ్ వంటి వినూత్న పద్ధతులతో ముందుకు సాగుతున్న రాష్ట్ర పోలీసులు మరో కొత్త ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. పోలీసింగ్‌లో మరింత పారదర్శకత తీసుకువచ్చేందుకు శాంతి భద్రతల విభాగం పోలీసులకు బాడీ వోర్న్ కెమెరా లేదా చెస్ట్ మౌంటెడ్ కెమెరాలు ఇవ్వనున్నారు. ఇవి స్థానిక ఎస్పీ, కమిషనరేట్లతో పాటు, డీజీపీ ఆఫీసుకు కూడా అనుసంధానమై ఉంటాయి. ఫలితంగా ఘటనాస్థలంలో జరుగుతున్న కార్యక్రమాలను డీజీపీ కార్యాలయంలో ఉన్నతాధికారులు కూడా ప్రత్యక్షంగా వీక్షించగలరు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని త్వరలోనే అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా తొలిదశలో అన్ని జిల్లాల్లోని ముఖ్యమైన 10 పోలీస్ స్టేషన్ల సిబ్బందికి వీటిని పంపిణీ చేశారు. తర్వాత అన్ని పోలీస్ స్టేషన్లకు అందజేస్తారు. అందజేసిన సిబ్బందికి హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో వీటి వినియోగంపై శిక్షణ ఇస్తున్నారు.



**రాజధానిలో ఫలితాలివ్వడంతో..!**

చెస్ట్ మౌంటెడ్ కెమెరాలు హైదరాబాద్‌లో ట్రాఫిక్ విభాగం పోలీసులు చాలా కాలం నుంచే అమలు చేస్తున్నారు. రాజధానిలో ధర్నాలు జరిగినప్పుడు వీటిని సివిల్ పోలీసులు కూడా ప్రయోగాత్మకంగా వినియోగించారు. హైదరాబాద్‌లో సత్ఫలితాలు ఇవ్వడంతో అన్ని జిల్లాలు, జిల్లాలు, కమిషనరేట్లకు పంపిణీ చేయాలని డీజీపీ కార్యాలయం నిర్ణయించింది. పోలీసింగ్‌లో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు, పోలీసుల్లో జవాబుదారీతనం పెంచేందుకు, ఘటనాస్థలంలో సాక్ష్యాధారాల సేకరణకు ఈ విధానం దోహదపడనుంది. ఆందోళనలు, అల్లర్లు, విపత్తులు సంభవించినప్పుడు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్న విషయం ఫోన్లు, వాకీటాకీల ద్వారానే చెప్పే వీలుంది. కొత్త విధానం ద్వారా ఉన్నతాధికారులు మరింత వేగంగా స్పందించి క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఆదేశాలు ఇచ్చే వీలుంటుంది. తనిఖీలు, సోదాలు జరిపే సమయంలో ఇవి ఉపయుక్తంగా ఉంటాయి.

### ప్రత్యేకతలేంటి?

విదేశాల్లో వీటి వినియోగం ఎప్పట్నుంచో ఉంది. వీటికి 3జీ, 4జీ, ఆడియో, వీడియో సదుపాయంతో పాటు జీపీఎస్ కనెక్షన్ ఉంటుంది. రికార్డింగ్ బటన్ ఆప్షన్‌తో పాటు 400 నుంచి 500 గ్రాముల బరువు ఉంటాయి. ఈ కెమెరాలను భుజానికి ధరించేందుకు వీలుగా రూపొందించారు. వీటిని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) ఆదేశాల మేరకు సిబ్బంది వినియోగిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో ట్రాఫిక్ పోలీసులతో పాటు రైల్వే పోలీసులు వీటిని వాడుతున్నారు.

## బతికున్నంత వరకు కాంగ్రెస్‌లోనే: కోమటిరెడ్డి

**సాక్షి, న్యూఢిల్లీ:** బతికున్నంత వరకు తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కొన్ని మీడియా వర్గాలు మాత్రమే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. మంగళవారం ఆయన లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను.. ఈ రోజు ఈ స్థాయికి వచ్చానంటే దానికి పార్టీయే కారణమని పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో రెండుసార్లు ఓడిపోవడంతో ఆవేదన చెందిన రాజగోపాల్ రెడ్డి.. పార్టీని ప్రక్షాళన చేయాలంటూ కొన్ని వ్యాఖ్యలు చేశారని, పార్టీ మారుతానని చెప్పలేదని అన్నారు. భువనగిరి ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తానని, నిమ్స్‌ను ఏయిమ్స్‌గా అభివృద్ధి చేసేందుకు పాటుపడతానని చెప్పారు. హైదరాబాద్–ఏపీ నూతన రాజధానికి రైల్వే మార్గంపై గతంలో ఇచ్చిన హామీ అమలు కోసం పనిచేస్తానని అన్నారు.

# పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్లు ఉండాల్సిందే

- 2022 నాటికి పారా టీచర్ల విధానం రద్దు చేయాల్సిందే
- న్యూ ఎడ్యుకేషన్ పాలసీ ముసాయిదాలో స్పష్టం చేసిన కమిటీ
- రాష్ట్రంలో పారా టీచర్ల స్థానంలో వచ్చిన విద్యా వలంటీర్ల వ్యవస్థ

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా పారా టీచర్ సహా ఏ రకమైన పేరుతో తాత్కాలిక టీచర్లు ఉన్నా ఆ వ్యవస్థను తొలగించాల్సిందేనని నూతన విద్యా విధానం ముసాయిదా రూపొందించిన కమిటీ సిఫారసు చేసింది. 'సమాజంలో సుదీర్ఘకాలం ఉండే బలమైన బంధాన్ని కల్పించేది విద్యా వ్యవస్థ. అలాంటి వ్యవస్థలో టీచర్లే కీలకం. పారా టీచర్, శిక్షా కర్మి, శిక్షా మిత్ర తదితర పేర్లతో ఉండే తాత్కాలిక టీచర్లు ఆ పనిని పక్కాగా చేపట్టలేరు. అందుకే 2022 నాటికి తాత్కాలిక టీచర్ల వ్యవస్థను రద్దు చేయాల్సిందే'అని స్పష్టం చేసింది. వివిధ రాష్ట్రాల్లో గతంలో పారా టీచర్ల వ్యవస్థ ఉన్నా, సర్వ శిక్షా అభియాన్ వచ్చాక తెలుగు రాష్ట్రాల్లో విద్యా వలంటీర్ల పేరుతో ఉపాధ్యాయ ఖాళీల్లో తాత్కాలిక టీచర్ల నియామకాలను ప్రభుత్వం చేపడుతోంది. రెగ్యులర్ టీచర్ల నియామకాలు ఆలస్యమైనప్పుడు, నియామకాలు సకాలంలో చేపట్టలేకపోయినప్పుడు, పాఠశాలల్లో టీచర్ల అవసరం ఏర్పడినప్పుడు విద్యా వలంటీర్లను నియమించి ప్రభుత్వం విద్యా బోధనను కొనసాగిస్తోంది. ఇప్పుడు కూడా అదే విధానాన్ని అనుసరిస్తోంది. అయితే విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందాలన్నా, సమాజ నిర్మాణం సరిగ్గా ఉండాలన్నా రెగ్యులర్ టీచర్లతోనే సాధ్యం అవుతుందని కమిటీ స్పష్టం చేసింది.

**ఏళ్ల తరబడి వేలల్లో విద్యా వలంటీర్లు..**

రాష్ట్రంలో గత ఏడేళ్లుగా రెగ్యులర్ టీచర్లు లేకపోవడంతో విద్యా వలంటీర్లతోనే పాఠశాలలను కొనసాగించాల్సి వస్తోంది. ఏటా కనీసం పది వేల మందికి తగ్గకుండా విద్యా వలంటీర్లను నియమిస్తూ పాఠశాలల్లో విద్యా బోధనను విద్యాశాఖ కొనసాగిస్తోంది. ఉపాధ్యాయ ఖాళీలు, అదనపు అవసరం ఉన్న స్కూళ్లలో మొత్తంగా గతేడాది 15,661 మంది విద్యా వలంటీర్లను నియమించి విద్యా బోధనను కొనసాగించిన విద్యాశాఖ.. ఈ విద్యా సంవత్సరంలోనూ అదే చర్యలు చేపట్టింది. చివరకు విద్యా వలంటీర్ల నియామకం విషయంలోనూ కోర్టు ఆదేశాలు ఇస్తే తప్ప ముందుగా నియమించలేని పరిస్థితికి చేరుకుంది. హైకోర్టు ఆదేశాలతో ఇటీవల ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అది కూడా గతేడాది నియమించిన విద్యా వలంటీర్ల సంఖ్యకు మించకుండా నియమించుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో విద్యా వలంటీర్ల రెన్యూవల్‌కు చర్యలు చేపట్టింది.

**సిఫారసుల మేరకైనా వేగవంతం చేయాలి..**

రాష్ట్రంలోని పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్ల నియామకం విషయంలో గత ఏడేళ్లుగా తంటాలు తప్పడం లేదు. చివరకు హైకోర్టు జోక్యం చేసుకున్నా నియామకాల వ్యవహారం ముందుకు సాగడం లేదు. మహబూబ్‌నగర్‌లో టీచర్లు లేరంటూ హైకోర్టులో పిల్ దాఖలు అవ్వడంతో ప్రభుత్వం స్పందించి తాత్కాలికంగా విద్యా వలంటీర్లను నియమించి బోధన కొనసాగిస్తోంది. ప్రస్తుతం నూతన విద్యా విధానం ముసాయిదాలో 2022 నాటికి ఎలాంటి పేరుతోనూ తాత్కాలిక టీచర్లు ఉండొద్దని, ఆ వ్యవస్థను రద్దు చేయాల్సిందేనని, రెగ్యులర్ టీచర్లు ఉండాల్సిందేనని పేర్కొంది. అయితే న్యూ ఎడ్యుకేషన్ పాలసీ అమల్లోకి వచ్చిన తరువాత అయినా రాష్ట్రంలో రెగ్యులర్ టీచర్ల నియామకాలు వేగవంతం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ఐదేళ్లుగా లేని నియామకాలు..

రాష్ట్రంలో 2012 డీఎస్సీ నియామకాల తరువాత కొత్త టీచర్లు బడులకు రాలేదు. 2017లో నోటిఫికేషన్ జారీ చేసి 8,792 పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టినా నియామకాలు పూర్తి కాలేదు. న్యాయ వివాదాలు, ఎలక్షన్ కోడ్ పేరుతో కొన్నాళ్లు, విద్యా శాఖ అధికారులు పట్టించుకోక మరికొన్నాళ్లు ఆలస్యమైంది. మళ్లీ ఇప్పుడు సెకండరీ గ్రేడ్ టీచర్ వంటి కొన్ని పోస్టుల భర్తీ వ్యవహారం కూడా న్యాయ వివాదాల్లో చిక్కుకుంది. దీంతో పోస్టుల భర్తీ ఆలస్యం అవుతూనే ఉంది. వివాదాలు లేని పోస్టుల భర్తీ విషయంలోనూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో బడులకు కొత్త టీచర్లు రాలేని పరిస్థితి నెలకొంది.

సాక్షి
బుధవారం, జూన్, 19

# పసితనంపై మృత్యుపంజా

బిహార్‌లోని ముజఫర్‌పూర్ ప్రభుత్వాసుపత్రి మృత్యుగీతం ఆలపిస్తోంది. అమ్మలా అక్కున చేర్చుకుని ఆదరించి స్వస్థత చేకూర్చాల్సిన ఆసుపత్రి పసిపిల్లల ప్రాణాలు హరిస్తోంది. కేవలం 17 రోజుల్లో అక్కడ 130మంది మరణించారు. ఆ ఒక్కచోటే కాదు... ఆ జిల్లాలోని వేరే ప్రాంతాల్లో, పొరుగునున్న చంపారన్, మోతీహరి జిల్లాల్లో సైతం ఇప్పటికి వేయిమందికిపైగా పిల్లలు మెదడు వాపు వ్యాధి లక్షణాలతో ఇలా ఆసుపత్రుల్లో చేరారు. ఇంకా చేరుతున్నారు. ఒకపక్క ప్రభుత్వాసుపత్రులన్నీ ఇలా వ్యాధి సోకిన పిల్లలతో కిటకిటలాడుతుంటే పశ్చిమబెంగాల్‌లో వైద్యులపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం వైద్య సిబ్బంది సమ్మె చేయడంతో అసలే అంతంత మాత్రంగా వైద్య సేవలు పూర్తిగా స్తంభించాయి. ముజఫర్‌పూర్, దాని పొరుగు జిల్లాల్లో 1995 మొదలుకొని ఏటా ఇదే కాలంలో ఈ వ్యాధి ప్రబలుతున్నా వ్యాధికారక వైరస్ ఏమిటో, అదెందుకు వ్యాపిస్తున్నదో శాస్త్రీయంగా నిర్ధారించలేకపోయారు. దాని సంగతలా ఉంచి కనీసం ఇది దాపురించేకాలానికి ప్రభుత్వాసుపత్రుల్లో పిల్లల్ని చేర్చుకుని చికిత్స అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలోనూ నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. మొత్తంగా దీన్ని అక్యూట్ ఎన్సెఫలైటిస్ సిండ్రోమ్(ఏఈఎస్) అని పిలుస్తున్నా అది స్పష్టంగా ఫలానా కారణంగా వస్తుందని నిర్ధారించలేదు. వైరస్‌లు, బాక్టీరియా, ఫంగీ తదితరాలవల్ల ఈ సిండ్రోమ్ రావొచ్చునని, వడదెబ్బ తగలడం వల్ల సైతం ఇది ఏర్పడవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ముజఫర్‌పూర్‌లో వ్యాధిగ్రస్తులైన పిల్లల్లో 98శాతంమందికి ఏఈఎస్‌తో పాటు హైపోగ్లైసీమియా లక్షణాలుంటున్నాయన్నది వైద్యుల మాట. ఇలాంటి స్థితి వియత్నాం, బంగ్లాదేశ్‌ల తర్వాత ముజఫర్‌పూర్‌లోనే కనిపిస్తున్నదని వారంటున్నారు. పౌష్టికాహారలోపం వల్ల లేదా సరైన తిండి తినకపోవడంవల్ల హైపోగ్లైసీమియా ఏర్పడుతుంది. శరీరంలో గ్లూకోజ్ స్థాయిలు భారీగా పడిపోవడం దీని లక్షణం. ఖాళీ కడుపున స్థానికంగా లభించే లిచీ ఫ్రూట్ తింటున్న పిల్లల్లో తీవ్రమైన జ్వరం రావడం, చూస్తుండగానే అయోమయావస్థలోకి వెళ్లడం లేదా పిచ్చివాళ్లుగా మారడం, చివరకు కోమాలోకి వెళ్లడం చూసి వీరందరికీ ఏఈఎస్‌తోపాటు హైపోగ్లైసీమియా కూడా ఉన్నదని తేలుస్తున్నారు. లిచీ ఫ్రూట్‌లో ఉండే హైపోగ్లైసిన్–ఏ అనే పదార్థం విషపూరితమైనదని, మితిమీరి తింటే ఆ పదార్థం శరీరంలో గ్లూకోజ్ స్థాయిని గణనీయంగా తగ్గిస్తుందని పరిశోధనలో తేలింది. ఈ పండ్లు అధికంగా లభించే మే, జూన్ మాసాల్లోనే పిల్లల్లో ఈ ప్రాణాంతక వ్యాధి బయటపడుతోంది. పైగా ఈ పండ్లు తిన్నాకే వారంతా మంచాన పడుతున్నారు. కనుక వ్యాధి మూలాలు లిచీ ఫ్రూట్‌లో ఉండొచ్చునని లెక్కేస్తున్నారు. ముజఫర్‌పూర్‌లో పరిశోధనా కేంద్రం ఏర్పాటుచేస్తామని, పిల్లలకు వందపడకల ఐసీయూ యూనిట్, వైరాలజీ ల్యాబ్ నెలకొల్పుతామని కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ ప్రకటించారు. ఈ పని ముందే జరిగుంటే సమస్య ఇంత ముదిరేది కాదు.

ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కు చేయదల్చుకున్నామని ఎన్‌డీఏ ప్రభుత్వం 2015లో ప్రకటించింది. దానికి సంబంధించి ముసాయిదా సిద్ధమైందని వార్తలు వెలువడ్డాయి కూడా. కానీ ఎందుకో ఇంతవరకూ అది సాకారం కాలేదు. అంతకు చాన్నాళ్లముందు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం సైతం పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థను రూపొందిస్తామని హామీ ఇచ్చింది. మొన్న లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో తామొస్తే ఆరోగ్య పరిరక్షణను ప్రాథమిక హక్కు చేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సైతం ప్రకటించారు. ఇలా ఎవరెన్నిసార్లు చెబుతున్నా ఆరోగ్యరంగానికి కేటాయింపులు మాత్రం అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. మన దేశంలో చికిత్సకు అవకాశమున్న వ్యాధుల వల్ల ఏటా 24 లక్షలమంది జనం చనిపోతున్నారంటే వైద్య సేవలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో అర్థమవుతుంది. ఇక్కడ ప్రతి లక్షమంది రోగగ్రస్తుల్లో 122మంది నాసిరకం వైద్యసదుపాయాల కారణంగా చనిపోతున్నారని లాన్‌సెట్ గ్లోబల్ సర్వే చెబుతోంది. ఇది బ్రెజిల్(74), రష్యా(91), చైనా(46), దక్షిణాఫ్రికా(93), బంగ్లాదేశ్(57) దేశాలతో పోలిస్తే చాలాఎక్కువ. ముజఫర్‌పూర్, దాని పొరుగునున్న జిల్లాల్లో పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయడం, పౌష్టికాహార లోపం లేకుండా చూడటం వంటి చర్యలు తీసుకుంటే ఇన్ని మరణాలు సంభవించేవి కాదు. కనీసం అక్కడ తగినంతమంది వైద్యులున్నా, మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నా పసివాళ్ల ప్రాణాలు ఇలా గాల్లో కలిసేవి కాదు. వ్యాధి సోకిన నాలుగు గంటల్లోగా పిల్లలకు 10 శాతం డెక్స్‌ట్రోజ్‌ను అందిస్తే వారు సత్వరం కోలుకునే అవకాశమున్నదని వైద్యులు చెబుతున్నారు. కానీ ఆమాత్రం సదుపాయమైనా అందుబాటులో లేదు. చిత్రమేమంటే బిహార్‌కు పొరుగునున్న ఉత్తరప్రదేశ్ తూర్పుప్రాంతంలో సైతం పౌష్టికాహారలోపం అధికంగా ఉంది. దేశంలో ఏటా సంభవించే పిల్లల మరణాల్లో ఈ రెండు రాష్ట్రాల వాటా 35 శాతం.

ముజఫర్‌పూర్‌ను స్మార్ట్ నగరంగా ప్రకటించమంటూ కేంద్ర ప్రభుత్వానికి బిహార్ ప్రభుత్వం ఆమధ్య నివేదిక అందజేసింది. దాని ప్రకారం ఆ నగరంలో ప్రతి లక్షమంది రోగులకు 80మంది వైద్యులున్నారు. అక్కడి ఇతర జిల్లాల్లో పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయి గనుక ముజఫర్‌పూర్ చాలా మెరుగ్గా ఉన్నదని అనుకోవాలి. ఎందుకంటే చాలాచోట్ల లక్షమంది రోగులకు సగటున కేవలం ముగ్గురు ప్రభుత్వ వైద్యులు మాత్రమే ఉన్నారు! సాధారణ పరిస్థితుల్లో కనీసం లక్షమంది రోగులకు వందమంది వైద్యులుండటం అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ దేశాలన్నిటికీ హితవు చెబుతోంది. పట్టించుకునేవారేరి? వైద్యరంగంపై సమగ్రమైన దృక్పథంతో వ్యవహరించి సమూల ప్రక్షాళన చేయడానికి అవసరమైన నిధులను, మానవ వనరులను అందుబాటులోకి తీసుకొస్తే తప్ప ప్రజారోగ్య వ్యవస్థ బాగుపడదు. అంతవరకూ ఈ మరణమృదంగం ఆగదు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి బ.విదియ ప.2.30 వరకు తదుపరి తదియ, నక్షత్రం పూర్వాషాఢ ప.1.04 వరకు తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం రా.9.40 నుంచి 11.24 వరకు దుర్ముహూర్తం ప.11.33 నుంచి 12.26 వరకు అమృతఘడియలు... ఉ.8.01 నుంచి 9.44 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

# డాక్టర్‌జీ.. రోగులు ఎదురుచూస్తున్నారు

**బహుశా డాక్టర్లకు సమ్మె చేసే హక్కు ఉండకపోవచ్చు. బహుశా వారి ప్రథమ కర్తవ్యం తమ గురించి కాకుండా తమ రోగుల గురించి ఆలోచించాల్సి ఉండటమే కావచ్చు. కానీ ఒక డాక్టర్ తల బద్దలైనప్పుడు, మరొక డాక్టర్ యాసిడ్ దాడిలో కన్ను కోల్పోవలసి వచ్చినప్పుడు, వేరొక డాక్టర్ చావుతప్పి లొట్టపోయినట్లు దారుణంగా దెబ్బలు తిన్నప్పుడు, వారి తెల్లటి దుస్తులు రక్తం మరకలతో తడిసిపోయినప్పుడు.. డాక్టర్లకు నిరసన తెలిపే, విలపించే హక్కు లేదనడంలో ఏదైనా అర్థముందా? 'నేను దేవుడిని కాదు, డాక్టర్‌ని మాత్రమే. నా శక్తిమేరకు కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాను, దయచేసి నన్ను కొట్టొద్దు' అనే హక్కు డాక్టర్‌కు లేదని అనగలమా? మానవ ప్రాణిని కాపాడాల్సిన గొప్ప బాధ్యతలో ఉన్నవారు కుప్పగూలిపోతున్న భారతీయ ఆరోగ్య సంరక్షణా వ్యవస్థలో తొలి బలిపశువుల్లా మిగలాల్సిందేనా? అతడు లేక ఆమె ఒక రక్తమోడుతున్న నౌకలాగా కుదించుకుపోవలసిందేనా?**

కోల్‌కతాలోని నీల్ రతన్ సర్కార్ హాస్పిటల్‌లో గత వారం మృతుడి బంధువులు కొందరు తమ ఆగ్రహాన్ని అక్కడ పనిచేస్తున్న ఒక జూనియర్ డాక్టర్‌పై ప్రదర్శించారు. గుంపులో ఒకరు విసిరిన ఇటుక దెబ్బకు డాక్టర్ పరిబాహ ముఖోపాధ్యాయ్ తలకు తీవ్రగాయం తగిలింది. తనకు ఆపరేషన్ చేశారు కానీ, మెదడు దెబ్బతినే ప్రమాదం ఉందని సహ డాక్టర్లు భీతిల్లుతున్నారు. వైద్యుడిపై అలాంటి దాడి జరగటం ఈ దేశంలో ఇది తొలి సారి మాత్రం కాదు. దేశవ్యాప్తంగా వైద్యుల సమ్మె జరిగిన సోమవారం నాడు ఎయిమ్స్‌లో మరొక డాక్టరుపై కూడా కొంత మంది రోగులు దాడి చేశారు. మహానగరాల్లో, పట్టణాల్లో రెసిడెంట్ డాక్టర్లు, ట్రైనీ డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, జూనియర్ రెసిడెంట్ డాక్టర్లు వివిధ కారణాలతో రోగులు, వారి బంధువుల ఆకస్మిక ఆగ్రహాలకు గురై గాయాలపాలైన ఘటనలెన్నో.

నా కుమారుడు కూడా ప్రస్తుతం ఒక జూనియర్ రెసిడెంట్ డాక్టర్. తెల్లకోటు, స్తెతస్కోప్‌ను ధరించి అతడు కూడా ఒంటరిగా హాస్పిటల్ రౌండ్స్‌కు వెళుతుంటాడు. డాక్టర్ల తల్లిదండ్రులందరూ వైద్య విద్య అధ్యయన సమయంలో తమ పిల్లలు చేస్తున్న అత్యంత కఠినతరమైన ప్రయాణాన్ని చవిచూసినవారే. తీవ్రాతి తీవ్రమైన పోటీతో కూడిన ఎంట్రన్స్ పరీక్షలు, కోర్సు క్రమంలో వైద్య విద్య మోపుతున్న పర్వతభారం, నిత్యం జరిగే పరీక్షలు, వీటన్నింటినీ దాటుకుని ఎంబీబీఎస్ డిగ్రీ సాధించడం, తర్వాత పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ కోసం మళ్లీ పరీక్షలు, ఇంటర్న్‌షిప్‌కు సిద్ధమవటం.. తప్పదు. దీంతో మరోసారి నిద్రలేని రాత్రులు గడపడం (షవర్ వద్ద నిలబడి ఉన్నప్పుడు కూడా కనురెప్ప వాల్చడాన్ని నేర్చుకోవడం), ఆసుపత్రిలో పని ఒత్తిడి, అఖిల భారత పోటీ పరీక్షల కోసం మరో దఫా తీవ్రంగా సన్నద్ధమవడం, కోచింగ్ క్లాసులు, సంపుటాల కొద్దీ పుస్తకాలు చదవాల్సి రావడం, రోగుల పడక పక్కనే కూర్చుని, అదే సమయంలో రోగ వివరాలతో కూడిన ఫైళ్లను నింపడం, పని గంటల మధ్య అమూల్యంగా లభించే 15 నిమిషాలు మాత్రమే నిద్రపోవలసి రావడం.. ఇదీ వైద్య విద్యార్థుల దైనందిన జీవితం.

జూనియర్ డాక్టరుగా ఉంటున్న 24 ఏళ్లున్న నా కుమారుడికి కూడా వారాంతపు సెలవులు లేవు. సెలవుదినాలు లేవు. కానీ మరొక మానవ ప్రాణిని కాపాడాల్సిన గొప్ప బాధ్యత మాత్రం ఉంటుంది. వ్యాధుల బారిన పడిన వారి నొప్పి తగ్గించడం, సంరక్షణ లేని ప్రపంచంలో కేర్ తీసుకోవడంతోపాటు ప్రతి వైద్యుడూ పాటించవలసిన ఆ మహోన్నతమైన హిప్పోక్రాట్స్ ప్రమాణం కూడా తోడుగా ఉంటుంది. అదేమిటంటే, మొట్టమొదటగా వైద్యుడు చేయవలసింది 'రోగికి ఎలాంటి హానీ చేయకపోవడం'. వైద్యుల నిత్య జీవితాచరణ యముడినీ భయపెడుతుంది.

డాక్టర్ పరిబాహ ముఖోపాధ్యాయ అంతవరకు తాను సంరక్షకుడిగా ఉన్న అదే ఆసుపత్రిలో పడుకుని ఉన్నారు. తలకు బలమైన దెబ్బలు తగిలాయి. నాలాగే తన తల్లి కూడా అతడు పుస్తకాలతో కుస్తీపడటాన్ని చూసి ఉంటారు. పరీక్షా ఫలితాలలో తాను పొందిన నిమ్నోన్నతాలకు సాక్షిగా ఉండి ఉంటారు. రోగులతో అతడు కలిగివుండే భావోద్వేగ బంధాన్ని గమనించి ఉంటారు. మెడికోగా తన కుమారుడు పడుతున్న ఘర్షణను, ఒత్తిడిని మొత్తంగా ఆమె అనుభూతి చెంది ఉంటారు. అలాంటిది అదే ఆసుపత్రిలో అతడు బెడ్ మీద రోగిలా ఉండటం, తలకు బ్యాండేజ్ చుట్టి ఉండటం చూస్తూ ఆమె ఎంత ఆందోళన చెంది ఉంటారో! పార్కిన్‌సన్ వ్యాధితో బాధపడుతున్న ఆమె తన ముద్దుల




కుమారుడు నిస్త్రాణగా పడి ఉండటం చూసి తల్లడిల్లిపోయి ఉండరూ!

బహుశా డాక్టర్లకు సమ్మె చేసే హక్కు ఉండకపోవచ్చు. వారి ప్రథమ కర్తవ్యం తమ గురించి కాకుండా తమ రోగుల గురించే ఆలోచించాల్సి ఉండటం కావచ్చు. కానీ ఒక డాక్టర్ తల బద్దలైనప్పుడు, మరొక డాక్టర్ యాసిడ్ దాడిలో కన్ను కోల్పోవలసి వచ్చినప్పుడు, మరొక డాక్టర్ చావును సమీపించిన స్థితిలో దారుణంగా దెబ్బలు తిన్నప్పుడు, అతడి తెల్లటి దుస్తులు రక్తం మరకలతో తడిసిపోయినప్పుడు.. వారికి నిరసన తెలిపే హక్కు లేదనడంలో ఏదైనా అర్థముందా? 'నేను దేవుడిని కాదు, డాక్టర్‌ని మాత్రమే. నా శక్తిమేరకు కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాను, దయచేసి నన్ను కొట్టొద్దు' అనే హక్కు డాక్టర్‌కు లేదని అనగలమా?

కుప్పకూలిపోతున్న భారతీయ ఆరోగ్య సంరక్షణా వ్యవస్థ ముంగిట జూనియర్ డాక్టర్ గస్తీ తిరుగుతున్నారు. దేశంలో సరిపడినన్ని ఆసుపత్రులు లేవు. డాక్టర్లు లేరు. ఒకే ఒక్క డాక్టర్ వందమంది రోగులను పర్యవేక్షించాల్సి వస్తున్న దుర్భర స్థితిలోనూ రోగులపట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతుంటాయి. ఆసుపత్రుల్లోని వైద్య సామగ్రి మరమ్మతుకు కూడా సాధ్యం కానంతగా పాడై ఉంటాయి. ఈ స్థితిలో శస్త్రచికిత్సలు చేయడం అంటే అదృష్టాన్ని నమ్ముకోవడమే.

చీకటితో నిండి ఉండే ఆసుపత్రి వరండాల్లో, మృత్యువు తనదైన గర్వాతిశయంతో పచార్లు చేస్తుంటుంది. వైద్యులను అద్భుత ప్రావీణ్యతలు కలిగిన శ్రామికుడిగా మనం లెక్కించకూడదు. డాక్టర్లు శక్తినంతటినీ ధారపోసి రోగి ప్రాణాలు కాపాడటానికి ప్రయత్నిస్తుంటారు కానీ రోగి ఆఖరి శ్వాసను వారు అడ్డుకోగలరా? నా కుమారుడి మెడ వెనుక భాగంలో పొడిపించుకున్న పచ్చబొట్టు ఏమిటో తెలుసా..! 'సంరక్షించు, నయం చెయ్యి, నూతనంగా సృష్టించు'. రోగిని సంరక్షించడమే ఒక డాక్టర్ రెండో స్వభావం అయినప్పుడు, కాపాడటమే తన లోపరహిత వైఖరి అయినప్పుడు, అతడు లేక ఆమె రోగి త్వరగా చావాలని అనుకోగలరా? కానీ మన సమాజానికి బలిపశువులు అవసరం. ఆరోగ్య సంరక్షణా వ్యవస్థ కుప్పగూలిపోయినందువల్ల, నిస్సహాయుడైన జూనియర్ డాక్టర్ ప్రజాగ్రహం ఫలితాలను మొత్తంగా తానే భరించవలసి వస్తోంది.

ప్రస్తుతం డాక్టర్–పేషెంట్ నిష్పత్తి విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం ప్రతి వెయ్యిమంది ప్రజలకు ఒక్క వైద్యుడు ఉండాలి. కానీ భారతదేశంలో ఇది 1:2,000గా ఉంటోంది. అంటే దేశంలో 50 శాతం డాక్టర్ల కొరత ఉంటోందని దీనర్థం. భారత్‌లోని 8,56,065 మంది అల్లోపతి వైద్యుల్లో 6 లక్షల మంది క్రియాశల ప్రాక్టీషనర్లుగా ఉంటున్నారు. వైద్యపరీక్షలకు సంబంధించి విస్తారమైన అనుభవం ఉన్న భారతీయ వైద్యులకు ఎనలేని నైపుణ్యాలు ఉంటున్నాయి. కానీ వీరి ప్రావీణ్యతలకు తగినంత మౌలిక వసతుల వ్యవస్థ మద్దతు లేకపోవడంతో అత్యంత దుర్భర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు.

2009లో జస్టిస్ కట్జు, జస్టిస్ ఆర్‌ఎమ్. లోథా ఈ అంశంపై ముఖ్యమైన తీర్పు వెలువరించారు. 'విధినిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వైద్యుల పట్ల ఈ న్యాయస్థానం ఎలాంటి సానుభూతి చూపదు. కానీ వైద్య వృత్తిని కూడా వినియోగదారు సంరక్షణ చట్టం పరిధిలోకి తీసుకురావడం వల్ల మన దేశంలో వైద్యులపై ఎక్కడ చూసినా ఆరోపణలు వెల్లువెత్తున్నాయి'.

2017 సెప్టెంబరులో డాక్టర్ కఫీల్ ఖాన్‌ను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. కారణం. ఆ సంవత్సరం ఆగస్టు నెలలో గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో ఆక్సిజన్ సౌకర్యం లేక 30–40 మంది పిల్లలు చనిపోయారు. కానీ ఇప్పుడు తెలుస్తున్నదేమిటంటే, ఆసుపత్రికి ఆక్సిజన్ సిలిండర్ల సరఫరా విషయంలో డాక్టర్ ఖాన్ వ్యక్తిగత స్థాయిలో ధీరోదాత్తమైన ప్రయత్నం చేశారు. తన వ్యక్తిగత కార్యాచరణ ద్వారా ఆయన అనేకమంది పిల్లల ప్రాణాలు కాపాడారు. అత్యవసర పరిస్థితుల్లో పిల్లల ప్రాణాలను కాపాడటానికి రక్తం ధారపోసిన నిజమైన హీరో డాక్టర్ కఫీల్ ఖాన్. కానీ ఆయనపై అన్యాయంగా ఆరోపించి, అరెస్టు చేసి మరీ విచారణ జరిపారు.

గోరఖ్‌పూర్‌లోని ఎన్నారెస్ హాస్పిటల్‌లో జరిగిన ఘటనలపై రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు బలం పుంజుకున్నాయి. రాజకీయ ప్రత్యర్థి పక్షాలు దీంట్లోకి చొరబడి మతపరమైన ఘర్షణలను రెచ్చగొట్టాలని, రాజకీయంగా లబ్ధి పొందాలని ప్రయత్నించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఈ ఘటనలో రాజకీయ కుట్రను చూశారు. ప్రతిపక్షం దీంట్లో ఎన్నికల ఎజెండాను చూసింది. అయితే ఇవేవీ నాకు ప్రాధాన్యం కాదు. నేను చూస్తున్నదల్లా, ఎలాంటి కళాకాంతులూ లేని వ్యక్తి తన రోగిముందు కూర్చుని అతడి నాడి పట్టి చూస్తూ, గుండె కొట్టుకొనే శబ్దాన్ని వింటూ, ఒక డాక్టరుకు, రోగికి మధ్య ఉండే అత్యంత సాన్నిహిత్య బంధాన్ని దేశం ముందు వ్యక్తీకరిస్తున్నారు. ఇది సమగ్రతకు సంబంధించిన బాంధవ్యం. మాటల్లో వర్ణించలేని సాన్నిహిత్యం.

కుప్పగూలిపోతున్న భారతీయ ఆరోగ్య సంరక్షణా వ్యవస్థ.. ప్రతి భారతీయ డాక్టర్‌లో నిబిడీకృతమైన శిలాసదృశమైన, వజ్రకవచ స్ఫూర్తికి వ్యతిరేకంగా నిలుస్తోంది. తనతో ఘర్షిస్తున్న ఈ బాధామయ పరిస్థితులకు వ్యతిరేకంగా భారతీయ డాక్టర్ తన వైద్యపరమైన తేజోవంతమైన స్ఫూర్తిని ప్రదర్శిస్తూనే ఉన్నారు. వారు చేస్తున్న ఈ పవిత్రకర్తవ్యం ప్రజాగ్రహానికి గురై ఇలా తన్నులు తినాల్సిందేనా? అతడు లేక ఆమె ఒక రక్తమోడుతున్న నౌకలాగా కుదించుకుపోవలసిందేనా?

బహుశా, రక్తగాయాల బారినపడిన ఈ వైద్యమూర్తులు మళ్లీ తన విధులను చేపట్టవచ్చు. తమ గాయాలను పక్కనబెట్టి వారు విధుల్లోకి తిరిగిరావచ్చు. తమ వార్డుకు తిరిగిరావచ్చు. వైద్యులను సంరక్షించని పాలనాయంత్రాంగం, కుప్పగూలుతున్న మౌలిక వ్యవస్థకు వ్యతిరేకంగా తమ మానసిక శక్తి అనే ఏకైక కాంతిపుంజాన్ని వారు సమున్నతంగా ఎత్తిపట్టవచ్చు. అతిగొప్ప మహర్షులు, సైంటిస్టులు, చింతనాపరుల పుట్టినిల్లు అయిన భారతదేశం ఇప్పటికీ మహోన్నత వైద్యులను తయారు చేస్తూనే ఉంది. డాక్టర్ పరిబాహ ముఖోపాధ్యాయ్.. త్వరగా కోలుకోండి. మీ పేషెంట్లు మీకోసం వేచి చూస్తున్నారు.

సాగరికా ఘోష్, సీనియర్ పాత్రికేయురాలు

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




### అరుదు



"ఒక నటి ఆత్మకు సన్నిహితంగా ఉండే పాత్ర ఆమె కెరీర్‌లో చాలా అరుదుగా లభిస్తుంది. కాఫిర్‌లోని దియా మిర్జా పాత్ర కైనాజ్ అలాంటి వాటిలో ఒకటి. చక్కని ముఖ కవళికలు, కళ్లు ఆమె హృదయంలోని దుఃఖాన్ని వీక్షించేలా చేస్తాయి. అద్భుతంగా తెరకెక్కిస్తున్న దర్శకుడు, స్ఫూర్తివంతమైన కథనాన్ని అందిస్తున్న రచయితలకు అభినందనలు"

– బోమన్ ఇరానీ, నటుడు

### చట్టం



"దేశ రాజధాని ఢిల్లీలోని ముఖర్జీ నగర్‌లో జరిగిన సంఘటనను కొందరు బాధ్యతారహితులైన రాజకీయ నాయకులు, మీడియా వారు హిందూ–సిక్ ఘర్షణగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారు. అది కేవలం శాంతి భద్రతల సమస్య మాత్రమే. ఆవేశపరుడైన ఓ సిక్కు డ్రైవర్‌కూ, అచ్చమైన పోలీసుల్లాగే ప్రవర్తించే కొందరు పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణ అది. ఇరు వర్గాల వారు దాన్ని చట్టపరంగా పరిష్కరించుకోవాల్సి ఉంది"

– రాజేష్ కల్రా, జర్నలిస్ట్

### జాగ్రత్త



"సానియా, నేను పిల్లాడి గురించి చాలా ఆందోళన చెందా. మీరు ఆ పిల్లాడిని హుక్కా సెంటర్‌కు ఎలా తీసుకెళ్లారు? అది ప్రమాదకరం కాదూ? నాకు తెలిసినంత వరకూ క్రీడాకారులకు, బాలురకు జంక్ ఫుడ్ మంచిది కాదు. ఒక తల్లిగా, స్వయంగా క్రీడాకారిణివి కూడా అయిన నీకు ఆ విషయం బాగానే తెలిసి ఉంటుంది"

– వీణా మాలిక్, పాక్ నటి

### నాకు తెలుసు



"వీణా, నేనేమీ నా కొడుకును హుక్కా సెంటర్‌కు తీసుకు వెళ్లలేదు. ఇతరుల కంటే నా కొడుకు గురించి నేనే ఎక్కువ జాగ్రత్త పడతా. నీలాంటివారో, ఇంకెవరైనా ఆ విషయంలో కలుగజేసుకోవాల్సిన అవసరం లేదు. అలాగే, నేనేమీ పాకిస్తాన్ క్రికెట్ టీమ్ డైటీషియన్‌ను కాదు, వారికి తల్లినీ, ప్రిన్సిపాల్‌ను, టీచర్‌ను కూడా కాదు"

– సానియా మీర్జా, క్రీడాకారిణి

### సన్యాసిని



"తన తండ్రి పేరు జత చేసుకోలేదని బీజేపీ ఎంపీ సాధ్వి ప్రజ్ఞను కాంగ్రెస్ నేతలు ఎగతాళి చేస్తున్నారు. కానీ, ఒక సన్యాసినిగా ఆమె కుటుంబ సంబంధాలన్నిటినీ పరిత్యజించిందనే వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. అదే పార్లమెంట్‌లో వందేమాతరం వినిపిస్తుండగా బీఎస్పీ ఎంపీ షఫిఖుర్ రహ్మాన్ బయటకు వెళ్లిపోతున్నప్పుడు మాత్రం మౌనం వహించారు"

– ప్రీతి గాంధీ, బీజేపీ నేత

# వన్నె తగ్గుతోన్న ఉపాధ్యాయ విద్య

తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయ విద్య ప్రాభవం ఏటికేటికీ కొడిగడుతోంది. రెండు దశాబ్దాల కిందట ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారికి ఓ భరోసా, ప్రత్యేక గౌరవం ఉండేవి. కానీ ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. విచ్చలవిడిగా ప్రైవేటు కళాశాలలకు తలుపులు తెరవడమే దీనికి ప్రధాన కారణం. ఏటా డిగ్రీ ప్రాతిపదికగా బీఎడ్, ఇంటర్ ఆధారంగా డీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. అయితే వీటికి దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. పదేళ్ల కిందట లక్షల్లో పోటీపడే అభ్యర్థులు ఇప్పుడు వేలకు పడిపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో 2018 లెక్కల ప్రకారం 13 ప్రభుత్వ డైట్ కళాశాలలుండగా 869 ప్రైవేటు యాజమాన్యం ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ప్రభుత్వ కళాశాలలకు 1300 సీట్లుండగా ప్రైవేటుకు 44,500 సీట్లను కేటాయించారు. తెలంగాణలో 180 డీఎడ్ కళాశాలలకుగాను ప్రభుత్వానికి చెందిన 28 కళాశాలల్లో తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో 850 సీట్లుండగా ప్రైవేటు కళాశాలలకు 6,500 సీట్లను మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ సీట్లన్నీ పూర్తి స్థాయిలో భర్తీకావడం లేదు. ఏటా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోవడం, నోటిఫికేషన్ విడుదలైనా తక్కువ పోస్టులకు పరిమితం చేయడం, దీనికి కారణం.. గతేడాది సుప్రీంకోర్టు సైతం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులకు బీఎడ్ వారికీ అవకాశమివ్వాలని ఎన్‌సీటీఈని ఆదేశించింది. దీంతో డీఎడ్ కోర్సులో చేరేందుకు అభ్యర్థులు విముఖత చూపుతున్నారు. పర్యవసానమే ఈ ఏడాది అతి తక్కువగా 19,190 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 2001–2005 వరకు బీఎడ్ ప్రవేశాలకు గిరాకీ ఉండేది. 2009లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులకు డీఎడ్ వారినే తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు తీర్పు నివ్వడంతో బీఎడ్ కోర్సుకు స్పందన క్రమంగా తగ్గుతూ వస్తోంది. గత పదేళ్లలో డీఎడ్, బీఎడ్ చేసిన వారు రెండు రాష్ట్రాల్లో కలిపి 9లక్షలకు పైనే ఉంటారు. వీళ్లలో 80 శాతం మంది సర్కారు కొలువులు రాక ప్రైవేటు విద్యా సంస్థల్లో తక్కువ ఊడిగానికి పనిచేయలేక ఉపాధ్యాయ వృత్తిని వదిలి ప్రైవేటు రంగాలకు మళ్లారు. ఉపాధ్యాయ విద్యను చుట్టుముట్టిన సమస్యల పరిష్కారానికి ప్రైవేటు కళాశాలల సంఖ్య తగ్గించాలి. జిల్లాకు రెండు, మూడింటికే పరిమితం చేయాలి. బోధనా పద్ధతుల ప్రమాణాలను పెంచాలి. ఏటా నియామకాలు చేపట్టాలి. ప్రైవేటు పాఠశాలలు కనీసం రూ. 15 వేల వేతనమిచ్చేలా చట్టం తీసుకురావాలి. ఇలా చేస్తే ఉపాధ్యాయ విద్యకు మునుపటి వైభవం వస్తుంది.

తిరుమల శ్రీనివాస్ కరుకోల, హైదరాబాద్ । 81438 14131

# తెలుగు భాషా సంస్కృతులు కాపాడండి!

సందర్భం



డా. జి. వి. పూర్ణచందు

2004 నుండీ తెలుగునేల నలుమూలలా భాషోద్యమం విస్తరించేందుకు నాటి ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖరరెడ్డిగారి సానుకూల స్పందన గొప్పది. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రభృతులతో అప్పటికప్పుడు ఒక సాధన సమితిని ఏర్పాటుచేసి, ఆనాటి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, తెలుగు భాషకు ప్రాచీనతా హోదా సాధించి ఇచ్చారాయన. భాషోద్యమ స్ఫూర్తిని తరువాతి ప్రభుత్వాలు అందుకోలేకపోవడంవల్ల తెలుగు భాషాసంస్కృతులకు తీరని అన్యాయం జరిగింది. ఆధునిక సాంకేతిక ఉపకరణాలను ఇంగ్లిష్‌తో సమానంగా ఉపయోగించే విధంగా తెలుగును 'ప్రపంచ తెలుగు' గా తీర్చిదిద్దే కార్యాచరణ వైఎస్సార్ కాలంలోనే ప్రారంభమైంది. తెలుగు భాషపట్ల రాజశేఖరరెడ్డిగారు చూపించిన మమకారం చిరస్మరణీయం.

'సాంకేతిక తెలుగు', 'ప్రపంచ తెలుగు' అనేవి భాషోద్యమ చిరకాల స్వప్నాలు. భాషోద్యమ ప్రముఖులు గట్టి ఒత్తిడి తేవటంతో 2016లో నాటి ప్రభుత్వం తెలుగు భాషాపరిరక్షణకు సూచనలు చేసేందుకు ఒక కమిటీని నియమించింది. భాషకు అవమానం చేసేవారిని శిక్షించే అధికారాలతో తెలుగు ప్రాధికార సంస్థను ఏర్పాటుచేయవలసిందిగా ఆ కమిటీ ప్రభుత్వానికి సూచించింది. అలాగే 7 అకాడమీల పునర్నిర్మాణాన్ని కూడా ఈ కమిటీ ప్రతిపాదించింది. మూడేళ్ల కాలంలో ఈ కమిటీ సూచనలు ఆచరణకు నోచుకోలేకపోయాయి.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ, గ్రంథాలయ సంస్థ, తెలుగు అభిలేఖ భాండాగారం (ఆర్కయివ్స్), ప్రాచ్యలిఖిత భాండాగారం లాంటి సంస్థలను, వాటి ఆస్తులను, వాటి సంపదను ఆంధ్రప్రదేశ్ తన వాటాగా తెచ్చుకోలేకపోవటం వలన అవి ఎవరికో పుట్టిన బిడ్డలుగా నిరాదరణ పాలయ్యాయి. తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాల విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారికి అన్యాయం జరుగుతుంటే ఊరక చూస్తూనే ఐదేళ్లు గడిచిపోయాయి.

భాషాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలన్నీ 'తెలుగు ప్రాధికార సంస్థ' అధీనంలో వివిధ విభాగాలుగా ఒకే గొడుగు కింద ఏర్పరిస్తే, పరస్పర సమన్వయంతో పని చేయటం సాధ్యం అవుతుంది. అధికార భాషగా తెలుగు అమలు, తెలుగు అకాడమీని భాషాభివృద్ధి విభాగంగా ప్రాధికార సంస్థ పరిధిలోకి తెచ్చి తెలుగు పాఠ్యాంశాల నిర్ణయంలో కీలక పాత్ర వహించేలా చూడటం, 'ఇ–తెలుగు' సాంకేతిక విభాగం, తమిళ వర్చువల్ అకాడమీ పద్ధతిలోనే ఇతర రాష్ట్రాలలో స్థిరపడిన తెలుగు వారికి తెలుగు నేర్పించి, ప్రాథమిక, మాధ్యమిక పద్ధతిలో సర్టిఫికేట్ కోర్సులు నిర్వహించే విభాగం, తెలుగులోంచి ఇతర భాషల్లోకి, ఇతర భాషల్లోంచి తెలుగులోకి అనువాద విభాగం, ప్రచురణల విభాగం, గ్రంథాలయ వ్యవస్థలను కూడా ఈ ప్రాధికార సంస్థ పరిధిలోకి తీసుకురావాలనే సూచనలను గత ప్రభుత్వం మౌలికంగా ఆమోదించింది. వాటిని ఆచరణలోకి తేవలసిందిగా ప్రార్థన.

తెలుగు భాషోద్యమం ప్రాథమిక విద్యను తప్పనిసరిగా విద్యార్థుల మాతృభాషలోనే బోధించాలని, పై చదువుల కొచ్చేసరికి, తెలుగు నేలమీద నడుస్తోన్న ప్రతీ విద్యాలయంలోనూ, హైస్కూలు స్థాయి నుండీ ఉన్నత స్థాయి వరకూ, ఇంజనీరింగ్, మెడిసిన్లతో సహా అన్ని కోర్సులలోనూ తెలుగును ఒక బోధనాంశం చేయాలని తెలుగు భాషా పరిరక్షణ కమిటీవారు సూచించారు. ఇది యునెస్కో వారు సూచిస్తున్న ప్రమాణం. ప్రభుత్వాలు, విద్యాలయాలు కూడా దీనికి బద్ధులు కావాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ వెబ్‌సైట్లను తెలుగులోకి అనువదించే పని చేపట్టాలి. వాటిలోని సమాచారం మొత్తాన్ని తెలుగులో పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్ చేయాలి.

అంతర్జాలంలో తెలుగు వ్రాయటానికి, చదవటానికి, చూడటానికి తగిన రీతిలో బ్రౌజర్లు తయారు కావాలి. ప్రాంతాలకతీతంగా తెలుగు ప్రజలందరూ మాట్లాడే ప్రతీ మాటనీ, దాని ఆంగ్లార్థం, ప్రయోగాలతో సహా ఒక మహానిఘంటువు(లెక్సికాన్)ని రూపొందించటం, దానిని డిజిటలైజేషన్ చేయటం తక్షణ అవసరం.

1985 నుండీ అకాడమీల పునరుద్ధరణకోసం చేసిన పోరాటాల ఫలితంగా పుట్టిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ, సంగీత నాట్య అకాడమీ, గ్రామీణ కళల అకాడమీ, సైన్సు అకాడమీలు పుడుతూనే అనాథలయ్యాయి. ఒక్క నాటక అకాడమీ తప్ప తక్కిన అకాడమీలకు కార్యవర్గాలను ఏర్పరచిన మర్నాడే ఎన్నికల కోడ్ రావడంతో వాటి కాళ్లూ చేతులు కట్టేసి సింహాసనం మీద కూర్చోబెట్టినట్టయ్యింది. భాషా సంస్కృతులకు సేవచేసినవారే చరితార్థులై నిలిచారు. తెలుగులోనే పాలించండి తెలుగు వెలుగై జీవించండి! తెలుగుతల్లిని మనం కాపాడితే తెలుగుతల్లి మనల్ని కాపాడుతుంది.

వ్యాసకర్త ప్రముఖ వైద్యులు, సాహితీవేత్త
మొబైల్ : 94401 72642

# అభిమానధనుడు

కాళిదాస మహాకవి రఘువంశ మహాకావ్యం ప్రారంభంలో గొప్పనైన సూర్యవంశ రాజుల చరిత్రను వర్ణించగల సామర్థ్యం నాకు లేకపోయినా ఆ రాజుల సద్గుణములు నా చెవిన పడినాయి. అవి నన్ను ఊరికే ఉండనివ్వకుండా మహనీయ గుణవంతులైన రఘువంశరాజుల చరిత్రను తప్పక వర్ణించి తీరవలసిందే అన్నట్లుగా ప్రేరేపిస్తున్నాయి అని పేర్కొన్నాడు. మహోన్నతమైన సూర్యవంశంలో జన్మించిన శ్రీరాముడు కూడా వంశమర్యాదకు తగినట్లు సకల సంపదలను, సద్గుణ సముదాయంను, వినయ విధేయతలను, శాస్త్ర విద్యలను, శస్త్రాస్త్ర నైపుణ్యాన్ని కలిగియున్నాడు.

శ్రీరాముని నైపుణ్యాన్ని గురువులు, అతనిలోని పరిపాలనా శక్తిని ప్రజలు గుర్తించారు. శ్రీరాముని నడక సౌందర్యాన్ని దశరథుడు, ఆపదలలోనున్న వారిని రక్షించే గుణాన్ని ఋషులు, సత్య నిష్ఠను దేవతలు పితృవాక్య పరిపాలనా దక్షతను భరత లక్ష్మణులు దగ్గరగా దర్శించారు. అట్లే శరణాగత రక్షకత్వాన్ని విభీషణుడు మిత్ర ధర్మాన్ని సుగ్రీవుడు, శౌర్యపరాక్రమాలను రావణుడు, వినయ విధేయతలను భరద్వాజ వసిష్టాదులు దర్శించారు. శ్రీరాముని గుణాలు వీరు వారు అనే భేదం లేకుండా శత్రువులను, మిత్రులను, బంధువులను, ప్రజలను అందరినీ ఆకర్షించునట్టివి అందుకే లక్ష్మణుని చేతిలో ముక్కు చెవులు కోల్పోయిన శూర్పణఖ, బాణం దెబ్బతిన్న మారీచుడు కూడా శ్రీరాముని గుణాలను ప్రస్తుతించారు.

జ్యోతిర్మయం

లక్ష్మణుడు నేను బంధుత్వపరంగా శ్రీరాముడికి తమ్ముడిని, కానీ అతని గుణాలకు వశుడనై శ్రీరామదాసుడనైనానని హనుమంతునికి తెలిపాడు. సీతాన్వేషణకై బయలుదేరి లంకలో ప్రవేశించిన హనుమంతుడు తాను రామదాసుడనని పరిచయం చేసుకున్నాడు. కోసల రాజ్యానికి చెందిన ప్రజలు శ్రీరామునికి సంబంధించిన కథలనే వింటూ, చెబుతూ, స్మరిస్తూ శ్రీరామ నామాన్ని పలుకుతూ ఉంటే జగమంతా రామమయం అన్నట్టుగా ఉండేదట. ఆనాడే కాదు అప్పటివారే కాదు నేటి తరానికి చెందినవారు కూడా అందరూ శ్రీరాముని లాగా జీవనాన్ని గడపాలని రావణుని లాగా జీవించవద్దు అని ఆకాంక్షిస్తూ ఉంటారు.

మహాకవులు శ్రీరాముని వృత్తాంతాన్ని పద్య, గద్య కావ్యాలుగా, నాటకాలుగా ఇంకా మరెన్నో ప్రక్రియలతో వర్ణించి చెప్పారు. శ్రీరాముని వంటి భర్త లభించాలని ఎందరో యువతులు, శ్రీరాముని వంటి పుత్రుడు కావాలని తల్లిదండ్రులు, ఆదర్శవంతమైన పరిపాలనతో రామరాజ్యాన్ని స్థాపించిన శ్రీరాముని వంటి ప్రభువులే రావాలని ప్రజలు ఈనాటికీ కోరుకుంటూనే ఉన్నారు. నాటినుండి నేటి వరకు అన్ని ప్రాంతాల్లో జనులందరి అభిమానాన్ని సంపూర్ణంగా చూరగొన్నట్టి 'అభిమానధనుడు' శ్రీరామచంద్రుడే.

– సముద్రాల శఠగోపాచార్యులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం
19-6-2019



ఏడేళ్లుగా ఇదే ఫిట్‌నెస్‌తో ఉన్నా!
– లోపలి పేజీలో



ఇది షాహిద్ సినిమా కాదు!
– లోపలి పేజీలో



ఎంగేజ్‌మెంటా? ఎప్పుడు జరిగింది?
– లోపలి పేజీలో



రాజ్‌తో అదితి?
– లోపలి పేజీలో

చెట్టు నీడ

# పాలు పోసిన వ్యక్తి

జైన మతంలో 24 వ తీర్థంకరుడు వర్ధమానుడు. జ్ఞానోదయమైన తరువాత ‘మహావీరుడు’ అని పేరు పొందిన ఆయన ఒకసారి శిష్యులకు ఆత్మ సంయమనం, అహింస, సహనశీలతల గురించి గొప్పగా చెబుతుండగా ఒక వ్యక్తి విన్నాడు. ఆయన చెప్పేవన్నీ అబద్ధాలుగా, ఆచరణ సాధ్యం కానివిగా భావించాడు. పక్కనే ఉన్న మిత్రుడితో మహావీరుడి గురించి చులకనగా మాట్లాడి ‘‘ఇలాంటి ఉపన్యాసాలతో శిష్యులను, జనాలను మోసం చేస్తున్నాడు. ఏదో ఒకరోజు ఈయన బండారం బట్టబయలు చేస్తాను’’ అని పళ్లు నూరుతూ వెళ్లిపోయి సమయం కోసం వేచి చూశాడు.



ఒకసారి మహావీరుడు పద్మాసనం వేసుకుని, కళ్లుమూసుకుని ధ్యానంలో ఉండడాన్ని చూసిన ఆ వ్యక్తి, అదే సరైన సమయంగా భావించి వేగంగా ఇంటికి వెళ్లి సలసలా కాగుతున్న పాలు తెచ్చి ధ్యానంలో ఉన్న మహావీరుని శరీరంపై గుమ్మరించాడు. ఆ సమయంలో శిష్యులెవరూ లేరు. ఆ వేడికి మహావీరుడి శరీరం కాలి బొబ్బలు లేచింది.

మహావీరుడు ఆ బాధను భరించాడే కానీ కళ్లు తెరవలేదు. ఏడవలేదు. బాధ అని అరిచి పరుగెత్తలేదు. ధ్యానం కొనసాగించాడు. అది చూసిన ఆ వ్యక్తి మహావీరుడి సహనానికి చలించిపోయాడు. ఆయన శరీరంపై కనబడిన బొబ్బలు చూసి భయపడిపోయాడు. అతడిలో పశ్చాత్తాపం మొదలైంది. ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా మహావీరుడి పాదాలపై పడి బిగ్గరగా ఏడుస్తూ ‘‘నన్ను క్షమించండి స్వామీ. మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకున్నాను’’ అన్నాడు.

కళ్లు తెరిచిన మహావీరుడి కళ్ల నుండి కన్నీరు కురిసింది. అది చూసిన ఆ వ్యక్తి ‘‘స్వామీ బాధగా ఉందా? ఉపచారం చేయమంటారా?’’ అన్నాడు. మహావీరుడు ‘‘నాయనా! ఇది బాధ వలన కలిగిన కన్నీరు కాదు. ఆనంద భాష్పాలు. పాషాణం లాంటి నీ హృదయం కరిగించే శక్తి నా సహనానికి ఉన్నందుకు సంతోషంతో వచ్చినవి. కోపం పోయి, క్షమాపణ వేడుకునే స్థాయిలో పరివర్తన కలగడం చూసిన ఆనందం వలన కలిగినవి’’ అన్నారు. ఆ మాటలు నిజంగానే వేడిపాలు పోసిన వ్యక్తిలో గొప్ప ప్రభావం చూపించాయి. ఆ సంఘటనతో అతడు మంచివాడుగా మారాడు.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

హెల్దీ ఫుడ్

# ఆరోగ్యాన్ని మొలకెత్తించండి

**మొలకెత్తిన గింజలు, ధాన్యాలు, కాయ ధాన్యాలలో పోషకాలు ఎక్కువ స్థాయిలో ఉంటాయి. 35 శాతం వరకు మాంసకృత్తులు ఉంటాయి. మొలకెత్తిన తర్వాత గింజలలో విటమిన్ ఎ ఎనిమిది రెట్లు పెరుగుతుంది. మాంసం తినడం వల్ల శరీరంలో పేరుకునిపోయే కొవ్వును, క్యాలరీలను తగ్గిస్తుంది. మొలకలను తినడం జీర్ణసంబంధ, కడుపు ఉబ్బరం సమస్య ఉన్నవారికి ఎంతో సహాయకారిగా ఉంటుంది.**



- మొలకల్లో పీచుపదార్థం అధికంగా ఉంటుంది. ఇది బరువు తగ్గించడంలో సహాయపడడం తోపాటు శరీరంలో జీవక్రియల పెరుగుదల శాతాన్ని పెంచుతుంది. శరీరంలోని వ్యర్థ, విష పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది
- మొలకల్లో సమృద్ధిగా ఉండే ఫ్యాటీ యాసిడ్స్ శరీరానికి అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తాయి
- మొలకల్లో పుష్కలంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ జుట్టు, గోళ్లు పెరగడానికి, చర్మం నిగారింపుతో ఉండడానికి సహాయపడతాయి
- మొలకల్లో అధికంగా ఉండే విటమిన్ సి వల్ల జుట్టు పొడవుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. పురుషుల్లో బట్టతలను, పేనుకొరుకుడుని నివారిస్తుంది
- మొలకలు రక్తనాళాల్లో కొత్త రక్తకణాలు ఏర్పడేలా చేస్తాయి. దాంతో శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది
- మొలకలను తినడం వల్ల శరీరానికి అవసరమయ్యే ఆల్కెజెస్ అందుతాయి. ఇవి శరీరానికి రక్షణ కల్పిస్తాయి. ముఖ్యంగా ప్రాణాంతక వ్యాధులైన క్యాన్సర్ వంటి వాటిని నివారించడంలో సహాయపడతాయి. అసిడిటీని నివారిస్తాయి
- మొలకెత్తిన విత్తనాల్లో వివిధ రకాల విటమిన్స్ ఎ, బి కాంప్లెక్స్, సి, ఇ అధికంగా ఉన్నాయి. సహజ గింజలలో కంటే మొలకెత్తిన విత్తనాల్లో 20 సార్లు అసలు విలువలను పెంచే విటమిన్స్‌గా కొన్ని పరిశోధనలు చూపించబడినాయి. బీన్స్ మొలకల్లో విటమిన్ బి1 అధికంగా ఉంటుంది.
- ఇన్ని ప్రయోజనాలు ఉన్న మొలకలను వారంలో కనీసం రెండు లేదా మూడు రోజులు తీసుకోవడం మంచిది. అయితే కొందరి శరీర తత్వానికి మొలకలు సరిపడకపోవచ్చు. వీటిని తిన్న తర్వాత కడుపులో గ్యాస్, గడబిడగా ఉండటం, వాంతి వచ్చినట్లు ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తే, అవి వీరి శరీరానికి సరిపడవని గ్రహించి, తీసుకోవడం మానేయాలి.

# చెల్లి పాదాల చెంత

**ఆడపిల్లని తండ్రి గుండెల మీద పెంచుతాడు.**
**అన్నదమ్ములు కనురెప్పల్లా చూసుకుంటారు.**
**తండ్రి గుండెల్లోని ప్రేమను.. అన్నదమ్ములు ఇచ్చే భద్రతను..**
**ఈ సైనిక సోదరులు శశికళకు పంచి ఇచ్చారు.**
**అరిచేతుల మీదుగా అమెను ఏడడుగులు వేయించారు!**



వధువు శశికళ నడిచేందుకు చేతులు పరుస్తున్న సైనికులు : అన్న లేని లోటును ఈ అన్నయ్యలు తీర్చారు

శశికళ పెళ్లి. అందరూ ఉన్నారు. అన్నయ్యే లేడు. అతడెందుకు పెళ్లి రాలేదు! రాలేనంత దూరంలో ఉన్నాడు. బిహార్‌కు జమ్మూకశ్మీర్ ‘రాలేనంత’ దూరం కాదే! కాదు కానీ, అతడు మాత్రం తిరిగి రాలేనంత దూరాలకు వెళ్లిపోయాడు. 2017 నవంబర్ 18న జమ్ముకశ్మీర్‌లోని బండిపొరా ప్రాంతంలోని ఒక ఇంట్లో నక్కి ఉన్న ఉగ్రవాదుల్ని మట్టుపెట్టేందుకు ఢిల్లీలోని హై కమాండ్ నుంచి వచ్చిన ఆదేశాలతో ముందుకు ఉరికిన ‘గరుడ కమెండో ఫోర్స్’ సైనికుడు జ్యోతి ప్రకాష్ నిరాలా అతడు. లైట్ మెషీన్ గన్‌తో ఆరుగురు భయంకర ఉగ్రవాదుల్ని హతమార్చి, ఆ పోరులో శత్రువు తూటాలకు బలయ్యాడు. ఆ ఆరుగురిలో ఇద్దరు 2008 ముంబై పేలుళ్ల సూత్రధారులకు సమీప బంధువులు! వాళ్లను అంతమొందించడం ద్వారా జ్యోతి ప్రకాష్ భవిష్యత్తులో జరగబోయే దాడుల్ని నివారించాడు. అతడి మరణానంతరం భారత ప్రభుత్వం అతడికి అశోక చక్రను ప్రకటించింది.

***

పెళ్లింట్లో అన్న లేడు. అన్నకు వచ్చిన అశోకచక్ర ఉంది. అందులోంచి అన్న దీవిస్తున్నట్లుగా ఉంది. శశికళ పెళ్లికి ఆమె అన్న సేవలు అందించిన గరుడ ఫోర్స్ నుంచి యాభైమంది జ్యోతిప్రకాష్‌లు వచ్చారు. అవును. సొంత అన్నయ్యల్లా వాళ్లంతా కొద్ది గంటలు సెలవు పెట్టి శశికళ పెళ్లికి వచ్చారు. పెళ్లి పెద్దలు వాళ్లే అయ్యారు. పెళ్లి ఏర్పాట్లూ వాళ్లే చేశారు. పెళ్లి ఖర్చూ వాళ్లే భరించారు. చేతి పట్టున ఉంచమని ఆ చెల్లికి 5 లక్షల రూపాయలను ఇచ్చారు. గరుడ ఫోర్స్‌లో వందల మంది సైనికులు ఉంటారు. వాళ్లంతా తలా ఇంత అని జమచేస్తే కూడిన మొత్తం అది. కానుకగా డబ్బు ఇచ్చారు. ‘దీర్ఘసుమంగళీ భవ’ అని ఆశీర్వదించి, అక్షింతలు వేశారు. అయితే అక్కడితో తమ సహచరునికి నివాళి ఇచ్చినట్లవుతుందని అనుకోలేదు. ఇంకా ఏదైనా చెయ్యాలని అనుకున్నారు. తమ అరచేతుల మీద నవ వధువుని నడిపించుకున్నారు! బిహార్‌లో అది సంప్రదాయం అవునో కాదో. ఈ సైనికులు మాత్రం ఒక మంచి సంప్రదాయానికి అరిచేతులిచ్చారు. ఇది ఒక వందన సమర్పణ కన్నా తక్కువేం కాదు.



జ్యోతి ప్రకాష్ నిరాలా చెల్లి శశికళ పెళ్లికి వచ్చిన గరుడ కమెండో ఫోర్స్ (భారత వైమానిక దళం) సైనికులు

***

గరుడపక్షికి హృదయం ఉంటుందా? పదిహేనేళ్ల క్రితం భారత వైమానిక దళం ‘గరుడ కమెండో ఫోర్స్’ని ప్రారంభించినప్పుడు గరుడపక్షికి ఉండే వేగం, బలం.. ముఖ్యంగా ఆ నిశితమైన చూపును దృష్టిలో పెట్టుకుని ఈ వాయుసేనకు గరుడ కమెండో అని పేరు పెట్టింది. అయితే గరుడకు వేగం, బలం, నిశితమైన చూపు మాత్రమే కాకుండా హృదయం కూడా ఉంటుందని ఈ చిన్న సంఘటన రుజువు చేసింది. ఇక్కడ గరుడ పక్షి అంటే పక్షి కాదు. గరుడ సైనికుడు. ఆ సైనికుడి హృదయం ఎంత మెత్తనో చెప్పుకునే ముందు అతడి విధులు ఎంత గట్టివో తెలుసుకోవాలి. వైమానిక స్థావరాలను కంటికి రెప్పలా కాపాడటం గరుడ బాధ్యత. అదొక్కటే కాదు విపత్తులలో గల్లంతైనవారి కోసం ప్రాణాలొడ్డి అన్వేషిస్తారు. ఇళ్లు కోల్పోయినవారిని పునరావాస కేంద్రాలకు క్షేమంగా తరలిస్తారు. ఇవన్నీ చిన్న పనులు. పెద్ద పని ‘పీస్ కీపింగ్’. ఏ దేశంలోనైనా అస్థిర పరిస్థితులు ఎంతకూ తగ్గుముఖం పట్టకుండా ఉన్నప్పుడు అక్కడ శాంతిని, సుస్థిరతను నెలకొల్పేందుకు విమానాలు వేసుకుని వెళతారు. అక్కడే ఉండిపోతారు. అక్కడి వైరివర్గాలు వీళ్లపై దాడులు చేయడానికి వస్తాయి. తప్పించుకుంటారు. అంతే తప్ప ‘ఆపరేషన్’ కంప్లీట్ అయ్యేవరకు అక్కడి నుంచి కదలరు. లోకల్‌గా ఉగ్రవాదుల పైకి వెళ్తారు. బోర్డర్‌లో యుద్ధ పిపాసుల మీదకూ వెళ్తారు. మొత్తం 1500 మంది ఉంటారు. ఢిల్లీలోని హెడ్‌క్వార్టర్స్ నుంచి వాయు వేగంతో కదిలి సమస్యాత్మక ప్రాంతంలో ల్యాండ్ అవుతారు. టఫ్ జాబ్. డైరెక్ట్ యాక్షన్ అండ్ ఎటాక్. మొత్తం మీద రెండే గరుడ డ్యూటీలు. విజయమో, వీరస్వర్గమో. ఒక అశోకచక్ర అవార్డు ఉంటుంది. నాలుగు శౌర్యచక్ర అవార్డులు ఉంటాయి. ఇంకా అనేకమైన వాయుసేన మెడల్స్ ఉంటాయి. అన్నీ అత్యంత ప్రతిష్టాత్మకమైనవి. గత ఏడాదే శశికళ అన్నయ్య జ్యోతి ప్రకాశ్ నిరాలాకు అశోకచక్ర అవార్డు వచ్చింది. నేలమీద జరిగిన ఫైట్‌కు ఈ అవార్డు అందుకున్న తొలి నింగి సైనికుడు జ్యోతి ప్రకాశ్. బిహార్, రోహ్‌తాక్ జిల్లాలోని బద్లాది గ్రామం నుంచి సైన్యంలోకి వచ్చాడు. గరుడ ఫోర్స్ మొదలైన మరుసటి సంవత్సరంలోనే లేత వయసులో సర్వీస్‌లోకి వచ్చాడు. రెండేళ్ల క్రితం జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన ముఖాముఖి పోరులో ఆరుగుర్ని హతమార్చి తను అమరుడయ్యాడు.



అమర జవాను, అశోకచక్ర అవార్డు గ్రహీత జ్యోతి ప్రకాష్ నిరాలా

దేశంకోసం ప్రాణాలర్పించిన సైనికుడి రుణాన్ని ప్రభుత్వం అవార్డు ఇచ్చి తీర్చుకుంటే.. సాటి సైనికులు ఆ అమరవీరుడి చెల్లెల్ని తమ చేతులపై నడిపించుకుని రుణం తీర్చుకున్నారు.

పరిశోధన

# శిలాజెమ్

**గువ్వలాంటి ఈ పాపాయి గవ్వలతో ఆడుకుని అక్కడితే ఆగిపోయి ఉంటే.. ఇప్పుడు ఆమె గురించి చెప్పుకోవడానికి ఏమీ ఉండకపోయేది. గవ్వలాగ కనిపిస్తూనే గవ్వ కానిదేదో అశ్వత ఆకర్షించింది. అది శిలాజం అని చెప్పింది అమ్మ. అలాంటి శిలాజాల కోసం వెతకడం మొదలు పెట్టింది. శిలాజాల శోధన అంత సులువు కాదని అప్పట్లో అశ్వతకు తెలియదు. అలాగని వాటి కోసం వెతకడం మాననూ లేదు.**



అశ్వత : శిలాజాల అన్వేషణ, ప్రొఫెసర్ల పర్యవేక్షణలో పరిశీలన

ఐదేళ్ల వయసు నుంచి శిలాజాల సేకరణ మొదలు పెట్టింది, ఇప్పుడామె దగ్గర 79 శిలాజాలున్నాయి. ఇన్ని ప్రత్యేకమైన శిలాజాలను (ఫాజిల్స్) సేకరించడం సీనియర్ సైంటిస్ట్‌లకు తప్ప మామూలు వాళ్లకు సాధ్యంకాదు. పన్నెండేళ్లకే ఇంతగా అధ్యయనం చేసిందంటే ఆమెను బాల మేధావిగా గుర్తించి తీరాల్సిందే అని ప్రశంసించారు చెన్నై, పెరియార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రామ్‌కుమార్. ఇండియాలో అత్యంత చిన్న వయసు పేలియెంటాలజిస్ట్ (శిలాజ పరిశోధకురాలు) అశ్వత.

## సెలవొస్తే మ్యూజియానికే!

అశ్వతకు సముద్ర తీరాలే కాదు పుస్తకాలంటే కూడా అంతే ఇష్టం. చదవడం రానంత చిన్నప్పటి నుంచి కూడా ఎన్‌సైక్లోపీడియా పుస్తకాన్ని విపరీతంగా ఇష్టపడేది. పేజీలు తిప్పుతూ బొమ్మలు చూస్తూ చదివినట్లే ఫీలయ్యేది. ఓ పేజీలో ఫాజిల్ (శిలాజం) కనిపించింది. సముద్రానికెళ్లి వెతికితే బోలెడన్ని దొరుకుతాయని ఆ చిట్టి బాల్యానికి పెద్ద ఆశ. అశ్వత సరదా మీద నీళ్లు చల్లడం ఇష్టంలేని ఆమె తల్లి విజయరాణి ఆమెను ఎగ్మోర్‌లో ఉన్న మ్యూజియానికి తీసుకెళ్లింది. ఐదేళ్ల పాపాయిగా తొలిసారి అశ్వత ఆ మ్యూజియాన్ని చూసింది. తరవాత అదే మ్యూజియానికి ఎన్నిసార్లు వెళ్లిందో లెక్కే లేదు. స్కూలుకెళ్లినంత క్రమబద్ధంగా మ్యూజియానికి వెళ్లేది. స్కూలుకు సెలవు వస్తే వాళ్ల ఫ్యామిలీ వీకెండ్ టూర్ మ్యూజియానికి లేదా సముద్ర తీరానికి. పిక్‌నిక్‌ని ఎంజాయ్ చేసినంత ఆనందంగా మ్యూజియంలోని శిలాజాలను చూసేది. అశ్వత ఊరికే చూస్తుందనే మాత్రమే అనుకుంది విజయరాణి, ఆ చిన్న మెదడుతో పెద్ద అధ్యయనమే చేస్తోందని తెలియదు.



సెమినార్‌లలో శిలాజాలపై అశ్వత ప్రసంగం

### కూతురి కోసం

ఎన్ని సర్దుబాట్లు చేసుకుని అయినా సరే, ఆమె కోసం పేరెంట్స్‌లో ఎవరో ఒకరు ప్రయాణిస్తూనే ఉన్నారు. శిలాజ క్షేత్రాలు ఎంత దూరంలో ఉన్నా అక్కడికి అశ్వతను తీసుకెళ్లడం, ఎప్పుడు, ఎక్కడ సెమినార్‌లు జరుగుతుంటే వాటికి హాజరు కావడానికి ఆమెకు తోడుగా వెళ్లడం కోసం ఒకరు ఎప్పుడూ సిద్ధంగా ఉంటున్నారు. అదే మాట అడిగినప్పుడు ‘మా అమ్మాయి కోసం మేము కాకపోతే మరెవరు చేస్తారు’ అంటారు నవ్వుతూ.

## ఊహించని మలుపు

అశ్వత ఐదవ తరగతిలో ఉన్నప్పుడు ఓ కార్యక్రమంలో తిరుచ్చి భారతీదాసన్ యూనివర్సిటీ మెరైన్‌సైన్స్ హెచ్ఓడీని కలవడం జరిగింది. అశ్వత అడుగుతున్న సందేహాలను వివరిస్తూనే ఆమె అప్పటికే శిలాజ అధ్యయనంలో తెలుసుకున్న సంగతులకు ఆశ్చర్యపోయారు ఆయన. ఎన్నో ఏళ్ల పరిశోధనతో తప్ప సాధ్యం కాని పరిజ్ఞానం ఇంత చిన్న వయసులో సాధ్యం చేసినందుకు ప్రశంసించారు. యూనివర్సిటీకి వచ్చి తనను కలిస్తే అశ్వతకు మరిన్ని విషయాలను వివరిస్తానని తన కార్డు ఇచ్చారు. కానీ తీరా అశ్వత వెళ్లేటప్పటికి ఆయన అక్కడ లేరు. నిరాశతో వెనక్కు రావాల్సిన సమయంలో అశ్వతను ఆమె తల్లి విజయరాణి పెరియార్ యూనివర్సిటీకి తీసుకెళ్లింది. అక్కడ డాక్టర్ రామ్‌కుమార్‌కి తాను సేకరించిన ఫాజిల్స్‌ను చూపించిందా అమ్మాయి. వాటిని చూసిన రామ్‌కుమార్ ఏకంగా మూడు గంటలసేపు వాటి గురించి అశ్వతకు వివరించారు. మూడు గంటల్లో ఆయన చెప్పిన సమాచారాన్ని అంతే వేగంగా ఆకళింపు చేసుకుందామె. బాల మేధావి అని భుజం తట్టి, అశ్వతకు ఓ ప్రాజెక్టు ఇచ్చారాయన. కావేరీ నది తీరాన అరియలూర్ దగ్గర విస్తరించిన నేల శిలాజ అధ్యయన క్షేత్రం. అక్కడ పరిశోధన చేయమని రూట్ మ్యాప్ ఇచ్చి పంపించారాయన. అలా ఫాజిల్ సేకరణను ముమ్మరం చేసింది అశ్వత. వాటి గురించి ఆమె అప్పటికే చదివి ఉండడంతో ఎగ్మోర్ మ్యూజియంలో లేని నమూనాలను మాత్రమే కలెక్ట్ చేసింది. ఇప్పుడు అశ్వత ఇల్లు ఓ మినీ మ్యూజియాన్ని తలపిస్తోంది. అది కూడా ఎగ్మోర్‌లో ఉన్న మ్యూజియానికి ఎక్స్‌టెన్షన్‌గా అన్నమాట!



## చెప్పడమూ ఇష్టమే

అశ్వతకు ఫాజిల్స్‌ను సేకరించడంతోపాటు వాటి గురించి తన తోటి పిల్లలకు చెప్పడం కూడా అంతే ఇష్టం. స్కూలు హెడ్ మాస్టర్‌లకు ఉత్తరాలు రాసి అనుమతి తీసుకుంది. మొదట్లో ఆమె ఉత్సాహం చూసి ‘చిన్న పిల్లను నిరాశ పరచడం ఎందుకు, ఓ గంట టైమ్ ఇద్దాం’ అని మాత్రమే అనుమతినిచ్చారు. ఇప్పుడు స్కూళ్లు, కాలేజ్‌లతోపాటు పేలియెంటాలజీ ఇన్‌స్టిట్యూట్‌లు కూడా ఆమెను సెమినార్‌లకు ఆహ్వానిస్తున్నాయి. ఆమె ప్రసంగాన్ని ఆసక్తిగా వినే వారిలో డాక్టరేట్‌లు సాధించిన సీనియర్ సైంటిస్టులు కూడా ఉంటున్నారు.

అశ్వత చదువులో కూడా బ్రిలియెంట్ స్టూడెంటే. సైన్స్, మ్యాథ్ ఒలింపియాడ్‌లలో అవార్డులందుకుంది. ఇటీవల చెన్నైలో జరిగిన ఫిక్కీ ఎఫ్ఎల్ఓ కార్యక్రమంలో ఆమె రాష్ట్ర గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ చేతుల మీదుగా యంగెస్ట్ పేలియెంటాలజిస్ట్ అవార్డు అందుకుంది.

ఒక శిలాజం ఒక చరిత్ర పుస్తకంతో సమానం. వందల వేల ఏళ్ల నాడు భూమి మీద సంచరించిన స్థితిగతులను వివరిస్తుంది. ఈ రంగంలో అధ్యయనానికి మన దేశంలో ఇన్‌స్టిట్యూషన్‌లు ఉన్నాయి, కానీ ఆదరణ అంతగా లేదు. ఆసక్తి ఉన్నవాళ్లు ఇతర దేశాలకు వలస వెళ్లేది ఇలాంటి పరిస్థితిలోనే. అందుకే మన మేధను మనదేశ నిర్మాణానికి ఉపయోగించుకునే అవకాశాలు కల్పించాలి. అప్పుడే మన అశ్వతలు మనదేశంలోనే ఉంటారు. ఈ అమ్మాయి పెద్దయ్యేలోపు మన దగ్గర పేలియెంటాలజీ రీసెర్చ్ మరింత పటిష్టంగా విస్తరించాలని కోరుకుందాం.

– మంజీర



## లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! నేనొక అమ్మాయిని ప్రేమిస్తున్నాను. నేనూ తనూ వన్ ఇయర్ లవ్ చేసుకున్నాం. ఒకప్పుడు తను నాతో ఏం చెయ్యడానికైనా సిద్ధంగా ఉండేది. నేనూ తన విషయంలో అలానే ఉండేవాడ్ని. తన విషయంలో అలాగే ఆలోచించేవాడిని. కానీ ఇప్పుడు నేనంటే ఇష్టమే అంటుంది కానీ.. కాల్ చేస్తే సరిగా మాట్లాడదు. మెసేజ్ చేస్తే రిప్లై ఇవ్వదు. తనకి నా మీద ప్రేమ ఉందో లేదో అర్థం కావట్లేదు సార్. కొంచెం మీరైనా చెప్పండి ప్లీజ్.

– నరేంద్ర

*లేదన్నా! ప్రేమ లేదన్నా!!*

*'డిప్రెషన్‌లోకి వెళ్లిపోతాడు సార్! మరీ అంత సూటిగా చెబితే ఎలా సార్..?? కొంచెం బట్టర్ రాసి స్మూత్‌గా చెప్పాలి కదా సార్..!? లేకపోతే మీ తింగరి సలహాల కోసం ఎవరూ ఉత్తరం రాయరు కదా సార్..?? అప్పుడు మన క్లినిక్ కొల్లేరే కదా సార్..?! ప్లీజ్ అండర్‌స్టాండ్ సార్..!! ఆ తర్వాత ఈగలు కొట్టుకుంటూ జీవించాలి సార్..!!! అప్పుడు ఈగలను ఎలా కొట్టాలన్న డౌట్స్ ఉన్న వాళ్లు ఉత్తరాలు రాస్తారు సార్!'*

నిజాన్ని దాచిపెట్టి అనవసరమైన అబద్ధాలు కొట్టే బదులు.. ఈగలు తోలుకుంటే.. కాన్షియస్ అయినా క్లియర్‌గా ఉంటుంది కదా నీలూ!?? పోనీ నువ్వు చెప్పు ఎలా చెబుతావో!?

*'హలో! నరేంద్రా డోంట్ వర్రీ యార్!! గర్ల్ ఫ్రెండ్ లేకపోతే చాలా కలిసి వస్తాయి డూడ్!! ఖర్చు ఉండదు. టెన్షన్ ఉండదు. ఇంకో బెటర్ గర్ల్ నిన్ను ప్రేమించే ఛాన్స్ ఉంటుంది. పోతే పోయింది బ్రో ఆ అమ్మాయి.. లుక్ ఎట్ ద బ్రైటర్ సైడ్ ఛాంప్.. పాత చింతకాయ పచ్చడి గురించి ఫర్గెట్ అయ్యేసి.. నీ ఫ్యూచర్‌లో కొత్త ఆవకాయ పచ్చడి వెయిటింగ్ నరేంద్రా! బాగా చెప్పానా సార్??'*

నేను చాలా కాంప్లికేటెడ్‌గా చెప్పాను. నువ్వు చాలా సింపుల్‌గా చెప్పావు నీలూ!

lovedoctorram@sakshi.com

# సినిమా ఎప్పుడెప్పుడు చూద్దామా అనిపిస్తోంది

''క్రికెట్ నేపథ్యంలో విభిన్న కథాంశంతో వస్తున్న చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి'. క్రీడల నేపథ్యంలో వచ్చే సినిమాలకి ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతారు. ఆటల నేపథ్యంలో తీసిన ప్రతి సినిమా ఘన విజయం సాధించింది. ఆ కోవలోనే ఈ సినిమా కూడా హిట్ అవుతుంది'' అని చిరంజీవి అన్నారు. ఐశ్వర్యా రాజేష్, డా.రాజేంద్రప్రసాద్, కార్తీక్ రాజు, 'వెన్నెల' కిషోర్ ముఖ్య పాత్రల్లో భీమనేని శ్రీనివాసరావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి'. 'ది క్రికెటర్' అన్నది ఉపశీర్షిక. కె.ఎస్.రామారావు సమర్పణలో క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై ఎ.వల్లభ నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను మంగళవారం చిరంజీవి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టి అంతర్జాతీయ స్థాయికి వెళ్లి, ఎన్నో కీర్తి ప్రతిష్ఠలు సంపాదించి, దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసే కథతో ఈ సినిమా ఉంటుంది. టీజర్ చూస్తుంటే ఈ సినిమా ఎప్పుడెప్పుడు చూద్దామా అనిపిస్తోంది. ఐశ్వర్యా రాజేష్ నాలుగైదు నెలలు క్రికెట్‌లో శిక్షణ తీసుకొని నటించారంటే, ఆ అమ్మాయికి ఉన్న డెడికేషన్ అది. తను ఎవరో కాదు.. మా కొలీగ్ రాజేష్ కూతురు.. కమెడియన్ శ్రీలక్ష్మీ మేనకోడలు. మన తెలుగు సినిమాల్లో తెలుగు అమ్మాయిలు కొరవడిపోతున్న ఈరోజుల్లో ఐశ్వర్యా రాజేష్ రావడం శుభపరిణామం. భీమనేనికి ఈ సినిమా ఓ మైలురాయిలా నిలుస్తుంది'' అన్నారు. ''క్రీడల నేపథ్యంలో ఇంతకుముందు చాలా సినిమాలు వచ్చినా, స్క్రీన్‌ప్లే, సబ్జెక్ట్ పరంగా మా సినిమా విభిన్నమైంది. తమిళంలో హిట్ అయిన ఈ సినిమా తెలుగులో కూడా ఘనవిజయం సాధిస్తుందని నమ్ముతున్నా'' అన్నారు భీమనేని శ్రీనివాసరావు. కె.ఎస్. రామారావు మాట్లాడుతూ– ''40 సంవత్సరాలుగా చిరంజీవికి, మా సంస్థకి ఉన్న అనుబంధం గురించి అందరికీ తెల్సిందే. ఒక గొప్ప సినిమా అయిన మా 'కౌసల్య కృష్ణమూర్తి' టీజర్‌ను లాంచ్ చేసిన చిరంజీవి గారికి ధన్యవాదాలు. ఇప్పుడున్న యూత్‌కి కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఎనర్జిటిక్‌గా ఉంటూనే మంచి ఎమోషనల్‌గా ఉండే ఒక రైతు కుటుంబానికి సంబంధించిన కథ. ఈ సంవత్సరం రాబోయే గొప్ప సినిమాల్లో కచ్చితంగా మా సినిమా ఒకటి'' అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎ.సునీల్ కుమార్, లైన్ ప్రొడ్యూసర్: వి.మోహన్‌రావు.

– చిరంజీవి


కేయస్ రామారావు, చిరంజీవి, భీమనేని శ్రీనివాసరావు

# సంచలనాల ఫకీర్



**త**మిళ క్రేజీ స్టార్ ధనుష్ హీరోగా రూపొందిన తాజా హాలీవుడ్ చిత్రం 'ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ద ఫకీర్' ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి రేపుతోంది. ఇప్పటికే అంతర్జాతీయంగా పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించబడి విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. బార్సిలోనా సెయింట్ జోర్డి ఫిల్మ్ ఫెస్ట్‌లో ఈ సినిమా బెస్ట్ కామెడీ మూవీగా ఆడియన్స్ ఛాయిస్ అవార్డ్ అందుకుంది. ఈ నెల 21న మన దేశంతో పాటు మరిన్ని దేశాల్లో థియేటర్లలో విడుదల కానుంది. జపాన్‌లో మంచి ఆదరణతో చైనాలోనూ విడుదల కానుంది. ఈ చిత్రకథ ఏంటంటే...

**వీధి ఇంద్రజాలికుని విశ్వయాత్ర**

సౌరభ్‌గుప్తా నిర్మాతగా, ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు కెన్‌స్కాట్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ధనుష్ అజా అనే ఇంద్రజాలికుని పాత్ర పోషించారు. ఒక భారతీయ స్ట్రీట్ మెజిషియన్ అనూహ్యంగా విదేశాలకు, పారిస్ వరకూ చేసిన ప్రయాణం నేపథ్యంగా అల్లుకున్న ఈ సినిమా కథకు రొమైన్ పుర్టోలస్ రాసిన నవల ఆధారం. అనూహ్యంగా సాగిన ఫకీర్ ప్రయాణంతో పాటు శరణార్థుల సమస్యలను కూడా ఈ సినిమా చూపిస్తుంది. ఈ సినిమాలోని 'మదారి..' పాట మంచి హిట్ నెంబర్‌గా నిలిచింది. ఈ పాటలో ఫ్రెంచ్ నటి బెర్నైస్ బెజో ధనుష్ సరసన నర్తించడం విశేషం. ఈ సందర్భంగా విడుదల చేస్తున్న గోల్డెన్ రేషియో ఫిల్మ్స్ సిఈఓ అభయానంద్ సింగ్ మాట్లాడుతూ – ''మాన్ సూన్ వెడ్డింగ్' తర్వాత అంతటి యూనివర్సల్ అప్పీల్ ఉన్న సినిమా కావడంతోనే హక్కులు తీసుకున్నాం. ప్రపంచ వ్యాప్తంగా 160 దేశాల్లో రిలీజ్ చేస్తున్నాం. సంచలన సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

# ఎంగేజ్‌మెంటా? ఎప్పుడు జరిగింది?

''ఇప్పుడు చేతిలో ఉన్న సినిమాలు పూర్తయితే ఇక రెజీనా కొత్త సినిమాలేవీ ఒప్పుకోరు''... చెన్నైలో జరుగుతున్న ప్రచారం ఇది. ఎందుకు సినిమాలు చేయరంటే.. ఈ నెల 13న ఆమె ఎంగేజ్‌మెంట్ జరిగిందని అంటున్నారు. ఎవరితో? అంటే నో ఆన్సర్. అయితే రహస్యంగా నిశ్చితార్థం జరిగిందని ఓ తమిళ వెబ్‌సైట్ పేర్కొంది. అవునా? అని రెజీనా సన్నిహితులను అడిగితే.. ఎంగేజ్‌మెంటా? ఎప్పుడు జరిగింది? అంటున్నారు. ''ఈ వార్తలో ఏ మాత్రం నిజం లేదు. అసలు రెజీనాకి ఇప్పుడు పెళ్లి చేసుకునే ఉద్దేశమే లేదు. ప్రస్తుతం చేతినిండా సినిమాలున్నాయి'' అని కూడా స్పష్టం చేశారు. ఇక రెజీనా చేస్తున్న సినిమాల విషయానికొస్తే.. పీవీపీ సంస్థ నిర్మించిన 'ఎవరు'లో నటించారామె. ఆగస్ట్‌లో ఈ చిత్రం రిలీజ్ కానుంది. అలాగే నూతన దర్శకుడు అర్జున్ సాయి తెరకెక్కిస్తున్న 'ఉత్సవం'లో నటిస్తున్నారు. సెప్టెంబర్‌లో ఈ సినిమా విడుదల కానుంది. అటు తమిళంలో చేస్తున్న 'కసడ తపర' చివరి షెడ్యూల్ జరుగుతోంది. ఇది కాకుండా 'పార్టీ' అనే సినిమా తుది దశలో ఉంది. అలాగే అరవింద్ స్వామితో చేస్తున్న 'కల్లా పార్ట్' చివరి షెడ్యూల్‌లో ఉంది. ఇలా తెలుగు, తమిళ సినిమాలతో బిజీగా ఉన్న రెజీనా సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలనుకుంటారా?


రెజీనా

విజయ్ దేవరకొండ, షాలినీ పాండే జంటగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన 'అర్జున్ రెడ్డి' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రం షాహిద్ కపూర్, కియారా అద్వాని జంటగా సందీప్ దర్శకత్వంలోనే 'కబీర్‌సింగ్' పేరుతో హిందీలో రీమేక్ అయింది. ఈ నెల 21న చిత్రం విడుదల కానున్న సందర్భంగా షాహిద్, కియారా చెప్పిన విశేషాలు.


కియారా అద్వానీ, షాహిద్ కపూర్

# ఇది షాహిద్ సినిమా కాదు!

**● 'కబీర్‌సింగ్' చిత్రం కోసం తిరిగి కాలేజీకి వెళ్లడాన్ని ఎలా ఫీల్ అవుతున్నారు?**

చాలా భయం వేసింది. ఎందుకంటే ఇందులో నేను దాదాపు పాతికేళ్ల కుర్రాడిలా కనిపించాలి. ఇప్పుడే వచ్చిన కొత్త హీరో అనే ఫీల్‌ని ఆడియన్స్‌కి కలగజేయాలి. ఈ సినిమాలోలా రియల్ లైఫ్‌లోనూ నేను ఎమ్‌బీబీఎస్ స్టూడెంట్ కావడంతో ఈజీ అయింది. టీజర్ చూసినవాళ్లు కాలేజీ స్టూడెంట్‌లానే ఉన్నారని చెప్పగానే ఆనందం అనిపించింది. అయితే ఈ చిత్రంలో కనిపిస్తున్నట్లు నా వయసు పాతికేళ్లు కాదు.

**● తెలుగు 'అర్జున్‌రెడ్డి' సినిమా చూశారా?**

చూశాను. బాగా నచ్చింది. సినిమాలోని క్యారెక్టర్, ఎమోషనల్ థింగ్స్‌కి బాగా కనెక్ట్ అయ్యాను. ఈ ఫిల్మ్ మేకింగ్‌ని ఎంజాయ్ చేశాను. హీరోది చాలా గొప్ప పాత్ర. విజయ్ బాగా చేశాడు.

**● 'అర్జున్‌రెడ్డి' అప్పుడు విజయ్ చేసింది తక్కువ సినిమాలు. మీరు 30కి పైగా సినిమాలు చేశారు కాబట్టి అంచనాలు ఉంటాయి. ప్రెషర్ ఏమైనా?**

ఇలాంటి సబ్జెక్ట్‌ను కొత్త హీరో అయితే డిఫరెంట్ ఎనర్జీతో చేస్తారు. అలాగే నాలాంటి ఎస్టాబ్లిష్డ్ యాక్టర్ ఇలాంటి క్యారెక్టర్ చేసినప్పుడు కూడా డిఫరెంట్‌గానే ట్రై చేస్తారు. అయితే ఎస్టాబ్లిష్డ్ యాక్టర్స్‌కు ఇలాంటి క్యారెక్టర్స్ చేయడం కొంచెం కష్టం అనిపించొచ్చు. ఎందుకంటే ఆల్రెడీ ఆడియన్స్ ఒకసారి సినిమా చూశారు. అంతకంటే ఎక్కువ పెర్ఫార్మెన్స్ ఇవ్వాలి. అయినా ఈ సినిమా వరకూ ఆడియన్స్ ఇందులోని క్యారెక్టర్‌ని చూస్తారు. మన గురించి అంతగా ఆలోచించరు. కథ అలాంటిది. అందుకే ఇది షాహిద్ కపూర్ సినిమా కాదు. కబీర్ సింగ్ సినిమా. అఫ్‌కోర్స్ ఈ పాత్ర చాలెంజింగ్ అని మాత్రం ఒప్పుకుంటాను.

**● ఈ రీమేక్ ఆలోచన మీకు వచ్చిందా?**

'అర్జున్‌రెడ్డి'ని ఒకరు చూపించారు. చాలా బాగుందనిపించింది. అయితే మనం చేసి ఇప్పుడు స్పాయిల్ చేయడం ఎందుకు అనుకున్నా. కానీ ఎప్పుడైతే సందీప్‌రెడ్డి హిందీ రీమేక్ పట్ల ఇంట్రెస్ట్‌గా ఉన్నారని తెలిసిందో అప్పుడు చేయాలనిపించింది. అతని వర్క్ బాగా నచ్చింది. ఓ మంచి సినిమాని ఎక్కువమంది చూడాలని కోరుకునే మనస్తత్వం నాది. ఈ సినిమాను హిందీ ఆడియన్స్ నా వల్ల చూస్తారు అన్నప్పుడు నాకు హ్యాపీగా అనిపించింది.

**● 'కబీర్‌సింగ్' ట్రైలర్‌ని ప్రభాస్ ప్రశంసించారు..**

నాకు, ప్రభాస్‌కు హకీమ్ హెయిర్ స్టైలిష్‌గా ఉన్నారు. ప్రభాస్ గురించి చాలా విన్నాను. సో కైండ్. ట్రైలర్‌ని అభినందిస్తూ ప్రభాస్ నాతో మాట్లాడారు. తనతో మాట్లాడటం అదే ఫస్ట్ టైమ్.

**● అర్జున్‌రెడ్డి, కబీర్‌సింగ్‌లకు పోలికలు పెడతారు. ఆ విషయం గురించి ఏమంటారు?**

పోలిక పెట్టకూడదు. ఎందుకంటే ఒకటి బాగుందంటే అది ఎప్పటికీ బాగున్నట్లే. దానికి ఆ గౌరవం ఇవ్వాలి. 'అర్జున్ రెడ్డి' బాగుంది. అలాంటప్పుడు 'కబీర్‌సింగ్'తో పోలిక పెట్టడం దేనికి? అర్జున్‌రెడ్డి నాకూ నచ్చింది. ఇప్పుడు 'కబీర్..'ని ప్రేక్షకులు కొత్త సినిమా అనుకుని చూడాలి.

**● 'ఉడ్తా పంజాబ్, కబీర్‌సింగ్, కమీనే'.. ఇలా డార్క్ రోల్స్ ఎక్కువగా చేస్తున్నట్లున్నారు?**

డార్క్, లైట్ అని కాదు భిన్నమైన పాత్రలు చేయడానికి నేను ఇష్టపడతాను. కానీ అవుటాఫ్ ది బాక్స్ కంటెంట్ ఉన్న సినిమాలు చేసి ఆడియన్స్‌ని సర్‌ప్రైజ్ చేయడంలో ఉన్న ఫీల్‌ని ఎంజాయ్ చేయడానికి డిఫరెంట్ రోల్స్ చేయాలనుకుంటాను.

**● 'కబీర్ సింగ్'లో రొమాంటిక్ సీన్స్ ఎక్కువ. మరి మీ ఆవిడ మీరా దగ్గర పర్మిషన్ తీసుకున్నారా?**

నిజానికి 'అర్జున్‌రెడ్డి' సినిమా తనకు నచ్చింది. ఈ పాత్ర నీ కెరీర్‌కు ప్లస్ అవుతుందని తనే చెప్పింది. ఈ వృత్తిలో ఉన్న విషయాలను అర్థం చేసుకునే పరిణితి తనకు ఉంది.

**'కబీర్‌సింగ్' లవ్‌లో ఫెయిలై, ఫైనల్లీ ప్రేమికురాలిని దక్కించుకుంటాడు. రియల్ లైఫ్‌లో మీకూ లవ్ ఫెయిల్యూర్స్ ఉన్నాయి కదా?**

అందరి జీవితాల్లో ఉన్నట్లే నా లైఫ్‌లోనూ కొన్ని లవ్ ఫేజెస్ ఉన్నాయి. అది కామన్ (నవ్వుతూ).

**కియారా అద్వానీ మాట్లాడుతూ - ''హిందీ రీమేక్ ఒప్పుకోక ముందు 'అర్జున్ రెడ్డి' సినిమా చూశాను. సైన్ చేశాక మాత్రం చూడలేదు. ఎందుకంటే ఆ ప్రభావం నా నటన మీద పడే అవకాశం ఉంది. క్యారెక్టర్‌ని నా స్టైల్‌లో నేను చేయాలనుకున్నాను. కథానుగుణంగానే ఈ సినిమాలో రొమాంటిక్ సీన్స్ ఉంటాయి. ఇప్పుడు ప్రేమికులను తీసుకుందాం. వాళ్ల మధ్యమాటలతో పాటు రొమాన్స్ కూడా ఉంటుంది కదా. సినిమాలో షాహిద్, నేను ప్రేమికులం కాబట్టి మా మధ్య రొమాన్స్ ఉంటుంది. అవి లేకుండా ప్రేమ ఉండదు. షాహిద్ కపూర్ నటించిన కొన్ని సినిమాలు నేను చూశాను. అన్నింటికన్నా 'కబీర్ సింగ్'లో 'ది బెస్ట్ పర్ఫార్మెన్స్' ఇచ్చాడు. ఓ 25, 30 సినిమాలు చేశాక కాలేజీ సబ్జెక్ట్ చేయడం అంటే చిన్న విషయం కాదు. కొత్త హీరో అనిపించేలా చేశాడు. సందీప్ రెడ్డి అమేజింగ్ డైరెక్టర్ అనాలి. అసలు కథే వండర్‌ఫుల్ అంటే పాత్రలను ఆయన మలిచిన తీరూ అద్భుతమే.**


అదితి

# రాజ్‌తో అదితి?

**'స**మ్మోహనం, అంతరిక్షం' చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించారు అదితీరావ్ హైదరీ. ప్రస్తుతం ఆమె 'వి' సినిమాలో నటిస్తున్నారు. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సుధీర్‌బాబు, నాని హీరోలు. ఈ సినిమా చిత్రీకరణలో ఉండగానే మరో తెలుగు సినిమాలో నటించే అవకాశం అదితీని వరించిందని టాలీవుడ్ టాక్. హీరో రాజ్‌తరుణ్‌కి జోడీగా ఆమె నటించనున్నారని ఫిల్మ్‌నగర్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. రాజ్ తరుణ్ ప్రస్తుతం జి.ఆర్. కృష్ణ దర్శకత్వంలో 'దిల్' రాజు బ్యానర్‌లో 'ఇద్దరి లోకం ఒకటే' సినిమా చేస్తున్నారు. ఈ సినిమా తర్వాత 'గుండెజారి గల్లంతయ్యిందే' ఫేమ్ విజయ్ కుమార్ కొండా దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారట. తాను రాసుకున్న కథకు అదితి అయితేనే న్యాయం చేస్తుందని భావించిన దర్శకుడు, ఆమెతో సంప్రదింపులు జరిపారట. మరి.. అదితీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారా? వెయిట్ అండ్ సీ.


రాజ్ తరుణ్

# ఒకే జానర్‌లో సినిమాలు తీస్తున్నారు

– తమ్మారెడ్డి భరద్వాజ


కరుణకుమార్, ప్రసాద్, తమ్మారెడ్డి భరద్వాజ, మారుతి, రక్షిత్, నక్షత్ర

''**ముం**బైలో మాఫియా ఒకలా, విజయవాడలో మరోలా ఉంటుంది. ప్రతి ఊరిలో ఒక్కోటి ఒక్కోలా ఉంటుంది. అది ఎలా ఉంటుందన్నది 'పలాస'లో కొత్తగా ఉంటుంది'' అని తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. రక్షిత్, నక్షత్ర జంటగా కరుణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పలాస 1978'. తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో ధ్యాన్ అట్లూరి నిర్మించారు. రక్షిత్ బర్త్‌డే సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని దర్శకుడు మారుతి, తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి మాట్లాడుతూ– ''ఒకప్పుడు ప్రతిదర్శకుడు ఒక్కో జానర్‌లో సినిమాలు తీసేవారు. కానీ ఇప్పుడు అందరూ ఒకే జానర్‌లో సినిమాలు తీస్తున్నారు. 'కేరాఫ్ కంచరపాలెం' లుక్‌లో కొత్త సబ్జెక్ట్‌తో తీసిన 'పలాస' ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది'' అన్నారు. మారుతి మాట్లాడుతూ– ''ఫస్ట్ లుక్ పోస్టర్, హీరో లుక్ బాగున్నాయి. తమ్మారెడ్డిగారు ఇలాంటి సినిమాలకు అండగా నిలబడటం హ్యాపీ'' అన్నారు. ''తెలుగు కథ వైజాగ్ దాటి ముందుకుపోలేదు. పలాస ప్రాంతం నేపథ్యంలో రాసుకున్న ఈ కథను ప్రసాద్, తమ్మారెడ్డిలకు చెప్పాను. వాళ్లు ముందుకు రావడంతోనే సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురాగలుగుతున్నాను. 40 యేళ్లపాటు సాగే కథను 40 రోజుల్లో తీయడం మా టీమ్ సహకారం వల్లే సాధ్యం అయింది'' అన్నారు కరుణకుమార్. ''ఇందులో క్రూరమైన పాత్ర చేశాను'' అన్నారు చిత్ర సంగీతదర్శకుడు రఘు కుంచె. ''రెండు నెలల పాటు పలాసలో షూటింగ్ చేశాం. 'గాంగ్స్ ఆఫ్ వస్సీపూర్' లాంటి సినిమాను ప్రేక్షకులకు ఇవ్వబోతున్నాం'' అన్నారు రక్షిత్. నక్షత్ర, రచయిత నాగేంద్ర, కెమెరామెన్ విన్సెంట్ అరుల్, వెంకట సిద్దారెడ్డి మాట్లాడారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: ఎ.ఆర్ బెల్లన్న.


ఎలక్సియస్, తనిష్క్ రెడ్డి

# ఏం జరుగుతుంది?

**త**నిష్క్‌రెడ్డి, ఎలక్సియస్ జంటగా రామకృష్ణ వెంప దర్శకత్వం వహించిన చిత్రం 'దర్పణం'. శ్రీనంద ఆర్ట్స్ పతాకంపై క్రాంతి కిరణ్ వెల్లంకి నిర్మించిన ఈ సినిమా జూలైలో విడుదల కానుంది. ఈ సందర్భంగా రామకృష్ణ వెంప మాట్లాడుతూ– ''క్రైమ్, సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో వస్తోన్న చిత్రమిది. ఔట్‌పుట్ చాలా బాగా వచ్చింది. తర్వాత ఏం జరుగుతుంది? అనే సస్పెన్స్‌ని చివరి నిమిషం వరకూ క్రియేట్ చేస్తూ ఆద్యంతం అలరిస్తుంది. నటీనటులు, క్రాంతి కిరణ్‌గారి సహకారం మరచిపోలేనిది'' అన్నారు. ''ఇప్పటి వరకూ వచ్చిన థ్రిల్లర్ సినిమాలను మించి మా సినిమా ఉంటుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన వచ్చింది. చాలా కష్టపడి, ఇష్టపడి చేసిన చిత్రమిది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని, సెన్సార్ పనుల్లో ఉంది. మా చిత్రానికి అందరి సహకారం కావాలి'' అని క్రాంతి కిరణ్ వెల్లంకి అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సంగీతం: సిద్ధార్థ్, సదాశివుని.

# కథలో పవర్ ఉంది


ఆర్. రాజ్

''**ఒ**క సినిమా గురించి మాట్లాడుకోవాలంటే ఆ సినిమాకు స్టార్ ప్రొడ్యూసరైనా, స్టార్ డైరెక్టరైనా లేదా స్టార్ హీరో అయినా ఉండాలి. ఇవేవీ లేకపోయినా కథలో ఉన్న పవర్ వల్లే 'మల్లేశం' సినిమా గురించి అందరూ చర్చించుకుంటున్నారు'' అని దర్శక–నిర్మాత ఆర్. రాజ్ అన్నారు. పద్మశ్రీ అవార్డుగ్రహీత చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా ఆర్. రాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మల్లేశం'. నటుడు ప్రియదర్శి 'మల్లేశం' పాత్రలో నటించారు. శ్రీ అధికారి, రాజ్. ఆర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఆర్. రాజ్ మాట్లాడుతూ – ''సినిమాలపై ఆసక్తితో పదకొండేళ్ల క్రితం తమిళంలో 'సిల నేరంగళిల్' అనే సినిమాను నిర్మించా. మళ్లీ ఇప్పుడు 'మల్లేశం' సినిమాకు దర్శక–నిర్మాతగా వ్యవహరించాను. రెండున్నరేళ్ల క్రితం 'మల్లేశం'గారి టెక్ టాక్ వీడియోను చూసి ఇన్‌స్పైర్ అయ్యి. సినిమాగా తీయాలనుకున్నాను. ఈ సినిమా ఎవరూ చూడరు అని కొందరు అభిప్రాయపడ్డారు. అందుకే నేనే నిర్మించాలనుకున్నాను. ఆ తర్వాత కథ కోసం నాలుగు వెర్షన్స్ రెడీ అయ్యాయి. చివరికి నా కథ మల్లేశంగారికి నచ్చడంతో ఈ సినిమాకు కథ కూడా నాదే అయ్యింది. ఒకదశలో ఈ సినిమాకు తరుణ్ భాస్కర్‌ను దర్శకుడిగా అనుకున్నమాట వాస్తవమే. కానీ నా విజన్ వేరుగా ఉంటుంది కదా అని నేనే చేద్దామనుకున్నా. ఇలా ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే, డైరెక్షన్, నిర్మాతగా చేశాను.

● మల్లేశంగారి పాత్రలో నాని, శర్వానంద్ ఇలా కొందరిని ఊహించుకున్నాను. కానీ వారి డేట్స్ దొరకవని అర్థమైంది. ఆ తర్వాత ప్రియదర్శిని తీసుకున్నాం. చాలా బాగా చేశాడు. నిజానికి ప్రియదర్శినిలో మంచి యాక్టింగ్ షేడ్స్ ఉన్నాయి. ఇక అనన్యను నేను అసలు హీరోయిన్‌గా అనుకోలేదు. కాకపోతే ఆ అమ్మాయి ఇన్ఫోసిస్‌లో జాబ్ మానేసి వచ్చి, ఈ రోల్ కోసం ప్రిపేర్ అవుతాను అని చెప్పింది. పద్మ పాత్రలో అనన్య బాగా చేసింది. ఝాన్సీ బాగా నటించారు.

● అక్షయ్ కుమార్ 'ప్యాడ్‌మ్యాన్' (తమిళనాడుకు చెందిన అరుణాచలం మురుగనాథన్ బయోపిక్) సినిమా రిలీజ్ టైమ్‌లో కాస్త టెన్షన్ పడ్డాను. 'ప్యాడ్‌మ్యాన్, మల్లేశం' ఈ రెండు సినిమాల్లోని హీరోల జర్నీ ఒకేలా ఉంటుంది కదా అనుకుని 'మల్లేశం' కథను రాయడం మానేశాను. ఆ తర్వాత 'ప్యాడ్‌మన్' సినిమా చూసి నా విజన్ వేరుగా ఉంది కదా అని మళ్లీ సినిమాను స్టార్ట్ చేశాను. ఈ సినిమాను మల్లేశంగారు చూశారు. అక్కడక్కడ కాస్త సినిమాటిక్ లిబర్టీ తీసుకున్నాం. సినిమా చూసినప్పుడు ఆయన కూతురు కన్నీరు పెట్టుకున్నారు.

● నా సినిమాలోని నటీనటుల గౌరవానికి నా వంతు బాధ్యత వహించాలనుకుంటాను. అందుకే కాంట్రాక్ట్‌లో సెక్సువల్ హెరాస్‌మెంట్ గురించి స్ట్రిక్ట్ రూల్స్ పెట్టాను. ఎవరి కారణంగా అయినా హీరోయిన్ సినిమా నుంచి తప్పుకున్నట్లయితే.. ఆ హీరోయిన్‌కి ఇచ్చిన రెమ్యునరేషన్, కొత్త హీరోయిన్ ఖర్చులను సదరు వ్యక్తే భరించాలనేది ఆ నిబంధనల్లో ఒకటి.

## ప్రతి సీన్‌లో మెసేజ్


శైలజ, సమీర్

**స**మీర్‌ఖాన్, శైలజ హీరో హీరోయిన్లుగా షేర్ దర్శకత్వంలో వెంకట్‌రెడ్డి నిర్మించిన సినిమా 'కేవస్ 100'. ఈ చిత్రం జూలై 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా షేర్ మాట్లాడుతూ – ''కంప్లీట్ ఫ్యామిలీ మూవీ. ప్రతి సీన్‌లో ఒక మెసేజ్ ఉంది. ఆల్రెడీ రిలీజ్ చేసిన సాంగ్స్, ట్రైలర్‌తో సినిమాకు మంచి క్రేజ్ వచ్చింది'' అన్నారు. ''సోషల్ మీడియాలో మా సినిమా రిలీజ్ ఎప్పుడు? అని అడుగుతున్నారు. మా సినిమా కోసం ఎదురు చూస్తున్న వారందరికీ థ్యాంక్స్. వచ్చే నెల 5న విడుదల చేస్తున్నాం'' అన్నారు సమీర్. ''దాదాపు 500ల థియేటర్స్‌లో ఈ సినిమాను విడుదల చేయబోతున్నాం. మంచి మెసేజ్ ఉన్న సినిమా తీశారు షేర్. మేకింగ్‌కి ఎంత కష్టపడ్డాడో..రిలీజ్‌కి అంతే కష్టపడ్డాడు'' అన్నారు నిర్మాత వెంకట్‌రెడ్డి అన్నారు.




సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ బుధవారం
19-6-2019

**సీరియల్**

**కేరళలో పుట్టి, చెన్నైలో పెరిగిన ఆయేషా... నందినిగా తెలుగువారికి సుపరిచితమే. 'స్టార్ మా'టీవీలో ప్రసారమవుతున్న 'సావిత్రమ్మగారి అబ్బాయి' సీరియల్ ద్వారా 'మా అమ్మాయే' అని తెలుగునోట ప్రశంసలు అందుకుంటున్న ఆయేషా చెబుతున్న ముచ్చట్లివి.**



# ఏడేళ్లుగా ఇదే ఫిట్‌నెస్‌తో ఉన్నా!

"నన్ను తెలుగు ప్రేక్షకులు 'మా అమ్మాయే' అనుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. 'సావిత్రమ్మగారి అబ్బాయి' సీరియల్ బాగా పల్లె వాతావరణంతో ముడిపడి ఉంటుంది. బాలరాజు – నందినిల జోడీ చూడముచ్చటగా ఉందని అందరూ అంటున్నారు. అలాంటి ఫ్యామిలీ రియల్ లైఫ్‌లో దొరికితే సూపర్ హ్యాపీ (నవ్వుతూ). ఈ సీరియల్ చూస్తూ మా అమ్మ నాకు చెన్నై నుంచి ఫోన్ చేస్తారు 'ఈ సన్నివేశంలో బాగా యాక్ట్ చేశావ్, ఇప్పుడు మీ అత్తగారు ఎలా ఉన్నారు?' అంటూ ఫన్నీగా మాట్లాడతారు. ఏవైనా సజెషన్స్ ఉంటే చెబుతారు. ఇప్పుడు రోజులు చాలా సరదాగా జరిగిపోతున్నాయి.



ఆయేషా

### ఒప్పించడం చాలా కష్టం

మా అమ్మానాన్న ముందు నేను 'యాక్టింగ్' అంటే మరో మాట లేకుండా 'నో' అన్నారు. ఇంట్లో అంతా 'నాట్ గుడ్' అన్నారు. అందరినీ ఒప్పించడానికి నాకు బాగానే టైమ్ పట్టింది. చివరికి ఇక నా ఆసక్తి గమనించి 'ఓకే' చేశారు. ఇప్పుడు అమ్మ, నాన్న చాలా హ్యాపీ. మా రిలేటివ్స్ కూడా ఇప్పుడు నా సీరియల్స్ చూసి ఎంజాయ్ చేస్తుంటారు. ఏ ఎపిసోడ్‌లో బాగున్నాను, ఎలా యాక్ట్ చేస్తున్నాను.. అనే విషయాలు నాకు ఫోన్ ద్వారానో, కలిసినప్పుడో చెబుతారు.

### తెలిసిన వారి ద్వారా!

చదువుకునే రోజుల్లో నుంచే యాక్టింగ్ అంటే బాగా ఇష్టం. నాకు ఓ తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. నాన్న బిజినెస్ మ్యాన్. అమ్మ గృహిణి. చెన్నైలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. నాకు ప్రొడక్షన్ టీమ్స్ ద్వారా సీరియల్ ఆఫర్స్ వచ్చాయి. ముందు తమిళ్‌లో మూడు సీరియల్స్ చేశాను. ఇప్పుడు తెలుగులో 'సావిత్రమ్మగారి అబ్బాయి' సీరియల్ చేస్తున్నాను. తమిళ్‌లో కూడా 'సత్య' అనే సీరియల్ చేస్తున్నాను. అంతకుముందు ఓ తమిళ్ సినిమాలోనూ నటించాను.

### కలర్‌ఫుల్ లైఫ్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు.. రోజంతా వర్క్ అంటే నాకు ఇష్టం లేదు. లైఫ్ కలర్‌ఫుల్‌గా, ఎంజాయ్‌గా గడిచిపోవాలని కోరుకుంటాను. నాక్కాబోయే భర్త కూడా అలాగే ఉండాలని కోరుకుంటాను. నేను పూర్తిగా నాన్‌వెజిటేరియన్. ఎలాంటి ఫిట్‌నెస్ జాగ్రత్తలు లేవు. ఏడేళ్లుగా ఇదే ఫిట్‌నెస్‌తో ఉన్నాను. బహుశా ఎక్కడా ఖాళీ లేకుండా, హ్యాపీగా ఉండటం వల్ల ఇప్పుడూ అలాగే ఉన్నాను. వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ ఈ లైఫ్‌ని ఇలా హ్యాపీగా గడిపేస్తే చాలనుకుంటున్నాను.''

### టైమ్ దొరికితే నిద్ర

చదువుకునే టైమ్‌లో పుస్తకాలు చదవడం, మ్యూజిక్ వినడం అంటే ఇష్టం ఉండేది. ఇప్పుడు అస్సలు ఖాళీ అస్సలు టైమ్ లేదు. కాస్త ఖాళీ టైమ్ దొరికితే చాలు నిద్రపోతాను. ఉదయం నుంచి సాయంత్రం వరకు నెలలో ఇరవై రోజులు వర్క్ ఉంటుంది.

– నిర్మలారెడ్డి

---

**● ఉడాన్**

# రెక్కల సివంగి

**డిగ్రీ చదివితే చాలు అని ఆడపిల్లల గురించి అనుకునే రోజుల్లో పోలీస్ ఆఫీసర్‌గా ఒక ఆడపిల్లను చూపించిన సీరియల్ 'ఉడాన్'. మగవాళ్ల వ్యవస్థలో స్త్రీ సగౌరవంగా తన ఉనికిని చాటుకోవచ్చు అని చెప్పిన కథ 'ఉడాన్'. పాటలు, ఏడుపుగొట్టు సన్నివేశాలు మాత్రమే హీరోయిన్‌కు దక్కే రోజుల్లో యువతుల ఆకాంక్షలకు రెక్కలు తొడిగి సాహస వనితలుగా ఉన్నతీకరించిన సంచలనం 'ఉడాన్'.**

సరిగ్గా ముప్పై ఏళ్ల క్రితం.. అప్పుడప్పుడే స్త్రీ చదువు, ఉద్యోగం అంటూ ఇంటి గడప దాటి తన జీవితానికి ఓ దిశా దశ ఏర్పరుచుకుంటున్న కాలం. ఆకాశంలో సగం కోసం పోరాటం కాదు నేలమీదే తన ఉన్నతికి పాటుపడుతున్న సమయం. అలాంటి సమయంలో వచ్చింది 'ఉడాన్' సీరియల్. భారతదేశంలో మొట్టమొదటిసారి దూరదర్శన్ 1989లో మహిళా సాధికారితను ఓ సీరియల్ ద్వారా పరిచయం చేయడం విశేషంగా చెప్పుకోవచ్చు. ఈ సీరియల్ ఒక మహిళా ఐపీఎస్ ఆఫీసర్ ఎదుర్కొనే ఒత్తిళ్లు, సంఘర్షణ, సవాళ్లను చూపించడమే ధ్యేయంగా నడిచింది.

'ఉడాన్' సీరియల్‌కి స్ఫూర్తి ఐపీఎస్ కాంచన్ చౌదరి భట్టాచార్య (మాజీ డీజీపీ). ఈమె ఇండియాలోనే మొట్టమొదటి మహిళా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ). కాంచన భట్టాచార్య తన వృత్తిలో చూపించిన నిబద్ధత, ఎదుర్కొన్న కష్టాలు సాధారణమైనవి కావు. ఈమె వాస్తవ కథే 'ఉడాన్' సీరియల్‌కి ప్రేరణ. కాంచన చౌదరి ఎవరో కాదు ఉడాన్ సీరియల్‌లో నటించిన కవితా చౌదరి అక్క. తన తోబుట్టువు సాహసం, కష్టాలు, ఎదుర్కొన్న ఒత్తిళ్లను చూసి, తెలుసుకున్న కవిత ఒక కథ రాసుకున్నారు. ఈ సీరియల్ దర్శకత్వ బాధ్యతలను తానే చేపట్టారు. అంతేకాదు, తన సోదరి నిజజీవితాన్ని హృద్యంగా చిత్రించి, బుల్లితెర ప్రేక్షకులను తన నటనతో మెప్పించారు కవిత.



కవితా చౌదరి



### ఇంటికి పెద్ద కొడుకులా!

ఉడాన్ సీరియల్‌లో ప్రధానపాత్రధారి పేరు కళ్యాణీ సింగ్. ఒకసారి కళ్యాణి తండ్రి విక్రమ్ గోఖలే అనే వ్యక్తి వల్ల తన భూమినంతా కోల్పోతాడు. ఊళ్లో తన పరువు అంతా పోయిందని, తమకో కొడుకు ఉంటే ఇలా జరిగేది కాదని తండ్రితోపాటు కుటుంబం అంతా బాధపడుతూ ఉంటుంది. ఆ సమయంలో కళ్యాణి తన తండ్రితో మహిళ ఏ విషయంలోనూ మగవాడికన్నా తక్కువ కాదని, సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో స్త్రీని ఉంచడమే తన లక్ష్యమని చెబుతుంది. తాను పోలీస్ అధికారినై కుటుంబానికి తిరిగి గౌరవాన్ని తీసుకువస్తానని ప్రతిజ్ఞ చేస్తుంది. అనుకున్నట్టుగానే పోలీస్ ఆఫీసరై తండ్రి కష్టాన్ని తీరుస్తుంది. అందరూ కళ్యాణీసింగ్ కుటుంబాన్ని గొప్పగా చూస్తుంటారు. ఏ లక్ష్యంతో అయితే ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో చేరుతుందో ఆ దిశగానే నిబద్ధతతో పనులు చేస్తుంటుంది కళ్యాణి. ఐపీఎస్ అధికారిగా ఆమె చేపట్టిన ఎన్నో ప్రజాప్రయోజన పనులు అందరినీ ఆకట్టుకుంటాయి.

### వివక్షపై పోరాటం

సమాజంలో లింగవివక్షపైనే కాకుండా రకరకాల సమస్యలపై పోరాడి గెలిచిన మహిళా పోలీస్ ఆఫీసర్‌ని ఈ షో చూపింది. పోలీస్ అంటే ప్రజల్లో ఉండాల్సింది భయం కాదు. ఒక స్నేహితుడిలా, తమను కాపాడే సంరక్షకుడిలా, పౌరులు గౌరవించే విధంగా ఉండాలని కోరుకుంటుంది కళ్యాణి. ఇదేవిధమైన సూచనలను పోలీసు అధికారులందరికీ ఇస్తుంది. ప్రతి పౌరుడు చట్టాన్ని ఏ విధంగా గౌరవిస్తున్నాడో గమనిస్తుంటుంది. సమాజ కంటకులుగా మారినవారిని ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా శిక్షిస్తుంది. పోలీసు వ్యవస్థలో జరిగే లోటుపాట్లను సరిదిద్దుతుంది. మహిళలు కష్టపడి పనిచేయడానికి, తమ సొంత కాళ్ల మీద నిలబడగల సామర్థ్యం సాధించడానికి, సమాజంలో గౌరవం పొందడానికి, ధైర్యాన్ని నింపుకోవడానికి స్ఫూర్తిగా నిలుస్తుంది.

గ్రేట్ ఇండియన్ సీరియల్స్-21

### ప్రజా పోలీసు

ప్రజాదర్బారులో ఒక వ్యక్తి తన అభ్యర్థనను ఐఎఎస్, జిల్లా జడ్జిముందు ఉంచుతాడు. అతి తక్కువ సమయంలో అతనికి తగిన న్యాయం జరిగేలా చూస్తారు ఆఫీసర్లు. అందుకు చొరవ చూపిన పోలీస్ అధికారి కళ్యాణిని అందరూ అభినందిస్తారు. ఆ సమయంలో ఆ వ్యక్తి ఆఫీసర్ల పాదాలు తాకి తన సంతోషాన్ని వ్యక్తం చేసే విధానం ప్రతి గుండెనూ కదిలిస్తుంది. అదే ఎపిసోడ్‌లో జిల్లా న్యాయవాది పీపీ రకరకాల బ్యూరోక్రటిక్ అడ్డంకులను ప్రదర్శించడానికి ప్రయత్నించినప్పుడు పోలీస్ అధికారిగా కళ్యాణీసింగ్ స్పందించిన విధానం ప్రజల్లోకి ఒక చిన్న సందేశాన్ని పంపినట్లుగా అవుతుంది. ఈ సందర్భంలో కళ్యాణీ సింగ్ 'మేం క్రమబద్ధమైన పద్ధతిలో పనిచేస్తాం. ప్రజలను నిరాశపరిచేలా, అడ్డంకులు సృష్టించే వారు ఎవరైనా సరే, వారిని క్షమించం' అంటూ అతడిని జైలుకు పంపిస్తుంది.

కళ్యాణీసింగ్ ఆదర్శాలు నచ్చిన ఐఎఎస్ ఆఫీసర్ శేఖర్ కపూర్ ఆమె మెప్పు సాధించడానికి, పెళ్లి చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు. ఏదైనా ఒక నిర్ణయం తీసుకునే ముందు, తన ఆదర్శాలను ఆ ఆలోచన సరైనదో కాదో జాగ్రత్తగా అంచనా వేసే కళ్యాణి అంటే శేఖర్ అభిమానం చూపుతుంటాడు.

సమాజంలో ప్రజలు అన్యాయానికి అడ్డుగా నిలబడే బలం ఉన్నప్పుడే న్యాయవ్యవస్థ కూడా సక్రమంగా పనిచేస్తుందని అప్పుడే నిజమైన ప్రయోజనం పొందవచ్చనే సందేశాన్ని ఎపిసోడ్ చివరలో దర్శకుడు చూపించడంతో సీరియల్ ముగుస్తుంది. చివరి సన్నివేశంలో కళ్యాణిసింగ్, ఆమె కుటుంబ సభ్యులు ప్రజలందరి మధ్య జరిగిన సమావేశానికి హాజరవడం, అందరూ కళ్యాణిని అభినందించడం, తర్వాత ఆమె తనకు కొత్తగా ఇచ్చిన పోస్టింగ్‌వైపు కదలడం చూపుతుంది. ఈ సమయంలో కళ్యాణిసింగ్ ఐపీఎస్ గురించి ఒక స్వరం ఆమె గొప్పతనం గురించి ప్రశంసిస్తుంది. మొత్తం ముప్పై ఎపిసోడ్లుగా వచ్చిన ఉడాన్ సీరియల్ నాటి తరం అమ్మాయిల్లో ధైర్యాన్ని, సాహసాన్ని పెంచింది. ఈ సీరియల్ వచ్చిన ఏడాదికే తెలుగులో విజయశాంతి పోలీసాఫీసర్‌గా నటించిన కర్తవ్యం సినిమా విడుదలైంది.

– ఎస్.ఆర్

**కవితా చౌదరి సర్ఫ్ డిటర్జెంట్ ప్రకటన ద్వారా నాడు చాలామందికి పరిచయమే. కవిత బాలీవుడ్ నటి, మోడల్ కూడా. దూరదర్శన్‌లో వచ్చిన ఉడాన్ సీరియల్‌లో ఐపీఎస్ ఆఫీసర్ కళ్యాణీసింగ్‌గా నటించింది. ఉడాన్ సీరియల్‌తో పాటు 'యువర్ ఆనర్, ఐపీఎస్ డైరీస్' అనే మరో రెండు టెలివిజన్ సీరిస్‌ను తీసింది కవిత.**

---

**నెఫ్రాలజీ కౌన్సెలింగ్**

**ఫ్యామిలీ డాక్టర్**



### ప్రయాణంలో కాళ్లవాపులు.. ఎందుకిలా?

**నా వయసు 52 ఏళ్లు. నాకు గత పన్నెండేళ్లుగా షుగర్ ఉంది. ఈమధ్య ఎక్కువగా ప్రయాణం చేసేటప్పుడు కాళ్ల వాపులు వస్తున్నాయి. నా రక్తపరీక్షలో క్రియాటినిన్ 10 ఎంజీ/డీఎల్, యూరియా 28 ఎంజీ/డీఎల్, ప్రోటీన్ మూడు ప్లస్ ఉన్నాయని చెప్పారు. నాకు షుగర్ వల్ల సమస్య వస్తోందా? తగిన సలహా ఇవ్వండి.**

– సి. నాగేశ్వరరావు, ఇల్లందు

మీ రిపోర్టులను బట్టి మీకు మూత్రంలో ప్రోటీన్ ఎక్కువగా పోతోంది. ఇది మీకు ఉన్న షుగర్ వ్యాధి వల్ల వచ్చిన కిడ్నీ సమస్యా (డయాబెటిక్ నెఫ్రోపతి) లేక మరేదైనా సమస్యతో ఇలా జరుగుతోందా అన్న విషయాన్ని ముందుగా తెలుసుకోవాలి. మీరు ఒకసారి కంటిడాక్టర్ దగ్గకు కూడా వెళ్లి రెటీనా పరీక్ష చేయించుకోవాలి. షుగర్ వల్ల రెటీనా దెబ్బతింటే (డయాబెటిక్ రెటినోపతి) అనే సమస్య వస్తుంది. మీ మూత్రంలో యూరియా ఎక్కువగా పోవడం కూడా షుగర్ వల్లనే అయి ఉంటుంది. ఈ సమస్య ఉన్నవాళ్లు భవిష్యత్తులో కిడ్నీ దెబ్బ తినకుండా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మొదటగా షుగర్ నియంత్రణలో ఉంచుకోవాలి. తినకముందు బ్లడ్ షుగర్ 100 ఎంజీ/డీఎల్, తిన్న తర్వాత 160 ఎంజీ/డీఎల్ ఉండేలా నియంత్రించుకోవాలి. బీపీ 125/75 ఎమ్ఎమ్‌హెచ్‌జీ ఉండేలా చూసుకోవాలి. మూత్రంలో ప్రోటీన్ పోవడం తగ్గించడం కోసం ఏసీఈ, ఏఆర్‌బీ అనే మందులు వాడాలి. రక్తంలో కొలెస్ట్రాల్ పాళ్లు 150 ఎంజీ/డీఎల్ లోపలే ఉండేలా జాగ్రత్తపడాలి. ఇవేకాకుండా ఉప్పు బాగా తగ్గించి వాడాలి. (రోజుకు రెండు గ్రాముల కంటే తక్కువే తీసుకోవాలి). పొగ తాగడం, ఆల్కహాల్ తీసుకోవడం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి. డాక్టర్ సూచించకుండా నొప్పి నివారణ మందులు వాడకూడదు.



### మూత్రంలో ఎరుపు కనిపిస్తోంది!

**నాకు 37 ఏళ్లు. అప్పుడప్పుడూ మూత్రం ఎర్రగా వస్తోంది. గత ఆరేళ్లుగా ఇలా జరుగుతోంది. రెండు మూడు రోజుల తర్వాత తగ్గిపోతోంది. నొప్పి ఏమీ లేదు. దాంతో మొదట పట్టించుకోలేదుగానీ... ఇటీవల మాత్రం ఆందోళన పెరిగింది. ఇలా రావడం వల్ల భవిష్యత్తులో ఏదైనా సమస్య వస్తుందా? కిడ్నీలు దెబ్బతినే అవకాశం ఉందా?**

– ఆర్. రామస్వామి, ఆమదాలవలస

మీరు చెప్పినట్లుగా మూత్రంలో రక్తం చాలాసార్లు పోతుంటే... ఎందువల్ల ఇలా జరుగుతోంది అనే విషయాన్ని తెలుసుకోవాలి. దానికి తగినట్లుగా చికిత్స తీసుకోవాలి. ఇలా మాటిమాటికీ మూత్రంలో రక్తస్రావం అవుతుండటానికి కిడ్నీలో రాళ్లు ఉండటం, ఇన్ఫెక్షన్ ఉండటం, కిడ్నీ సమస్య లేదా మరేదైనా కిడ్నీ సమస్య (గ్లోమెరూలో నెఫ్రైటిస్ వంటిది) ఉండవచ్చు. మీరు ఒకసారి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోండి. మూత్రపరీక్ష కూడా చేయించుకోవాలి. కిడ్నీలో రాళ్లుగానీ, ఇన్ఫెక్షన్ గానీ లేకుండా ఇలా రక్తం వస్తుంటే మూత్రంలో ప్రోటీన్ పోతుందేమోనని కూడా చూడాలి. కిడ్నీ ఫంక్షన్ టెస్ట్ కూడా చేయించుకోవాలి. ఒకవేళ రక్తంతో పాటు ప్రోటీన్ కూడా పోతుంటే కిడ్నీ బయాప్సీ కూడా చేయించుకోవాల్సి ఉంటుంది. కిడ్నీలు దెబ్బతినకుండా ఉండేందుకు మందులు వాడాల్సి ఉంటుంది.



### తరచు జ్వరం.. విసర్జన సమయంలో మంట!

**నా వయసు 41 ఏళ్లు. తరచుగా జ్వరం. మూత్రవిసర్జన సమయంలో చాలా మంటగా ఉంటోంది. ఇలా మాటిమాటికీ జ్వరం, మూత్రంలో మంట రాకుండా ఉండేందుకు తగిన సలహా ఇవ్వండి.**

– సువర్చల, కొత్తగూడెం

మీరు చెప్పిన లక్షణాలను బట్టి మీరు 'రికరెంట్ యూరిన్ ఇన్ఫెక్షన్'తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ముందుగా మీకు మాటిమాటికీ మూత్రంలో ఇన్ఫెక్షన్ వస్తున్న కారణం ఏమిటన్నది తెలుసుకోవాలి. మీకు షుగర్ ఉంటే కూడా ఇలా మాటిమాటికీ యూరిన్ ఇన్ఫెక్షన్ రావచ్చు. ఒకసారి మీరు షుగర్ టెస్ట్ చేయించుకోండి. అలాగే అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకొని మూత్రవిసర్జన వ్యవస్థలో ఎక్కడైనా రాళ్లుగానీ, మూత్రనాళాల్లో వాపుగానీ ఉన్నాయేమో చూడాలి. మీకు డాక్టర్ ఇచ్చిన యాంటీబయాటిక్ పూర్తి కోర్సు వాడకుండా ఉన్నా కూడా మళ్లీ మళ్లీ ఇన్ఫెక్షన్స్ తిరగబెట్టవచ్చు. మీకు ఏ కారణం లేకుండా ఇన్ఫెక్షన్ వస్తుంటే కనీసం మూడు నెలల పాటు యాంటీబయాటిక్స్ వాడాలి. రోజూ నీళ్లు ఎక్కువగా (అంటే రెండు నుంచి మూడు లీటర్లు) తాగాలి. మూత్రం వచ్చినప్పుడు ఎక్కువసేపు ఆపుకోకుండా, వెంటనే మూత్రవిసర్జనకు వెళ్లాలి.



**డాక్టర్ విక్రాంత్‌రెడ్డి,** కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్

---

**పరి పరిశోధన**

## బరువులెత్తితే.. మధుమేహ నియంత్రణ!



మధుమేహంతో బాధపడుతున్న ఊబకాయులకు వెయిట్ ట్రెయినింగ్, శక్తినిచ్చే వ్యాయామాలు రెండూ ఎంతో ఉపయోగపడతాయని అంటున్నారు బ్రెజిల్ శాస్త్రవేత్తలు. నడక లాంటి వ్యాయామాలే మధుమేహానికి చాలనుకుంటున్న తరుణంలో కంపినాస్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు ఈ కొత్త విషయాన్ని చెప్పడం గమనార్హం. ఊబకాయులు పైన చెప్పిన రెండు పనులు చేస్తే వారి కాలేయాల్లో పేరుకున్న కొవ్వు గణనీయంగా తగ్గిపోతుందని, తద్వారా రక్తంలోని చక్కెర మోతాదులు నియంత్రణలోకి వస్తాయని వీరు అంటున్నారు. ఎలుకలపై తాము జరిపిన ప్రయోగాల్లో రెండువారాలపాటు బరువులెత్తడం, శక్తినిచ్చే వ్యాయామాలు చేయడం ద్వారా కాలేయ కణజాలంలోని జన్యువుల్లో మార్పులు వచ్చాయని, ఫలితంగా అక్కడి కొవ్వులు వేగంగా కరగడం మొదలైందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త లియాండ్రో పెరీరా తెలిపారు. ఇదంతా ఎలా జరుగుతోందో అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, వ్యాయామం కారణంగా నిర్దిష్ట ప్రొటీన్ల ఉత్పత్తిలో హెచ్చుతగ్గులను గుర్తిస్తే వాటిని కృత్రిమంగా తయారు చేయవచ్చునని లియాండ్రో ఆశాభావం వ్యక్తం చేశారు. కాలేయంలో ఎక్కువ కొవ్వు ఉన్నప్పుడు స్థానికంగా మంట/వాపు లాంటివి వస్తాయని, ఫలితంగా కాలేయంలోని కణాలు ఇన్సులిన్‌పై ప్రభావం చూపే స్థితిని కోల్పోతాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో నిరాహారంగా మాత్రమే ఉన్నప్పుడు విడుదల కావాల్సిన గ్లూకోజ్ రక్తంలోనికి చేరిపోతుందని వివరించారు.

## దానిమ్మలోని పదార్థంతో దీర్ఘాయుష్షు!



దీర్ఘాయుష్షుకు ఉపయోగపడుతుందని భావిస్తున్న 'యురోలిథిన్ ఏ' అనే పదార్థాన్ని మనుషుల్లోనూ విజయవంతంగా పరీక్షించారు శాస్త్రవేత్తలు దానిమ్మలో కనిపించే ఈ యురోలిథిన్ ఏ ఇప్పటికే కొన్ని రకాల పురుగులు, ఎలుకల ఆయుష్షును గణనీయంగా పెంచింది. స్విట్జర్లాండ్‌లోని ఈపీఎఫ్‌ఎల్ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనల ద్వారా ఈ విషయం స్పష్టమైంది. యురోలిథిన్ ఏ కణాల్లోని మైటోకాండ్రియా పనితీరును మెరుగుపరచడం ద్వారా వద్ధాప్యంతో వచ్చే సమస్యలను నివారిస్తుందని అంచనా. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. ఈ పదార్థం మనకు తెలిసిన ఏ ఆహారంలోనూ ఉండదు. కాకపోతే దానిమ్మ, రాస్ప్‌బెర్రీ వంటి పండ్లలోని కొన్ని రసాయనాలు మన పేగుల్లో యురోలిథిన్ ఏగా విడిపోతాయి. ఈపీఎఫ్‌ఎల్ శాస్త్రవేత్తలు ఈ యురోలిథిన్ ఏ ను కత్రిమంగా తయారు చేసి ప్రయోగాలు చేశారు. వేర్వేరు మోతాదుల్లో 60 మందికి అందించారు. వీరందరూ ఆరోగ్యంగా ఉన్నవారే. కాకపోతే వ్యాయామాలు వంటివి పెద్దగా చేయనివారు. వీరికి వేర్వేరు మోతాదుల్లో యురోలిథిన్ ఏను అందించారు. 500 నుంచి వెయ్యి మిల్లీగ్రాములు ఇచ్చినప్పుడు మైటోకాండ్రియా పనితీరులో మార్పు కనిపించిందని వ్యాయామం చేస్తే ఎలాంటి వచ్చే ఫలితాలు ఈ మందు ద్వారా వచ్చాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త జొహాన్ అవురెక్స్ తెలిపారు.

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
బుధవారం
19-6-2019




**ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్.. సంక్షిప్తంగా ఐవోటీ. ఇప్పుడు ఎక్కడ విన్నా.. ఐవోటీ మాటే వినిపిస్తోంది. రిటైల్ నుంచి మాన్యుఫ్యాక్చరింగ్ వరకు.. అన్ని రంగాల్లోని సంస్థలు 'ఐవోటీ' బాటపడుతున్నాయనే వార్తలు! రానున్న రోజుల్లో ప్రతి పరికరం మరో ఉపకరణంతో కనెక్ట్ అవడం ఖాయమంటున్నారు నిపుణులు. ఇలా 'ఐవోటీ' దూసుకొస్తుండటంతో లక్షల కొలువులు అందుబాటులోకి రానున్నాయన్నది తాజా అంచనా! దాంతో 'ఐవోటీ ' ఉద్యోగాలు దక్కించుకోవడానికి విద్యార్థులు సిద్ధం కావాలని నిపుణులు సూచిస్తున్నారు!! ఈ నేపథ్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ద్వారా లభించే కొలువులు, అవసరమైన అర్హతలు, ఏ విభాగం విద్యార్థులకు అనుకూలం తదితర అంశాలపై విశ్లేషణ...**

# ఐవోటీ తేనుందా కొత్త కొలువులు..

- అన్ని రంగాల్లోకి దూసుకొస్తున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ)
- మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం
- ఐవోటీలో రెండేళ్లలో నాలుగు లక్షల కొత్త కొలువులొస్తాయని అంచనా

### ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అంటే

అసలు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అంటే ఏమిటి? వాస్తవానికి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి ఇంటర్నెట్, రెండోది థింగ్స్ అంటే.. పరికరాలు/ఉపకరణాలు. ఇంటర్నెట్‌తో కనెక్ట్ అయిన పరికరాల సముదాయమే.. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్. ఇలా ఇంటర్నెట్‌తో అనుసంధానమైన పరికరాల మధ్య సమాచారం/డేటా ప్రసరణ జరుగుతుంది. ఎక్కడో ఉండి ఇంటర్నెట్ ఆధారంగా ఒక కమాండ్ ఇస్తే దానికి అనుగుణంగా ఒక ఉపకరణం పనిచేసేలా చూసే టెక్నాలజీ.. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్. ఇది ఒకరకంగా మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్. మొత్తం ఐవోటీ ప్రక్రియలో ఇంటర్నెట్ వెన్నుముక లాంటిది. ఐవోటీ సహాయంతో ఇప్పుడు మనం వినియోగిస్తున్న స్మార్ట్ ఫోన్‌నే సాధనంగా చేసుకొని.. ఒక చిన్న కమాండ్‌తో ఇంట్లోని ఏసీని సెట్ చేయొచ్చు. కారులోని సెన్సర్ సర్క్యూట్స్‌కు కమాండ్ ఇవ్వడం ద్వారా ఎలాంటి రద్దీ లేని మార్గాల ద్వారా సరైన సమయానికి గమ్యం చేరుకోవడం వంటివి ఇటీవల కాలంలో కార్యరూపంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అన్ని రంగాలకు విస్తరిస్తున్న నేపథ్యంలో సంబంధిత నైపుణ్యాలున్న మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోంది. అందుకే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ రానున్న రోజుల్లో యువతకు కొలువుల వరంగా మారనుందని పలు సర్వే సంస్థలు అంచనా వేస్తున్నాయి.

### విస్తృతంగా వినియోగంలోకి

ఐవోటీ ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ విస్తృతంగా వినియోగంలోకి వస్తోంది. ఐవోటీ ద్వారా వినియోగదారులకు సులువుగా, వేగంగా సేవలందించే అవకాశముంది. దాంతో రిటైల్, హెల్త్‌కేర్, ఆటోమోటివ్స్, ఎలక్ట్రానిక్ అప్లయెన్సెస్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లోని సంస్థలు ఐవోటీకి ప్రాధాన్యమిస్తున్నాయి. నిజానికి ఈ టెక్నాలజీ మూడు నాలుగేళ్ల క్రితమే వెలుగులోకి వచ్చింది. కార్యాచరణ పరంగా గత రెండేళ్లుగా బాగా విస్తరిస్తోంది. ప్రధానంగా ఆటోమొబైల్, మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల్లో ఐవోటీ ప్రమేయం ఎక్కువగా కనిపిస్తోంది. మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల్లో వస్తువు తయారీ క్రమంలో మానవ ప్రమేయం లేకుండా.. మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్ ద్వారా వేగంగా ప్రక్రియ పూర్తయ్యేలా చూస్తున్నారు.

### ఇండస్ట్రియల్ ఐవోటీ

ఇటీవల కాలంలో ఇండస్ట్రియల్ ఐవోటీ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. పారిశ్రామిక సంస్థల్లో ఒక ఉత్పత్తిని తయారుచేసే క్రమంలో అన్ని విభాగాలను ఇంటర్నెట్, సెన్సర్ల ద్వారా అనుసంధానం చేయడమే ఇండస్ట్రియల్ ఐవోటీ. సదరు ప్రొడక్ట్‌ను రూపొందించేందుకు అవసరమైన బిగ్ డేటా, అనలిటికల్ టూల్స్, వైర్‌లెస్ నెట్‌వర్క్స్‌ను అనుసంధానం చేయడం ఇక్కడ కీలకం. ఒక ఉత్పత్తికి సంబంధించిన సమస్యల గుర్తింపు, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యల పరంగా వినియోగదారులకు సూచనలు ఇవ్వడం కూడా ఇండస్ట్రియల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కోవకే వస్తుంది. ఉదాహరణకు ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ క్యాటర్‌పిల్లర్ 'క్యాట్' పేరుతో ఐఓటీ టూల్‌ను మార్కెట్లోకి తెచ్చింది. మొబైల్ యాప్ సర్వీసెస్ ద్వారా వినియోగదారులకు, లేదా టెక్నీషియన్లకు ప్రాబ్లమ్ సాల్వింగ్ సలహాలు ఇవ్వడమే దీని ఉద్దేశం. మన దేశంలో ప్రముఖ ఆటోమోటివ్ సంస్థ మారుతి సుజికి తన నెక్సా కార్లలో సుజికి కనెక్ట్ పేరుతో వెహికిల్ మెయింటనెన్స్, ఇంధన పొదుపు, సేఫ్ డ్రైవింగ్ తదితర అంశాలు తెలియజేసే పరికరాన్ని రూపొందించింది. ఇలా ఇప్పుడు అన్ని రంగాల్లోనూ ఐవోటీ తప్పనిసరిగా మారుతోంది.

### మానవ ప్రమేయం తప్పనిసరి




ఐవోటీ విస్తరణ, అమల్లో కోడింగ్, ప్రోగ్రామింగ్, డేటా అనలిటిక్స్, అప్లికేషన్ డిజైన్, హార్డ్‌వేర్ నెట్ వర్కింగ్ విభాగాలు కీలకంగా మారుతున్నాయి. ఎందుకంటే... ఆటోమేటిక్‌గా ఏదైనా ఒక ఉపకరణం పని చేయాలంటే.. ముందుగా సదరు ఉపకరణం విధులను గుర్తించి దానికి అనుగుణంగా ప్రోగ్రామింగ్, అప్లికేషన్ డిజైన్ చేయాల్సి ఉంటుంది. డేటాఅనలిటిక్స్ పరంగా క్రమరీతిలో లేని(అన్ స్ట్రక్చర్) డేటాను నిర్దిష్టంగా ఒక క్రమ పద్ధతి(స్ట్రక్చర్డ్) డేటాగా మార్చాల్సి ఉంటుంది. అందుకు ఆయా నైపుణ్యాలున్న మానవ వనరుల అవసరం ఏర్పడుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే వచ్చే రెండేళ్లలో దాదాపు నాలుగు లక్షల కొలువులు ఐవోటీ విభాగాల్లో లభిస్తాయనే అంచనాలు, నివేదికలు వెలువడుతున్నాయి.

### సీఎస్ఈ, ఈసీఈ విద్యార్థులకు అనుకూలం

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వాటికి కార్యరూపం ఇచ్చే విధానాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులకు విస్తృత అవకాశాలు లభించనున్నాయి. అయితే వీరు తప్పనిసరిగా కొన్ని నైపుణ్యాలు సొంతం చేసుకోవాల్సి ఉంటుంది. అవి.. కోడింగ్, ప్రోగ్రామింగ్, అప్లికేషన్ డిజైన్, లాంగ్వేజెస్ (ప్రోగ్రామింగ్), డాట్ నెట్, ఐపీ నెట్ వర్కింగ్, మొబైల్ డెవలప్‌మెంట్.

### ఇతర విభాగాల అభ్యర్థులకూ

ఐవోటీ విస్తృతంగా వినియోగంలోకి వస్తున్న నేపథ్యంలో కేవలం దీనికి సంబంధించిన నైపుణ్యాలే కాకుండా.. ఇతర విభాగాల పైనా అవగాహన పొందిన వారికి కూడా అవకాశాలు లభిస్తున్నాయి. వీటిలో క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, రోబోటిక్స్ విభాగాలు ప్రధానంగా నిలుస్తున్నాయి. ఐఓటీ ఆధారిత సేవలన్నీ ఇంటర్నెట్ లేదా వైర్‌లెస్ లేదా సెన్సర్ల రూపంలో ఉంటాయి కాబట్టి వాటి నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా సైబర్ సెక్యూరిటీ నిపుణులు అవసరమవుతున్నారు. అదే విధంగా ఇంటర్నెట్ ఆధారంగా సాఫ్ట్‌వేర్ సేవలు అందించే క్లౌడ్ కంప్యూటింగ్ అవసరం కూడా పెరుగుతోంది. అంటే.. పలు సాంకేతిక అంశాల సమాహారంగా నిలుస్తున్న ఐఓటీ అనేక విభాగాల్లో కొలువులకు వేదికగా మారనుంది.

### ఐఓటీలో లభించే కొలువులు

ఐఓటీ విభాగాల్లో లభించే కొలువుల వివరాలు.. » ఐవోటీ ప్రొడక్ట్ మేనేజర్స్ » ఐవోటీ ఆర్కిటెక్ట్ » ఐవోటీ డెవలపర్ » డేటా సైంటిస్ట్స్ » ఐవోటీ క్లౌడ్ ఇంజనీర్ » ఇండస్ట్రియల్ ఇంజనీర్.

### అందుబాటులోకి సర్టిఫికేషన్ కోర్సులు

ఐవోటీకి సంబంధించి ప్రత్యేక నైపుణ్యాలు అందించే విధంగా పలు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాయి. అవి.. మైక్రోసాఫ్ట్ ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ సర్టిఫికెట్ ఇన్ ఐవోటీ, సిస్కో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఐబీఎం వాట్సన్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, జెట్ కింగ్ ఐవోటీ సర్టిఫికేషన్ కోర్స్, సీసీఎన్ఏ సర్టిఫికేషన్ కోర్స్. వీటితోపాటు ఎడ్యురేక, యుడెమీ, ఎడెక్స్ వంటి పలు సంస్థలు ఆన్‌లైన్ విధానంలో ఐవోటీ స్పెషలైజ్డ్ సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాయి. ఇవి పలు ఐటీ సంస్థలతో అనుసంధానం చేసుకుంటూ కోర్సులను నిర్వహిస్తున్నాయి.

### సంస్థల సొంత శిక్షణ

ఐవోటీ ఆధారిత కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐటీ దిగ్గజ సంస్థలు.. తమ సొంత ఇన్ హౌస్ ట్రైనింగ్ సెంటర్లలో శిక్షణనిస్తున్నాయి. ప్రధానంగా సీఎస్ఈ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఫ్రెషర్స్‌ను నియమించుకుంటున్న సంస్థలు.. మూడు నుంచి ఆరు నెలలపాటు శిక్షణ ఇస్తున్నాయి.

### వేతనాలు ఆకర్షణీయం

ఐవోటీలో సర్టిఫికేషన్స్ పూర్తిచేసిన విద్యార్థులకు సంస్థలు ఆకర్షణీయమైన వేతనాలు అందిస్తున్నాయి. ఎంట్రీ లెవల్‌లో మూడు నుంచి అయిదు లక్షల వార్షిక వేతనం, రెండు లేదా మూడేళ్ల అనుభవం ఉన్నవారికి రూ.ఆరు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు వార్షిక వేతనం అందిస్తున్నాయి.

### భవిష్యత్తు ఐవోటీదే

భవిష్యత్తులో ఉత్పత్తులు, సేవల విషయంలో ఐవోటీ ఆధారిత కార్యకలాపాలు 60 శాతం నుంచి 70 శాతం మేరకు ఉండే అవకాశముంది. ఐవోటీ ఆధారిత కార్యకలాపాలు పెరుగుతుండటంతో నిపుణుల కోసం సంస్థలు అన్వేషిస్తున్నాయి. ఈ క్రమంలో ఆయా స్కిల్స్ అందిపుచ్చుకునేలా విద్యార్థులు ఇప్పటి నుంచే అడుగులు వేయాలి. ఐవోటీకి సంబంధించిన కోర్ అంశాలతో పాటు దానికి అనుసంధానంగా ఉండే ఇతర అంశాలపైనా నైపుణ్యాలు పెంచుకునేందుకు ప్రయత్నం చేయాలి.

– ప్రొఫెసర్ కృష్ణమోహన్,
సీఎస్ఈ డిపార్ట్‌మెంట్,
ఐఐటీ–హైదరాబాద్.



### ఐవోటీ.. ముఖ్యాంశాలు

- గార్ట్‌నర్ నివేదిక ప్రకారం 2020 నాటికి 1.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకోనున్న భారత ఐఓటీ మార్కెట్.
- రానున్న అయిదేళ్లలో ఐవోటీ ఆధారిత కార్యకలాపాల పరంగా మూడో పెద్ద దేశంగా మారనున్న భారత్.
- ఫలితంగా రానున్న రెండేళ్లలో జాతీయ స్థాయిలో దాదాపు నాలుగు లక్షల ఐఓటీ ప్రొఫెషనల్స్ అవసరం.
- ఎంట్రీ లెవల్‌లో రూ.మూడు లక్షల నుంచి రూ. అయిదు లక్షల వార్షిక వేతనం.
- రెండు, మూడేళ్ల అనుభవంతో రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వార్షిక వేతనం.
- బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, పుణె, ముంబై, హైదరాబాద్‌లలో విస్తృత అవకాశాలు.

## ఐబీపీఎస్-ఆర్ఆర్‌బీ

ఖాళీలు 8400

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. దేశవ్యాప్తంగా వివిధ రీజనల్ రూరల్ బ్యాంకు (ఆర్ఆర్‌బీ)ల్లో ఖాళీగా ఉన్న 8400 ఆఫీసర్, ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్) తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

✦ **విభాగాల వారీ ఖాళీలు:**

| విభాగం | ఖాళీలు |
|---|---|
| ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్) | 3688 |
| ఆఫీసర్ స్కేల్–1 | 3381 |
| ఆఫీసర్ స్కేల్–2 (అగ్రికల్చర్ ఆఫీసర్) | 106 |
| ఆఫీసర్ స్కేల్–2 (మార్కెటింగ్ ఆఫీసర్) | 45 |
| ఆఫీసర్ స్కేల్–2 (ట్రెజరీ ఆఫీసర్) | 11 |
| ఆఫీసర్ స్కేల్–2 (లా) | 19 |
| ఆఫీసర్ స్కేల్–2 (సీఏ) | 24 |
| ఆఫీసర్ స్కేల్–2 (ఐటీ) | 76 |
| ఆఫీసర్ స్కేల్–2 (జనరల్ బ్యాంకింగ్) | 893 |
| ఆఫీసర్ స్కేల్–3 | 157 |
| మొత్తం | 8400 |

✦ **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** 829.
✦ **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, పోస్టులను బట్టి పని అనుభవం ఉండాలి. స్థానిక భాష వచ్చి ఉండాలి.
✦ **వయసు:** ఆఫీసర్ స్కేల్–1 పోస్టులకు 18–30 ఏళ్ల మధ్య; ఆఫీసర్ స్కేల్–2 పోస్టులకు 21–32 ఏళ్ల మధ్య; ఆఫీసర్ స్కేల్–3 పోస్టులకు 21–40 ఏళ్ల మధ్య; ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీ పర్పస్) పోస్టులకు 18–28 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; పీహెచ్‌సీలకు పదేళ్ల గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
✦ **ఎంపిక:** ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.
✦ **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్–సర్వీస్‌మెన్ అభ్యర్థులకు రూ.100; మిగిలిన వారికి రూ.600.

**ముఖ్య తేదీలు**

✦ **రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ:** జూలై 4, 2019.
✦ **ఆఫీసర్ స్కేల్–1 ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 2019, ఆగస్టు 3, 4, 11 తేదీల్లో ఉంటుంది.
✦ **ఆఫీస్ అసిస్టెంట్ ప్రిలిమినరీ పరీక్షతేదీ:** 2019, ఆగస్టు 17, 18, 25 తేదీల్లో ఉంటుంది.
✦ **ఆఫీసర్స్ స్కేల్–1, 2, 3 మెయిన్ పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 22, 2019.
✦ **ఆఫీస్ అసిస్టెంట్ మెయిన్ ఎగ్జామ్ తేదీ:** సెప్టెంబర్ 29, 2019.
✦ **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:**
**తెలంగాణ:** హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
**ఆంధ్రప్రదేశ్:** అనంతపురం, చీరాల, గుంటూరు, కాకినాడ, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, పుత్తూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.
✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ibps.in

## యూపీఎస్సీ-సీడీఎస్ ఎగ్జామ్

ఖాళీలు 417

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీడీఎస్ఈ–2)–2019 ప్రకటన జారీ చేసింది. ఈ పరీక్ష ద్వారా వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 417 పోస్టులను భర్తీ చేస్తారు.

1. ఇండియన్ మిలిటరీ అకాడమీ–డెహ్రాడూన్: 100
2. ఇండియన్ నేవల్ అకాడమీ–ఎజిమళ: 45
3. ఎయిర్‌ఫోర్స్ అకాడమీ–హైదరాబాద్: 32
4. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ–చెన్నై: 225
5. ఎస్ఎస్‌సీ ఉమెన్ (నాన్ టెక్నికల్): 15

✦ **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టు/బ్రాంచీల్లో ఇంజనీరింగ్ డిగ్రీ, సాధారణ డిగ్రీ, డీజీసీఏ జారీచేసిన కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉత్తీర్ణతతో పాటు నిర్దేశించిన శారీరక ప్రమాణాలుండాలి.
✦ **ఎంపిక:** రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ **దరఖాస్తు ఫీజు:** మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ఫీజు లేదు. మిగిలిన వారికి రూ.200.
✦ **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 8, 2019.
✦ **దరఖాస్తులు ఉపసంహరణ:** జూలై 15, 2019 నుంచి జూలై 22, 2019 వరకు.
✦ **పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 8, 2019.
✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.upsconline.nic.in




## ఇండియన్ నేవీ

ఖాళీలు 2700

ఇండియన్ నేవీ ఏఏ (ఆర్టిఫీషర్ అప్రెంటీస్) అండ్ ఎస్ఎస్ఆర్ (సీనియర్ సెకండరీ రిక్రూట్స్) ఫిబ్రవరి–2020 బ్యాచ్ ద్వారా 2700 సెయిలర్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఏఏ (ఆర్టిఫీషర్ అప్రెంటీస్)–500.
2. ఎస్ఎస్ఆర్ (సీనియర్ సెకండరీ రిక్రూట్స్)–2200.

✦ **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయాలజీ/కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణత. నిర్దేశించిన శారీరక ప్రమాణాలు తప్పనిసరి.
✦ **వయసు:** 2000, ఫిబ్రవరి 1 నుంచి 2003, జనవరి 31 మధ్య జన్మించి ఉండాలి.
✦ **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ (పీఎఫ్‌టీ), మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ **దరఖాస్తు ఫీజు:** రూ.205 (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు లేదు).
✦ **దరఖాస్తులు ప్రారంభం:** జూన్ 28, 2019.
✦ **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 10, 2019.
✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

## ఇస్రో-ఎల్‌పీఎస్‌సీ

ఖాళీలు 41

ఇస్రోకి చెందిన లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ).. తిరువనంతపురం, బెంగళూరు యూనిట్లలో పనిచేసేందుకు వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 41 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ **విభాగాల వారీ ఖాళీలు:** టెక్నీషియన్–21, డ్రాఫ్ట్స్‌మెన్–4, హెవీ వెహికల్ డ్రైవర్–4, లైట్ వెహికల్ డ్రైవర్–1, క్యాటరింగ్ అటెండెంట్–11.
✦ **అర్హత:** పోస్టులను బట్టి పదో తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ/ఎన్‌టీసీ/ఎన్ఏసీ, డ్రైవింగ్ లైసెన్స్, డ్రైవింగ్, పని అనుభవం ఉండాలి.
✦ **వయసు:** 2019, జూలై 2 నాటికి క్యాటరింగ్ అటెండెంట్ పోస్టులకు 25 ఏళ్లు; మిగిలిన వాటికి 35 ఏళ్లు మించకూడదు. ప్రభుత్వ నిబంధనలు, రిజర్వేషన్ల ఆధారంగా వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 2, 2019.
✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.lpsc.gov.in

## సీఈఎల్

ఖాళీలు 74

ఘజియాబాద్ (యూపీ)లోని ప్రభుత్వ రంగ సంస్థ అయిన సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (సీఈఎల్) శాశ్వత, ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 74 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ **పోస్టులు:** జనరల్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, చీఫ్ మేనేజర్, సీనియర్ టెక్నికల్ మేనేజర్, సీనియర్ మేనేజర్, మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్, ప్రాజెక్ట్ మేనేజర్, అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ, డిప్యూటీ ఇంజనీర్, మార్కెటింగ్ ఆఫీసర్.
✦ **విభాగాలు:** హెచ్‌ఆర్, డిజైన్, మార్కెటింగ్, ప్రొడక్షన్, ఫైనాన్స్, విజిలెన్స్, డిఫెన్స్ మార్కెటింగ్, ఎగ్జిక్యూషన్, కమర్షియల్, మెకానికల్, ఐటీ, సిరామిక్స్ తదితర విభాగాలున్నాయి.
✦ **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఐసీడబ్ల్యూఏ, ఎంబీఏ/పీజీ డిప్లొమా, లా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట పని అనుభవం ఉండాలి.
✦ **వయసు:** 2019, మే 31 నాటికి 30–52 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; పీడబ్ల్యూడీలకు పదేళ్ల గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ **దరఖాస్తు ఫీజు:** రూ.500 (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు ఫీజు లేదు).
✦ **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 20, 2019.
✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.celindia.co.in

## బీఈసీఐఎల్

ఖాళీలు 90

నోయిడాలోని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన మినీరత్న సంస్థ అయిన బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) తాత్కాలిక ప్రాతిపదికన 90 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. పేషంట్ కేర్ మేనేజర్ (పీసీఎం): 20.
2. పేషంట్ కేర్ కో–ఆర్డినేటర్ (పీసీసీ): 70.

✦ **అర్హత:** పోస్టులను బట్టి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఫుల్‌టైం బ్యాచిలర్ డిగ్రీ ఇన్ లైఫ్ సైన్సెస్ లేదా ఫుల్‌టైం పోస్ట్ గ్రాడ్యుయేట్ క్వాలిఫికేషన్ ఇన్ హాస్పిటల్/హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ ఉత్తీర్ణత. పీసీసీ పోస్టులకు ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దిష్ట పని అనుభవం కూడా ఉండాలి.
✦ **వయసు:** పీసీఎం పోస్టులకు 40 ఏళ్లు, పీసీసీ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
✦ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ **దరఖాస్తు ఫీజు:** రూ.300 (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు ఫీజు లేదు).
✦ **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 12, 2019.
✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.becil.com

సాక్షి
బుధవారం
19-6-2019

# స్పోర్ట్స్

**1** వన్డే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు (17) కొట్టిన ఆటగాడు మోర్గాన్. గతంలో రోహిత్, డివిలియర్స్, గేల్ 16 చొప్పున సిక్సర్లు బాదారు.

**1** ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు నమోదు చేసిన జట్టు (25)గా ఇంగ్లండ్ నిలిచింది.

**1** ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్ తమ అత్యధిక స్కోరు (397) నమోదు చేసింది.

## పాయింట్ల పట్టిక

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ర–రద్దు, నె.ర.రే.–నెట్ రన్‌రేట్, పా–పాయింట్లు

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా | జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఇంగ్లండ్ | 5 | 4 | 1 | 0 | 1.862 | 8 | శ్రీలంక | 5 | 1 | 2 | 2 | -1.778 | 4 |
| ఆస్ట్రేలియా | 5 | 4 | 1 | 0 | 0.812 | 8 | వెస్టిండీస్ | 5 | 1 | 3 | 1 | 0.272 | 3 |
| న్యూజిలాండ్ | 4 | 3 | 0 | 1 | 2.163 | 7 | దక్షిణాఫ్రికా | 5 | 1 | 3 | 1 | -0.208 | 3 |
| భారత్ | 4 | 3 | 0 | 1 | 1.029 | 7 | పాకిస్తాన్ | 5 | 1 | 3 | 1 | -1.933 | 3 |
| బంగ్లాదేశ్ | 5 | 2 | 2 | 1 | -0.270 | 5 | అఫ్గానిస్తాన్ | 5 | 0 | 5 | 0 | -2.089 | 0 |

# మోర్గాన్ సిక్సర్ల మోత


మోర్గాన్

ఇంగ్లండ్ అభిమానులు ప్రపంచ కప్‌లో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన ఇన్నింగ్స్ రానే వచ్చింది. సింగిల్ తీసినంత ఈజీగా సిక్సర్లు కొట్టిన కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ ఒక్కసారిగా కప్‌కు ఊపు తెచ్చేశాడు. అతని దెబ్బకు అఫ్గాన్ ఆటగాళ్లు అసలైన పసికూనల్లా కనిపించారు. ఒకటి, రెండు, మూడు... ఇలా బ్యాట్‌కు తగిలిన వెంటనే అలా బంతి గాల్లో తేలిపోతూ స్టాండ్స్‌లోకి పడుతుంటే వారంతా ప్రేక్షకుల్లా నిర్వెరపోయి చూస్తుండటం మినహా ఏమీ చేయలేకపోయారు. ఎలా బంతి వేసినా అది చివరకు సిక్సర్‌గా మారాల్సిందే అన్నంత కసిగా మోర్గాన్ బాదడంతో మాంచెస్టర్ మైదానంలో పరుగుల పండగ సాగింది. చివరకు మోర్గాన్ లెక్క భారీ సెంచరీ సహా 17 సిక్సర్ల ప్రపంచ రికార్డు వద్ద ఆగింది... ఒక్క సిక్సర్లతోనే వంద పరుగులు సాధించిన తొలి ఆటగాడిగా నిలిచిన తమ కెప్టెన్‌కు తోడుగా బెయిర్‌స్టో, రూట్ కూడా రాణించడంతో ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ అత్యధిక స్కోరు నమోదు చేసింది. ఊహించినట్లుగానే అఫ్గానిస్తాన్ లక్ష్యానికి అందనంత దూరంలో నిలిచిపోయి మరో పరాజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది.

**17 సిక్సర్లతో ప్రపంచ రికార్డు • 71 బంతుల్లో 148 పరుగులు చేసిన ఇంగ్లండ్ కెప్టెన్**

**150 పరుగులతో అఫ్గానిస్తాన్‌పై ఘన విజయం • బెయిర్‌స్టో, రూట్ సెంచరీలు మిస్**

**మాంచెస్టర్:** రికార్డుల మోత మోగిన మ్యాచ్‌లో ఫేవరెట్ ఇంగ్లండ్ మరో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం ఇక్కడి ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానంలో జరిగిన పోరులో ఇంగ్లండ్ 150 పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 397 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఇయాన్ మోర్గాన్ (71 బంతుల్లో 148; 4 ఫోర్లు, 17 సిక్సర్లు) భారీ శతకం నమోదు చేయగా... బెయిర్‌స్టో (99 బంతుల్లో 90; 8 ఫోర్లు, 3 సిక్సర్లు), జో రూట్ (82 బంతుల్లో 88; 5 ఫోర్లు, 1 సిక్స్) ఆ అవకాశం చేజార్చుకున్నారు. అనంతరం అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. హష్మతుల్లా షాహిది (100 బంతుల్లో 76; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఐదు పరాజయాలతో సెమీస్ రేసు నుంచి తప్పుకున్న తొలి జట్టుగా అఫ్గానిస్తాన్ ఖాయమైంది.

### రెండు సెంచరీలు చేజారె...

ఇంగ్లండ్‌కు బెయిర్‌స్టో మరోసారి శుభారంభం అందించాడు. రాయ్ గాయపడటంతో జట్టులోకి వచ్చిన విన్స్ (26) పెద్దగా రాణించకపోయినా... 120 పరుగుల బెయిర్‌స్టో, రూట్ రెండో వికెట్ భాగస్వామ్యం ఇంగ్లండ్ భారీ స్కోరుకు బాటలు వేసింది. వీరిద్దరు చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ అఫ్గాన్ బౌలర్లు అందరిపై ఆధిపత్యం ప్రదర్శించారు. ఈ క్రమంలో 61 బంతుల్లో బెయిర్‌స్టో, 54 బంతుల్లో జో రూట్ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. పార్ట్‌నర్‌షిప్ 100 పరుగులు దాటిన తర్వాత సెంచరీకి చేరువైన దశలో నైబ్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి బెయిర్‌స్టో నిష్క్రమించాడు. అనంతరం మోర్గాన్ మెరుపుల ముందు చాలా సేపు రూట్ ప్రేక్షక పాత్ర పోషించాల్సి వచ్చింది. 189 పరుగుల మోర్గాన్, రూట్ మూడో వికెట్ భాగస్వామ్యంలో మోర్గాన్ కొట్టినవి 142 పరుగులు కాగా, రూట్ 43 పరుగులు చేశాడు. చివరకు నైబ్ బౌలింగ్‌లోనే భారీ షాట్ ఆడబోయి లాంగాన్‌లో క్యాచ్ ఇవ్వడంతో ఈ టోర్నీలో రూట్ మూడో సెంచరీ అవకాశాన్ని కోల్పోయాడు. వీరిద్దరు ఔటైన తర్వాత చివర్లో మొయిన్ అలీ (9 బంతుల్లో 31 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్సర్లు) కూడా చెలరేగడంతో ఇంగ్లండ్ 400 పరుగులకు చేరువగా వచ్చింది. ఆఖరి 2 ఓవర్లలో అలీ రెండేసి సిక్సర్లు బాదాడు. చివరి పది ఓవర్లలో ఇంగ్లండ్ 142 పరుగులు సాధించింది.


బెయిర్‌స్టో


రూట్

### హష్మతుల్లా మినహా...

దాదాపు అసాధ్యమైన లక్ష్య ఛేదనలో అఫ్గాన్ ఏ దశలోనూ గట్టిగా నిలబడలేకపోయింది. రెండో ఓవర్లోనే నూర్ అలీ (0) ఔట్ కావడంతో సరైన ఆరంభమే లభించలేదు. కెప్టెన్ గుల్బదిన్ నైబ్ (28 బంతుల్లో 37; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడే ప్రయత్నం చేయగా, రహ్మత్ షా (74 బంతుల్లో 46; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఆ తర్వాత హష్మతుల్లా, అస్గర్ (48 బంతుల్లో 44; 3 ఫోర్లు, 2 సిక్సలు) నాలుగో వికెట్‌కు 90 బంతుల్లోనే 94 పరుగులు జోడించి కొద్దిగా ప్రతిఘటించే ప్రయత్నం చేసినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది. నబీ (9) కూడా విఫలం కావడంతో విజయంపై అఫ్గాన్ ఆశలు కోల్పోయింది.

## 'కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి'




ప్రపంచకప్ ప్రారంభానికి ముందు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మోర్గాన్‌ను నీకిష్టమైన షాట్ ఏదని అడిగితే... 'సిక్సర్ కొట్టగలిగే ఏ షాట్ అయినా నాకిష్టమే' అని చెప్పాడు! ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాళ్ల జాబితాలో ఆరో స్థానంలో (211 సిక్సర్లు) ఉన్న మోర్గాన్ విషయంలో ఆ వ్యాఖ్య అతిశయోక్తిగా అనిపించదు. అతని సిక్సర్ల సునామీ అఫ్గాన్ మ్యాచ్‌లో మరోసారి కనిపించింది. డీప్ మిడ్‌వికెట్, లాంగాన్, లాంగాఫ్, డీప్ స్క్వేర్‌లెగ్, మిడాఫ్... ఇలా ఏ వైపు అంటే ఆ వైపు, ఎలా అనుకుంటే అలా మోర్గాన్ సిక్సర్లతో విరుచుకు పడ్డాడు. అతని దెబ్బకు పాపం అఫ్గాన్ బౌలర్లంతా బెంబేలెత్తిపోయారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ప్రస్తుతం అత్యుత్తమ లెగ్‌స్పిన్నర్‌గా ప్రశంసలందుకుంటున్న రషీద్ ఖాన్ అయితే బంతి ఎలా వేయాలో తెలీక పూర్తిగా చేతులెత్తేశాడు. 30వ ఓవర్ చివరి బంతికి మోర్గాన్ క్రీజ్‌లోకి వచ్చే సమయానికి రూట్ 45 పరుగుల వద్ద ఆడుతున్నాడు. సరిగ్గా 40 ఓవర్లు ముగిసే సరికి రూట్ స్కోరు 66 కాగా, మోర్గాన్ 67 వద్ద నిలవడం విశేషం! నైబ్ ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లతో మోర్గాన్ జోరు మొదలైంది. ఆ తర్వాత రషీద్ ఓవర్లో 2 సిక్సర్లు, మరో ఫోర్‌తో ఇంగ్లండ్ కెప్టెన్ చెలరేగాడు. అదే ఓవర్లో 28 పరుగుల వద్ద మోర్గాన్ బంతిని గాల్లోకి లేపగా బౌండరీ వద్ద సునాయాసంగా అందుకోవాల్సిన క్యాచ్‌ను దౌలత్ పొరపాటుగా అంచనా వేయడంతో అఫ్గాన్ సువర్ణావకాశం కోల్పోయింది. నబీ బౌలింగ్‌లో సిక్స్‌తోనే 36 బంతుల్లో మోర్గాన్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాత మరింత చెలరేగిపోయిన ఇయాన్ తర్వాతి 21 బంతుల్లోనే సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. ఈ క్రమంలో రషీద్ ఖాన్ మళ్లీ బాధితుడయ్యాడు. అతను వేసిన 43వ ఓవర్లో మోర్గాన్ మూడు సిక్సర్లు బాది ప్రపంచకప్‌లో నాలుగో వేగవంతమైన శతకం (57 బంతుల్లో) నమోదు చేశాడు. రషీద్ తర్వాతి ఓవర్లో కూడా రీప్లే చూపిస్తూ మళ్లీ 3 భారీ సిక్సర్లతో విరుచుకుపడిన మోర్గాన్... నైబ్ ఓవర్లో కూడా మళ్లీ మూడు సిక్సర్లు కొట్టి ప్రపంచ రికార్డు సృష్టించాడు. సిక్సర్లతోనే సెంచరీ సాధించిన మోర్గాన్ ఇన్నింగ్‌లో అలా ఉండీ లేనట్లు నాలుగు ఫోర్లు మాత్రం ఉన్నాయి. 17వ సిక్సర్ కొట్టగానే మరో భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగాఫ్‌లో షాకు క్యాచ్ ఇవ్వడంతో అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది. నాలుగు రోజుల క్రితం వెన్ను నొప్పితో బాధపడుతూ మీడియా సమావేశంలో నిలబడి మాట్లాడిన మోర్గాన్ ఒక దశలో ఈ మ్యాచ్ ఆడటం కూడా సందేహంగానే మారింది. కానీ అతను ఆడటమే కాదు అదరగొట్టాడు.

## 9 ఓవర్లలో 110 పరుగులు...



ప్రపంచవ్యాప్తంగా టి20 క్రికెట్‌లో స్టార్ బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకొని అఫ్గాన్ జట్టు ఆశలు మోస్తున్న లెగ్‌స్పిన్నర్ రషీద్ ఖాన్‌కు ఈ మ్యాచ్‌లో భారీ దెబ్బ పడింది. మోర్గాన్ దెబ్బకు ఎవరూ ఆశించని చెత్త రికార్డులు అతని ఖాతాలో చేరాయి. ఒక ప్రపంచకప్ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు (110) ఇచ్చిన బౌలర్‌గా వహాబ్ రియాజ్ (110)తో సమంగా నిలిచిన రషీద్, వన్డేల్లో 100కు పైగా పరుగులు ఇచ్చిన తొలి స్పిన్నర్. ఓవరాల్‌గా వన్డేల్లో మిక్ లూయిస్ (113) తర్వాత ఇది రెండో చెత్త ప్రదర్శన. కాగా... ఎకానమీ (9 ఓవర్లలోనే 110 పరుగులు ఇవ్వడం; ఓవర్‌కు 12.22 పరుగులు) పరంగా చూస్తే దీనికే అగ్రస్థానం దక్కుతుంది. రషీద్ బౌలింగ్‌లో మోర్గాన్ ఒక్కడే 7 సిక్సర్లు బాదగా... మొత్తంగా 11 సిక్స్‌లతో అత్యధిక సిక్సర్లు ఇచ్చిన బౌలర్‌గా ఎవరూ కోరుకోని గుర్తింపు పొందాడు.

## స్కోరు వివరాలు

**ఇంగ్లండ్ ఇన్నింగ్స్:** విన్స్ (సి) ముజీబ్ (బి) దౌలత్ 26; బెయిర్‌స్టో (సి అండ్ బి) నైబ్ 90; రూట్ (సి) రహ్మత్ షా (బి) నైబ్ 88; మోర్గాన్ (సి) రహ్మత్‌షా (బి) నైబ్ 148; బట్లర్ (సి) నబీ (బి) దౌలత్ 2; స్టోక్స్ (బి) దౌలత్ 2; మొయిన్ అలీ (నాటౌట్) 31; వోక్స్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9;
**మొత్తం (50 ఓవర్లలో 6 వికెట్లకు) 397.**
**వికెట్ల పతనం:** 1–44, 2–164, 3–353, 4–359, 5–362, 6–378. **బౌలింగ్:** ముజీబ్ 10–0–44–0, దౌలత్ 10–0–85–3, నబీ 9–0–70–0, గుల్బదిన్ నైబ్ 10–0–68–3, రహ్మత్ షా 2–0–19–0, రషీద్ ఖాన్ 9–0–110–0.

**అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్:** నూర్ అలీ (బి) ఆర్చర్ 0; నైబ్ (సి) బట్లర్ (బి) వుడ్ 37; రహ్మత్ షా (సి) బెయిర్‌స్టో (బి) ఆదిల్ రషీద్ 46; హష్మతుల్లా (బి) ఆర్చర్ 76; అస్గర్ (సి) రూట్ (బి) ఆదిల్ రషీద్ 44; నబీ (సి) స్టోక్స్ (బి) ఆదిల్ రషీద్ 9; నజీబుల్లా (బి) వుడ్ 15; రషీద్ ఖాన్ (సి) బెయిర్‌స్టో (బి) ఆర్చర్ 8; ఇక్రమ్ (నాటౌట్) 3; దౌలత్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9;
**మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 247.**
**వికెట్ల పతనం:** 1–4, 2–52, 3–104, 4–198, 5–210, 6–234, 7–234, 8–247.
**బౌలింగ్:** వోక్స్ 9–0–41–0, ఆర్చర్ 10–1–52–3, మొయిన్ అలీ 7–0–35–0, వుడ్ 10–1–40–2, స్టోక్స్ 4–0–12–0, ఆదిల్ రషీద్ 10–0–66–3.

**ప్రపంచకప్‌లో నేడు**
దక్షిణాఫ్రికా X న్యూజిలాండ్
వేదిక: బర్మింగ్‌హామ్
మధ్యాహ్నం 3 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

## నవ ఇంగ్లండ్ నిర్మాత

*సాక్షి క్రీడా విభాగం*

గత కొన్నేళ్లలో వన్డేల్లో భారీగా పరుగులు సాధించిన, రికార్డులు నమోదు చేసిన కోహ్లి, రోహిత్, గేల్, డివిలియర్స్ తదితర ఆటగాళ్లతో కూడిన జాబితాను చూస్తే ఇయాన్ మోర్గాన్ పేరు కనిపించదు. అతను ఓపెనర్ కాకపోవడమే అందుకు ప్రధాన కారణం. మోర్గాన్ తన కెరీర్‌లో ఎక్కువ భాగం ఐదో స్థానంలోనే బ్యాటింగ్‌కు దిగాడు. ఇంగ్లండ్ కూడా తమ జట్టుకు ఫినిషర్‌గానే అతడిని చూసింది. అయితే మొదటి నుంచీ అతని బ్యాటింగ్ శైలి దూకుడుగానే ఉంటుంది. రెండు దేశాల తరపున అంతర్జాతీయ క్రికెట్ ఆడిన అరుదైన ఆటగాళ్లలో మోర్గాన్ కూడా ఒకడు. ఐర్లాండ్‌లో పుట్టిన అతను తన మాతృదేశం తరపునే అరంగ్రేటం చేశాడు. స్కాట్లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అయిన మోర్గాన్... 99 పరుగుల వద్ద రనౌట్ అయి ఆ మ్యాచ్‌ను ఎప్పటికీ మరచిపోలేని విధంగా మార్చుకున్నాడు! దాదాపు మూడేళ్ల పాటు ఐర్లాండ్‌కు ఆడిన (23 వన్డేలు) అనంతరం అతడిని ఇంగ్లండ్ సాదరంగా ఆహ్వానించింది. అనంతరం 2010 టి20 ప్రపంచ కప్‌ను గెలుచుకున్న ఇంగ్లండ్ జట్టులో మోర్గాన్ కీలక పాత్ర పోషించాడు. మధ్యలో టెస్టు క్రికెటర్‌గా నిలదొక్కుకునే ప్రయత్నం చేసినా, అది తన వల్ల కాదని గుర్తించి రెండేళ్లకే గుడ్‌బై చెప్పేశాడు. ఐపీఎల్ అనుభవంతో అతని బ్యాటింగ్‌లో మరింత ధాటి పెరిగింది. ఆ తర్వాత బ్యాట్స్‌మన్‌గా మోర్గాన్ స్థానానికి తిరుగు లేకుండా పోయింది.

> **2003 ప్రపంచకప్‌లో భారత్, ఇంగ్లండ్ మ్యాచ్‌ను దక్షిణాఫ్రికాలో ఉండి ప్రేక్షకుడిగా చూశాను. కాడిక్ బౌలింగ్‌లో పక్కకు జరుగుతూ మిడ్‌వికెట్ మీదుగా టెండూల్కర్ కొట్టిన భారీ సిక్సర్ దాదాపు మైదానం బయటకు వెళ్లింది. నా జీవితంలో అలాంటి భారీ సిక్సర్ ఎప్పుడూ చూడలేదు. మ్యాచ్ గురించి నాకు ఆ సిక్సర్ తప్ప ఏమీ గుర్తు లేదు. అప్పటి నుంచి సిక్సర్ల మోజు పెరిగిపోయిందంతే.**
> –ఒక ఇంటర్వ్యూలో మోర్గాన్

మోర్గాన్ కెరీర్‌లో మేలి మలుపు 2014 క్రిస్మస్ సమయంలో వచ్చింది. వన్డేల్లో ఇంగ్లండ్ పేలవ ప్రదర్శన చూసీ చూసీ విసుగెత్తిన బోర్డు ఉన్నపళంగా కుక్‌ను తప్పించేసి మోర్గాన్‌ను కెప్టెన్‌గా ప్రకటించింది. రెండు నెలల తర్వాత జరిగిన ప్రపంచకప్‌లోనూ ఇంగ్లండ్ పేలవ ప్రదర్శన కొనసాగింది. బంగ్లా చేతిలో ఓటమితో క్వార్టర్ ఫైనల్ అవకాశం పోయింది. ఇంకా నాయకుడిగా కుదురుకోని మోర్గాన్ కూడా విఫలమయ్యాడు. అయితే ఆ తర్వాత జట్టు ప్రక్షాళన కార్యక్రమం సాగింది. వన్డేల నుంచి సీనియర్లు అండర్సన్, బ్రాడ్, బెల్‌లను తప్పించడంలో మోర్గాన్‌దే కీలక పాత్ర. ఆ తర్వాత విధ్వంసక బ్యాట్స్‌మెన్‌తో జట్టును నింపి స్వయంగా చెలరేగి ఆడుతూ సహచరులలో స్ఫూర్తిని నింపాడు.

అంతే...ఇంగ్లండ్ కొత్త ప్రస్థానం మొదలైంది. వన్డేల్లో ప్రపంచ రికార్డు స్కోరు నమోదు చేసిన జట్టు మళ్లీ అదే రికార్డును బద్దలు కొట్టింది. 2015 ప్రపంచ కప్ తర్వాత ఈ వరల్డ్ కప్‌కు ముందు ఏకంగా 18 సార్లు 350కు పైగా స్కోర్లు నమోదు చేస్తే నాలుగు సార్లు 400 పరుగులు దాటింది. వన్డేల్లో నంబర్‌వన్‌గా అవతరించిన ఇంగ్లండ్... మోర్గాన్ నాయకత్వంలో ఆడిన 13 వన్డే సిరీస్‌లలో 12 గెలుచుకుంది. ఇప్పుడు సొంతగడ్డపై ఇంగ్లండ్‌ను ఫేవరెట్‌గా చూస్తున్నారంటే అదంతా గత నాలుగేళ్లలో మోర్గాన్ నాయకత్వంలో వచ్చిన మార్పే కారణం. ఒక ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ అత్యధికంగా 22 సిక్సర్లు (2007లో) కొడితే ఇవాళ ఒక్క మ్యాచ్‌లోనే జట్టు 25 సిక్సర్లు బాదింది. తన బ్యాటింగ్‌తో పాటు ఇదే జోరును జట్టు కొనసాగిస్తే వరల్డ్ కప్ విజేతగా ఈ 'ఐరిష్ మ్యాన్' చరిత్రలో నిలిచిపోవడం ఖాయం.

## 6కే ఆలౌట్... ఇదీ క్రికెట్టే!

**టి20ల్లో మాలి మహిళల జట్టు చెత్త రికార్డు**

*కిగలి సిటీ:* ఓ వైపు పురుషుల వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ మోర్గాన్ 17 సిక్సర్లతో కొత్త ప్రపంచ రికార్డు నమోదు చేస్తే... మరోవైపు మహిళల అంతర్జాతీయ టి20లో 6 పరుగులకే ఆలౌటైన చెత్త రికార్డు మంగళవారం నమోదైంది. క్విబుక మహిళల టి20 టోర్నీలో మాలి జట్టు ఈ కొత్త చెత్త రికార్డును తమ పేర లిఖించుకుంది. రువాండతో జరిగిన పోరులో మొదట బ్యాటింగ్ చేసిన మాలి మహిళల జట్టు 9 ఓవర్లలో 6 పరుగులు చేసి ఆలౌటైంది. మరో ఆసక్తికర విషయమేంటంటే ఓపెనర్ సమకె (1) చేసిన పరుగే టాప్ స్కోర్! ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన పది మంది 'జీరో'లే! ఒక్కరు మినహా అందరు 6, 7 బంతులాడి ఖాతా తెరవకుండానే ఔటైతే... కొలిబెలీ మాత్రం అత్యధికంగా 12 బంతులాడి డకౌటైంది. ఇక మిగతా 5 పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో వచ్చాయి. 2 బైస్, మరో 2 లెగ్‌బైస్, ఒకటేమో వైడ్... ఇది మాలి ఇన్నింగ్స్ కథకమామిషు! ఈ చెత్త రికార్డును ఛేదించేందుకు బరిలోకి దిగిన రువాండ జట్టు 4 బంతులాడి 8 పరుగులు చేసి గెలిచింది. ఇదే ఏడాది జనవరిలో యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో చైనా నెలకొల్పిన చెత్త రికార్డు (14 ఆలౌట్)ను మాలి సవరించింది.

## నేను పాక్ డైటీషియన్‌ను కాదు: సానియా



**న్యూఢిల్లీ:** భారత్ చేతిలో పరాభవం తర్వాత పాక్ ఆటగాళ్లపై తీవ్రస్థాయిలో అటు అభిమానులు, ఇటు పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు విరుచుకుపడుతున్నారు. ఈ విమర్శల తాకిడి షోయబ్ మాలిక్ భార్య, భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జాను తాకాయి. నైట్ క్లబ్‌లో షోయబ్ సహా పలువురు క్రికెటర్లతో ఆమె డైనింగ్ టేబుల్ పంచుకున్న ఫొటోపై పాకిస్తాన్ నటి వీణా మాలిక్ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. 'మీ అబ్బాయిని కూడా తీసుకెళ్లావా? జాగ్రత్త... జంక్ ఫుడ్ ఆటగాళ్లకు మంచిదికాదన్న సంగతి ప్లేయర్‌వైన నీకు తెలియదా' అని సానియాను దెప్పిపొడుస్తూ వీణా మాలిక్ ట్వీట్ చేసింది. దీనికి టెన్నిస్ స్టార్ స్పందించింది. 'వీణా... నేను నా కుమారుణ్ని అక్కడికి తీసుకెళ్లలేదు. వాడినెలా చూసుకోవాలో నీకంటే, అందరికంటే నాకే బాగా తెలుసు. ఇకపోతే నేనేమీ పాక్ జట్టు డైటీషియన్‌ను (పోషకాహార నిపుణులు) కాదు. ప్రిన్సిపాల్‌నో, టీచర్‌నో అంతకంటే కాదు. నీ స్థానంలో నేను ఉండి ఉంటే మ్యాగజిన్ కవర్‌పై ప్రచురితమైన నీ అశ్లీల చిత్రాలు నీ పిల్లలకు ఎంత ప్రమాదకరమో అనే విషయం గురించి ఆలోచించేదాన్ని' అని ట్వీట్ చేసింది. ఈ వ్యవహారంపై సానియా భర్త షోయబ్ నిర్వేదం చెందాడు. ఆటగాళ్ల కుటుంబ సభ్యుల్ని కూడా విమర్శించడం తగదని హితవు పలికాడు. 'మేం మ్యాచ్ ముందురోజు క్లబ్‌కు వెళ్లలేదు. రెండ్రోజుల ముందు వెళ్లిన ఫొటో అది. దాన్ని పట్టుకొని నిందించడమేంటి. 20 ఏళ్లుగా పాక్ క్రికెట్‌కు సేవలందించిన నన్ను ఇలా అవమానిస్తే ఎలా' అని అసంతృప్తి వ్యక్తం చేశాడు.

## భారత్ 11 ఫిజీ 0

**హిరోషిమా:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) మహిళల సిరీస్ ఫైనల్స్ టోర్నీలో భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అదరగొట్టే ప్రదర్శన కనబర్చింది. మంగళవారం మన మహిళల జట్టు 11–0తో ఫిజీని చిత్తుచేసి టోర్నీ సెమీ ఫైనల్‌కు చేరింది. గుర్జీత్ కౌర్ హ్యాట్రిక్ సహా నాలుగు (15, 19, 21, 22వ నిమిషాల్లో) గోల్స్ చేయగా, మోనిక (11వ, 33వ ని.) రెండు గోల్స్ కొట్టింది. లాల్రెమ్‌సియామి (4వ ని.) జట్టు స్కోరు ఖాతా తెరవగా... కెప్టెన్ రాణి రాంపాల్ (10వ ని.), వందనా కటారియా (12వ ని.), లిలిమా మింజ్ (51వ ని.), నవ్‌నీత్ కౌర్ (57వ ని.) తలా ఒక గోల్ చేశారు. మ్యాచ్ ఆసాంతం ఆధిపత్యం కనబర్చిన భారత్... ఏకంగా 74 సార్లు ప్రత్యర్థి రక్షణ వలయంలోకి చొచ్చుకెళ్లింది. తొలి క్వార్టర్‌లోనే 5–0 ఆధిక్యంలోకి వెళ్లిన భారత మహిళలను ఫిజీ ఏ దశలోనూ అడ్డుకోలేకపోయింది. ఈ క్రమంలో గుర్జీత్ మూడు పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలిచి జట్టు స్కోరును పెంచింది. శనివారం భారత్ సెమీస్ ఆడనుంది.


గుర్జీత్ కౌర్

# లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా

- ఎన్డీయే అభ్యర్థిగా కోట ఎంపీ
- తీర్మానానికి ఎన్డీయే పక్షాలు, వైఎస్సార్‌సీపీ మద్దతు
- బిర్లాకే తమ మద్దతన్న కాంగ్రెస్ సహా యూపీఏ పక్షాలు
- నేడు లాంఛనంగా ఎన్నిక



స్పీకర్ పదవికి ఎన్‌డీఏ అభ్యర్థిగా ఎంపికైన సందర్భంగా ఓం బిర్లాకు మిఠాయిలు తినిపిస్తున్న కుటుంబసభ్యులు

**న్యూఢిల్లీ:** లోక్‌సభ స్పీకర్‌గా బీజేపీ తరఫున రెండు సార్లు ఎంపీగా గెలిచిన ఓం బిర్లా ఎన్నికకు రంగం సిద్ధమయ్యింది. బుధవారం స్పీకర్ పదవికి ఎన్నిక జరగనున్న సంగతి తెలిసిందే. ఈ పదవికి ఎన్డీయే అభ్యర్థిగా బిర్లాను ఖరారు చేసిన బీజేపీ.. ఆ మేరకు ఆయన పేరును ప్రతిపాదిస్తూ, అలాగే ఆయన ఎన్నిక కోసం తీర్మానం ప్రవేశపెట్టేందుకు గాను ఇప్పటికే లోక్‌సభ సెక్రటేరియట్‌కు నోటీసు ఇచ్చింది. ఏఐఏడీఎంకే సహా ఎన్డీయే పక్షాలు, వైఎస్సార్‌సీపీ, బిజూ జనతాదళ్ ఈ తీర్మానానికి మద్దతు పలికాయి. దిగువ సభలో ఎన్డీయేకి పూర్తి మెజారిటీ ఉండటం, అంతేగాక యూపీఏ పక్షాలు సైతం బిర్లాకే మద్దతు ప్రకటించడంతో స్పీకర్‌గా ఆయన ఎన్నిక ఇక లాంఛనం మాత్రమే. స్పీకర్ పదవికి నామినేషన్ దాఖలు చేసేందుకు మంగళవారమే చివరి రోజు. కాగా కాంగ్రెస్‌తో పాటు మిగతా యూపీఏ పక్షాలు ఎన్డీయే అభ్యర్థికే మద్దతు పలకాలని నిర్ణయించుకున్నట్లు కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి మంగళవారం చెప్పారు. సాయంత్రం జరిగిన యూపీఏ పక్షాల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. డిప్యూటీ స్పీకర్ అంశంపై మాత్రం ఆయన మౌనం వహించారు. కాంగ్రెస్, విపక్షాలు దీనిపై వేచి చూసే ధోరణిలో ఉన్నాయి.

**మోదీ చాయిస్!**

స్పీకర్‌గా ఓం బిర్లా పేరును ప్రధాని మోదీ ప్రతిపాదించినట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా లోక్‌సభ స్పీకర్ పదవి విషయంలో సీనియర్ నేతలను పరిగణనలోకి తీసుకుంటారు. అయితే మొదటిసారిగా లేదా రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన వారూ ఈ పదవిని చేపట్టిన సందర్భాలు గతంలో ఉన్నాయి. 2002లో స్పీకర్‌గా ఎన్నికైనా మురళీ మనోహర్ జోషి అప్పుడు తొలిసారి ఎంపీగా గెలిచారు. ఆయన తర్వాత ఆ పదవి చేపట్టిన జీఎంసీ బాలయోగి అప్పటికి రెండుసార్లు మాత్రమే ఎంపీగా ఎన్నికయ్యారు. అయినప్పటికీ బిర్లాను బీజేపీ స్పీకర్ పదవికి ఎంపిక చేయడం ఒకింత ఆశ్చర్యకరమేనని చెప్పాలి. వరసగా రెండోసారి అధికారం చేపట్టిన ఉత్సాహంలో ఉన్న మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాలు మరోసారి తమ మార్క్ ప్రదర్శించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక పార్టీలో కానీ, చట్టసభల్లో కానీ కురువృద్ధులకు స్థానం ఉండదన్న సంకేతాలు 17వ లోక్‌సభకు స్పీకర్‌గా బిర్లాను ఎంపిక చేయడం ద్వారా బలంగా పంపారని అంటున్నారు. అలాగే పైకి కన్పించకపోయినా క్షేత్ర స్థాయిలో బాగా పనిచేసేవారికి పార్టీ ప్రాధాన్యమిస్తుందనడానికి కూడా ఇది సంకేతమని చెబుతున్నారు.

### రెండుసార్లు ఎంపీ

రాజస్తాన్‌లోని కోట–బూందీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 57 ఏళ్ల బిర్లా మొత్తం మీద రెండుసార్లు ఎంపీగా, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. స్పీకర్‌గా ఎన్నికైతే ఎనిమిది సార్లు ఎంపీగా గెలిచిన సుమిత్రా మహాజన్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. బిర్లా బీజేపీకి సంప్రదాయ ఓటు బ్యాంకుగా ఉన్న మార్వారి బనియా సామాజిక వర్గానికి చెందినవారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ యూనియన్ నాయకుడిగా ఉండగానే ఆయనలో తెలివితేటలు, సృజనాత్మకత బీజేపీ పెద్దలకి అర్థమయ్యాయి. 2003లో మొట్టమొదటి సారిగా కోట నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. చురుకైన నేతగా, అప్పగించిన పని కంటే ఎక్కువ కష్టపడే వ్యక్తిగా అధిష్టానం వద్ద గుర్తింపు ఉంది. సవాళ్లను స్వీకరించడంలో ఆయనకు ఆయనే సాటి. సభ నియమ నిబంధనలను క్షుణ్ణంగా ఆకళింపు చేసుకున్నారు. స్పీకర్ పదవికి బిర్లా అర్హుడనే వ్యాఖ్యలు బీజేపీ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

# లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్

**పార్టీ చీఫ్ విప్‌గా కె.సురేశ్ నియామకం**



మంగళవారం ఢిల్లీలో సోనియాను కలిసిన అధిర్ రంజన్

**న్యూఢిల్లీ:** పశ్చిమబెంగాల్‌కు చెందిన సీనియర్ లోక్‌సభ సభ్యుడు అధిర్ రంజన్ చౌధురి లోక్‌సభలో కాంగ్రెస్ నేతగా నియమితులయ్యారు. అదేవిధంగా, పార్టీ చీఫ్ విప్‌గా కేరళకు చెందిన కె.సురేశ్‌ను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. ఈ నియామకపు ఉత్తర్వులను లోక్‌సభ సెక్రటేరియట్‌కు పార్టీ వర్గాలు అందజేశాయి. ఇప్పటి వరకు ఐదుసార్లు ఎంపీ అయిన అధిర్ రంజన్ ఇటీవలి ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా బెహరంపూర్ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. లోక్‌సభలో పార్టీ నేతగా తనను నియమించడంపై అధిర్ రంజన్ కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నెరవేర్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని విలేకరులతో అధిర్ అన్నారు. సామాన్య ప్రజల తరఫున పార్లమెంట్‌లో గళం వినిపిస్తానన్నారు. కేరళలోని మావెలిక్కర నుంచి ఎన్నికైన సురేశ్ కూడా పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు వారిద్దరూ యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ నివాసంలో సీనియర్ నేతలతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. సాయంత్రం యూపీఏ నేతలతో కలిసి వారంతా పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. 1999 నుంచి అధిర్ రంజన్ చౌధురి వరుసగా లోక్‌సభకు ఎన్నికవుతూ వస్తున్నారు. అంతకుముందు 1996–1999 సంవత్సరాల్లో ఆయన శాసనసభ్యుడిగా ఉన్నారు. యూపీఏ హయాంలో కేంద్రమంత్రిగా చేశారు. గత లోక్‌సభలో కాంగ్రెస్ నేతగా ఉన్న మల్లికార్జున్ ఖర్గే ఇటీవలి ఎన్నికల్లో ఎన్నికల్లో ఓటమి పాలు కావడంతో కాంగ్రెస్ తాజా నియామకం చేపట్టింది. ప్రతిపక్ష నేత అర్హత సాధించేందుకు అవసరమైన 10 శాతం సీట్లు కాంగ్రెస్‌కు లోక్‌సభలో లేకపోవడంతో ఆ హోదా దక్కలేదు. ఇలాంటి పరిణామం ఎదురుకావడం ఆ పార్టీకి వరుసగా ఇది రెండోసారి.

# ‘జమిలి’పై భేటీకి మమత డుమ్మా

- ఈ అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- ఇంకా ఎటూ తేల్చని కాంగ్రెస్



**న్యూఢిల్లీ/కోల్‌కతా:** జమిలి ఎన్నికల నిర్వహణ అంశంపై జరిగే 19వ తేదీన జరిగే సమావేశానికి పంపిన ఆహ్వానాన్ని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తిరస్కరించగా కాంగ్రెస్, మిగతా ప్రతిపక్ష పార్టీలు ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోలేదు. ఏక కాలంలో ఎన్నికలతో పాటు కీలకమైన అంశాలపై చర్చించేందుకు జరిగే ఈ సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభల్లో కనీసం ఒక సభ్యుడున్న అన్ని రాజకీయ పార్టీలను ప్రధాని మోదీ ఆహ్వానించారు. మహాత్మాగాంధీ 150వ వర్ధంతి, 2022లో జరిగే 75వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలపైనా ఈ భేటీలో చర్చించనున్నారు.హడావుడిగా ఇలా సమావేశం జరపడం కంటే ఏకకాలంలో ఎన్నికలపై ముందుగా శ్వేతపత్రం విడుదల చేసి, పార్టీలు, నిపుణులతో సంప్రదింపులు జరపాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖామంత్రి ప్రహ్లాద్ జోషికి మంగళవారం మమత లేఖ రాశారు. అలా చేసినప్పుడే చాలా కీలకమైన ఈ అంశంపై తాము నిర్దిష్టమైన సలహాలు ఇవ్వగలుగుతామన్నారు. సాధారణ ఎన్నికల అనంతరం అధికార టీఎంసీని వీడి బీజేపీలో చేరిన నేతలపై సీఎం మమతా బెనర్జీ మండిపడ్డారు. పార్టీ మారిన వారంతా అత్యాశపరులు, అవినీతిపరులని, ఆ చెత్తను బీజేపీ ఏరుకుంటోందని వ్యాఖ్యానించారు. ఇంకా ఎవరైనా వెళ్లాలనే ఆలోచనలో ఉంటే అలాంటి వారు తొందరగా వెళ్లిపోవాలని కోరారు.. కాగా, ఈ సమావేశంలో పాల్గొనే అంశంపై చర్చించేందుకు బుధవారం ఉదయం సమావేశం కావాలని కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీల నేతలు నిర్ణయించారు. ప్రజాధనం ఆదా చేసేందుకు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించేందుకు లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల ఎన్నికలను ఒకేసారి జరపడం మేలంటూ గత ఆగస్టులో లా కమిషన్ సిఫారసు చేసింది. కాగా, ఎన్నికల్లో బీజేపీ 303 ఎంపీలతో అతిపెద్ద పార్టీగా అవతరించగా వరుసగా కాంగ్రెస్ (52), డీఎంకే (23), వైఎస్ఆర్ కాంగ్రెస్(22), టీఎంసీ(22) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# నినాదాలు .. వాగ్వాదాలు

## రెండోరోజు సోనియా, ములాయం ప్రమాణం



ఎంపీగా ప్రమాణం చేస్తున్న సోనియాగాంధీ

లోక్‌సభ సమావేశాల రెండోరోజు మంగళవారం యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, సమాజ్‌వాదీ పార్టీ నేత ములాయంసింగ్ తదితరులు సభ్యులుగా ప్రమాణంచేశారు. సభ్యుల ప్రమాణం సందర్భంగా అధికార, విపక్షాల సభ్యులు పెద్దయెత్తున నినాదాలతో పోటీ పడ్డారు. సోనియా హిందీలో ప్రమాణం చేస్తుండగా విపక్ష బెంచీల్లో ఉన్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరిస్తూ కన్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు బల్లలు చరుస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తే.. మరోవైపు బీజేపీ సభ్యులు సోనియా హిందీలో ప్రమాణం చేసినందుకు అభినందించడం విన్పించింది. ఆ తర్వాత వెంటనే బీజేపీ ఎంపీ మేనకా గాంధీ ప్రమాణం చేయగా సోనియా, మేనక ఇద్దరూ ముకుళిత హస్తాలతో ఒకరినొకరు పలుకరించుకున్నారు. కుమారుడు అఖిలేష్ యాదవ్ తోడురాగా అస్వస్థత కారణంగా వీల్ చైర్‌లో సభలోకి వచ్చిన 79 ఏళ్ల ములాయంను ఆయన సీట్లోనుంచే ప్రమాణం చేసేందుకు అనుమతించారు. కాగా ఓం బిర్లా సభలో ప్రవేశించినప్పుడు, ఆయన ప్రమాణం చేసేందుకు లేచినప్పుడు చప్పట్లు మార్మోగాయి. కొత్తగా ఎన్నికైనా సభ్యులు కొందరు చేసిన నినాదాలు సభ్యుల మధ్య వాగ్వాదానికి దారితీశాయి. ఎవరికి ఇష్టమొచ్చినట్టుగా వారు నినదించడంతో.. నినాదాలేవీ రికార్డుల్లోకి వెళ్లవని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. విపక్షాల సభ్యులు ముఖ్యంగా టీఎంసీ ఎంపీలు ప్రమాణ స్వీకారానికి లేచినప్పుడు బీజేపీ సభ్యులు ‘భారత్ మాతా కీ జై’, ‘జై శ్రీరామ్’అంటూ నినదించారు. ఇందుకు ప్రతిగా టీఎంసీ నేతలు ‘జై మా దుర్గ’, ‘జై బెంగాల్’, ‘జై మమత’, ‘జై హింద్’అంటూ నినాదాలు చేశారు. ఒకదశలో రాహుల్ ‘మరొక్కసారి’, ‘మరొక్కసారి’అని బీజేపీ సభ్యులనుద్దేశించి అన్నారు. కాగా నటుడు, మొదటిసారి ఎంపీ సన్నీ డియోల్ ప్రమాణంలోని ‘అప్‌హోల్డ్’పదాన్ని ‘విత్‌హోల్డ్’గా చదివి ఆ తర్వాత సరిదిద్దుకున్నారు.

**ఒవైసీ ‘జై భీమ్ .. అల్లాహు అక్బర్’**

అధికార పక్ష సభ్యులు ‘జై శ్రీరామ్’, ‘భారత్ మాతాకీ జై’, ‘వందేమాతరం’అంటూ నినదించడంతో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ‘జై భీమ్, జై మీమ్, తక్బీర్ అల్లాహు అక్బర్, జై హింద్’అని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ భగవంత్ ‘ఇంక్విలాబ్ జిందాబాద్’అంటూ నినదించి అధికార పక్ష సభ్యులతో వాదులాటకు దిగారు.



పెద్ద రెక్కలున్న కందిరీగ టోపీ భలేగా ఉందికదా. చిత్రమైన డిజైన్ టోపీ పెట్టుకున్న ఈ ముద్దుగుమ్మకు గుర్రాల రేస్ అంటే మహాఇష్టం. అందుకే మంగళవారం బ్రిటన్‌లోని ఆస్కట్‌లో జరిగిన హార్స్‌రేస్ ప్రోగ్రామ్‌కు ఇలా వెరైటీ క్యాప్‌తో వచ్చింది

## డ్రైవింగ్ లైసెన్స్‌కు విద్యార్హతతో పనిలేదు!

**న్యూఢిల్లీ:** డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి ఉండే కనీస విద్యార్హతను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రవాణా వాహన డ్రైవర్ల ఉద్యోగావకాశాలు పెంపొందించే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంగళవారం తెలిపింది. ప్రస్తుతం కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు–1989లోని 8వ నిబంధన ప్రకారం రవాణా వాహనం నడిపే డ్రైవర్ కనీసం 8వ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలి. ‘ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన, నైపుణ్యం కలిగిన వ్యక్తులకు ప్రయోజనం చేకూరేలా కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి కనీస విద్యార్హత తొలగించాలని నిర్ణయించింది’అని ఒక అధికారిక ప్రకటనలో వెలువడింది. దీంతో పెద్ద మొత్తంలో నిరుద్యోగులు, ముఖ్యంగా యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, రవాణా రంగంలో ఉన్న దాదాపు 22 లక్షల మంది డ్రైవర్లు ప్రయోజనం పొందుతారని ఆ ప్రకటన పేర్కొంది.

## మోదీ బడ్జెట్ సన్నాహక భేటీ

**న్యూఢిల్లీ:** మోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం రెండోసారి కొలువుదీరాక, తొలిసారిగా జూలై 5న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో బడ్జెట్ సన్నాహక సమావేశం మోదీ మంగళవారం నిర్వహించారు. ఆర్థిక, ఇతర మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, నీతి ఆయోగ్ అధికారులతోనూ మోదీ సమావేశమయ్యారు. ఉద్యోగ కల్పన, ఆర్థిక వృద్ధే ప్రధాన లక్ష్యాలుగా 100 రోజుల ఎజెండాను రూపొందించడంపై భేటీ ఏర్పాటు చేశారు. వ్యాపార నిర్వహణను సులభంచేయడం, తద్వారా ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిన పెట్టడానికి అవసరమైన చర్యల గురించి మాట్లాడినట్లు సమాచారం.

## 1,610కోట్ల విలువైన వాహనాలు అటాచ్

**న్యూఢిల్లీ:** బ్యాంకు రుణం తీసుకుని మోసగించడంతో పాటు నగదు అక్రమ రవాణాకు సంబంధించి సూరత్‌కు చెందిన ఒక కంపెనీ, దాని ప్రమోటర్లపై దాఖలైన కేసులో రూ.1,610 కోట్ల విలువైన 6 వేలకుపైగా వాహనాలను అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. నగదు అక్రమ రవాణా నిరోధక చట్టం కింద సిద్ధి వినాయక లాజిస్టిక్స్ లిమిటెడ్, ఆ కంపెనీ డైరెక్టర్ రూప్‌చంద్ బైడ్‌ల ఆస్తుల అటాచ్‌కు ఈడీ తాత్కాలిక ఉత్తర్వు జారీ చేసింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రుణ (రూ.836.29 కోట్లు) మోసం కేసులో అక్రమ నగదు రవాణాతో పాటు, అందుకు సహకరించడంలో రూప్‌చంద్ పాత్రకు సంబంధించిన కేసులో ఈడీ గతంలో ఒకసారి అతన్ని అరెస్టు చేసింది.

## నితీశ్‌ను తాకిన మెదడువాపు సెగ

**ముజఫర్‌పూర్/పట్నా:** మెదడువాపు వ్యాధితో తమ పిల్లలను కోల్పోయిన బాధలో ఉన్న తల్లిదండ్రులు ఆస్పత్రిని సందర్శించిన బిహార్ సీఎం నితీశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముజఫర్‌పూర్ జిల్లాలో ఇప్పటి వరకూ 100 మందికి పైగా పిల్లలు మెదడువాపు వ్యాధితో మరణించడం తెల్సిందే. వ్యాధి వ్యాప్తిపై పట్నాలో అధికారులతో భేటీ తర్వాత నితీశ్ ముజఫర్‌పూర్‌లోని ఆస్పత్రి ఐసీయూలోకి వెళ్లారు. దీంతో అక్కడ కొందరు ‘నితీశ్ గో బ్యాక్’ అంటూ నినాదాలు చేశారు. నితీశ్ ఐసీయూలోకి రాగానే పిల్లల తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మా బిడ్డలను కాపాడండి సారూ అంటూ భోరున విలపించారు. నితీశ్ వారిని పరామర్శించి బిడ్డల పరిస్థితిని గురించి డాక్టర్ల వద్ద వాకబు చేశారు. త్వరలోనే కృష్ణా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌ను 600 పడకల స్థాయి నుంచి 2,500 పడకల స్థాయికి చేరుస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీపక్ కుమార్ చెప్పారు.

# తొందర్లోనే వెళ్లగొడతాం

**అక్రమ వలసదారులనుద్దేశించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్**



**వాషింగ్టన్:** అమెరికాలో ఉన్న లక్షలాది మంది అక్రమ వలసదారులను త్వరలోనే వెళ్లగొడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. వచ్చే వారమే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. వలసదారుల్ని వెనక్కి తీసుకునేందుకు ఉద్దేశించిన ఒప్పందంపై సంతకం చేసేందుకు గ్వాటెమాలా అంగీకరించిందన్నారు. ‘అక్రమమార్గాల్లో వచ్చిన వారిని వెళ్లగొట్టేందుకు ఉద్దేశించిన ప్రక్రియను వచ్చే వారం ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ(ఐసీఈ) ప్రారంభించనుంది. ఎంత వేగంగా వచ్చారో అంతే వేగంతో వాళ్లు వెళ్లిపోతారు’ అని ట్వీట్‌చేశారు. ‘తమ దేశం మీదుగా అమెరికాలో ప్రవేశించిన వారిని వెనక్కి తీసుకునేందుకు ఉద్దేశించిన ఒప్పందంపై త్వరలోనే గ్వాటెమాలా సంతకం చేయనుంది. ఆ వలసదారులు ఆశ్రయం కోసం ఇకపై అమెరికాకు బదులు గ్వాటెమాలాలోనే దరఖాస్తు చేసుకుంటారు’ అని ట్రంప్ పేర్కొన్నారు. మధ్య అమెరికాలో దేశాల్లో అశాంతి కారణంగా అక్కడి ప్రజలు గ్వాటెమాలాకు, మెక్సికోకు అక్కడి నుంచి అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల సాయం నిలిపి వేస్తామంటూ మెక్సికోను భయపెట్టి మరీ అమెరికా ఒప్పందానికి దిగేలా చేసింది. దాని ప్రకారం వలసదారులను నిలువరించేందుకు అమెరికాతో సరిహద్దుల్లో మెక్సికో అదనంగా 6వేల మంది గార్డులను నియమించింది. దీంతోపాటు తమ దేశం గుండా ప్రవేశించిన వారిని వెనక్కి తీసుకునేందుకు కూడా అంగీకరించింది. అమెరికా, గ్వాటెమాలా త్వరలో ఇలాంటి ఒప్పందమే కుదుర్చుకోనున్నాయి. దేశంలో అక్రమంగా ఉంటున్న దాదాపు 10లక్షల మందిని వెనక్కి పంపించేయాలన్న కోర్టుల ఉత్తర్వుల్ని అమలు చేసేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.

**హెచ్–4 వీసా రద్దు మరింత ఆలస్యం**

అమెరికాలో ఉండే భారత ఐటీ నిపుణుల జీవిత భాగస్వాములు ఉద్యోగాలు చేసుకునేందుకు వీలు కల్పించే హెచ్–4 వీసా విధానం మరి కొంతకాలం కొనసాగనుంది. రద్దు ప్రక్రియకు సంబంధించిన చట్ట రూపకల్పన ఇంకా పూర్తి కాలేదని అధికారులు అంటున్నారు. హెచ్–4 సహా ఉద్యోగ ఆధారిత వీసా విధానాలన్నిటిపై సమీక్ష కొనసాగుతోందని యూఎస్ సిటిజన్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) తెలిపింది.

### పశ్చిమాసియాకు అమెరికా సైనికులు

ఇరాన్‌తో అమెరికా సంబంధాల్లో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్న నేపథ్యంలో మరో వెయ్యి మంది సైనిక సిబ్బందిని పశ్చిమాసియా ప్రాంతానికి పంపేందుకు అమెరికా ఆమోదం తెలిపింది. గగన, సముద్ర, భూతలంలో ఉన్న ప్రమాదాలను ఎదుర్కొనేందుకు పశ్చిమాసియాకు కొత్తగా వెయ్యి మందిని పంపుతున్నట్లు అమెరికా తాత్కాలిక రక్షణ మంత్రి ప్యాట్రిక్ షనాహన్ చెప్పారు. అణు ఒప్పందంలో నిర్దేశించిన దానికన్నా అధికంగా యురేనియంను తాము వచ్చే పది రోజుల్లోనే నిల్వచేయనున్నామంటూ ఇరాన్ ప్రకటించిన కొద్దిసేపటికే అమెరికా ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అణు ఒప్పందం నుంచి అమెరికా ఇప్పటికే బయటకు రావడం తెలిసిందే.

# 15 మంది కస్టమ్స్ ఆఫీసర్లపై వేటు

- ఆదాయానికి మించిన ఆస్తులే కారణం
- వైజాగ్ జీఎస్టీ జోన్ అధికారి కూడా

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం మరోమారు అధికారులపై కొరడా ఝుళిపించింది. అవినీతి, అధికార దుర్వినియోగం వంటి కారణాలతో ఇటీవల ఆదాయపన్ను అధికారులపై వేటు వేసిన ప్రభుత్వం ఇప్పుడు కస్టమ్స్, ఎక్సైజ్ అధికారులపై వేటువేసింది. అవినీతి, ముడుపులు అందుకున్నారన్న ఆధారాలతో ప్రభుత్వం మంగళవారం 15 మంది సీనియర్ కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ ఆఫీసర్లను విధుల నుంచి తొలగించింది. అందులో ఒకరు ప్రిన్సిపల్ కమిషనర్ హోదా ఉన్న అధికారి కావడం గమనార్హం. వీరిలో కొందరు ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్నారు. ముడుపులు అందుకోవడం, ప్రభుత్వ సొమ్మును కాజేయడం, ఆదాయానికి మించిన ఆస్తులు ఉండడం వంటి అభియోగాలతో సీబీఐ ఇప్పటికే వారిపై కేసులు నమోదు చేసిందని ఆర్థిక శాఖాధికారులు పేర్కొన్నారు. వీరిలో ప్రిన్సిపల్ ఏడీజీగా పని చేస్తున్న అనూప్ శ్రీవాస్తవపై 1996లో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఓ సొసైటీకి భూమిని కొనుగోలు చేయడానికి సహకరించారని సీబీఐ కేసు నమోదు చేసింది. జాయింట్ కమిషనర్ నళిన్ కుమార్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో చిక్కుకున్నారు. ఫండమెంటల్ రూల్స్, క్లాస్ జే లోని 56వ నిబంధనను ఉపయోగించి రాష్ట్రపతి వీరిని తొలగించారు. రానున్న మూడు నెలల పాటు యధావిధిగా వేతనాలు అందుతాయని తెలిపారు. మూడు నెలల ముందు నోటీసులు ఇచ్చి ప్రభుత్వ అధికారులను తొలగించే హక్కు రాష్ట్రపతికి ఉంటుంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో చెన్నై కమిషనర్ జీ శ్రీ హర్షలను సీబీఐ వలపన్ని పట్టుకుంది. వీరితో పాటు కమిషనర్ ర్యాంక్ ఆఫీసర్లు అతుల్ దీక్షిత్, వినయ్ బ్రిజ్ సింగ్‌లు ఉన్నారు. ఢిల్లీ జీఎస్టీ పరిధిలోని డిప్యూటీ కమిషనర్ అమ్రేశ్ జైన్, భువనేశ్వర్ జీఎస్టీ జోన్‌కు చెందిన ఎస్ ఎస్ బిష్త్, ముంబై జీఎస్టీ జోన్‌కు చెందిన వినోద్ సంగా, వైజాగ్ జీఎస్టీ జోన్‌కు చెందిన రాజు శేఖర్, అలహాబాద్ జీఎస్టీ జోన్‌కు చెందిన మొహమ్మద్ అల్తాఫ్‌లు ఉన్నారు. వీరితో పాటు డైరెక్టరేట్ ఆఫ్ లాజిస్టిక్స్ డిప్యూటీ కమిషనర్ అశోక్ అశ్వాల్ కూడా ముందస్తు పదవీవిరమణ చేయాలని ప్రభుత్వం ఆర్డర్ జారీ చేసింది.

# చైనాలో వరుస భూకంపాలు

**12 మంది మృతి**



భూకంపం ధాటికి కుప్పకూలిన ఓ భవంతి

**బీజింగ్:** చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో రెండు వరుస భూకంపాలు సంభవించాయి. ఈ భూకంపాల్లో 12 మంది మృతి చెందగా 125 మంది గాయపడ్డారని అత్యవసర నిర్వహణ మంత్రిత్వ శాఖ తెలిపింది. సోమవారం రాత్రి 10:55 గంటలకు (స్థానిక కాలమానం) రిక్టర్ స్కేలుపై 6.0 తీవ్రతతో మొదటి భూకంపం రాగా, రెండవది మంగళవారం సంభవించిందని చైనా భూకంప విభాగం తెలిపింది. చాంగింగ్ కౌంటీలోని యిబిన్ నగరానికి దగ్గర్లో భూమికి 16 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంప తీవ్రతకు యిబిన్, జుయోంగ్ పట్టణాల మధ్య ఉన్న రహదారి బీటలు వారడంతో ఆ దారిని మూసివేశారు. దాదాపు ఒక నిమిషం పాటు భవనాలు ఊగాయని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ఈ ఊగిసలాట కారణంగా పలు భవనాలు కూలిపోయాయని అధికారులు తెలిపారు. మరణాల్లో అత్యధిక శాతం భవనాల కింద చిక్కుకొన్నవారివే ఉన్నాయన్నారు. గాయాలపాలైన 53 మందిని చాంగింగ్‌లోని ఆస్పత్రిలో చేర్చారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయని రక్షక బృందం తెలిపింది.

# జన విస్ఫోటం

భారత్‌లో జనాభా రోజురోజుకీ పెరిగిపోతోంది. చైనాను దాటి నంబర్‌వన్ స్థానంలోకి రావడానికి మరెంతో కాలం పట్టేలాలేదు. మరో ఎనిమిదేళ్లలోనే అంటే 2027 నాటికి చైనా జనాభాను భారత్ దాటేస్తుందని ఐక్యరాజ్య సమితి అంచనా వేస్తోంది. 2019–50 మధ్యనాటికి భారత్‌లో జనాభా 27.3 కోట్లు అదనంగా పెరుగుతుందని, ఈ శతాబ్దం చివరివరకు భారతే ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా కొనసాగుతుందని ఒక నివేదికలో వెల్లడించింది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఆర్థిక సామాజిక వ్యవహారాల సంస్థకు అనుబంధంగా ఉండే జనాభా విభాగం ‘ప్రపంచ జనాభా అంచనాలు–2019’ పేరిట ఒక నివేదికను విడుదల చేసింది.

**ఈ నివేదికలోని ఇతర ముఖ్య అంశాలు..**

- ప్రస్తుతం భారత్ జనాభా 137 కోట్లయితే, చైనా జనాభా 143 కోట్లుగా ఉంది.
- ప్రపంచవ్యాప్తంగా జనాభా 2019–50 మధ్య నాటికి మరో 200 కోట్లు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.
- ప్రస్తుత ప్రపంచ జనాభా770 కోట్ల నుంచి 2050 నాటికి 970 కోట్లకు చేరుకోవచ్చు.
- 2010 నుంచి లెక్కలు తీస్తే 27 దేశాల్లో జనాభా ఒక్క శాతం తగ్గుతూ వస్తోంది.
- కొన్ని దేశాల్లో రికార్డు స్థాయిలో జనాభా తగ్గిపోవడానికి సంతాన సాఫల్యత తగ్గిపోవడం, ఒక దేశం నుంచి మరో దేశానికి వలసలు పెరిగిపోవడమే కారణం.
- 2050 నాటికి చైనాలో జనాభా అత్యధికంగా తగ్గిపోతుంది. ఏకంగా 2.2 శాతం తగ్గుదల ఉంటుంది. అంటే చైనా జనాభా 3.14 కోట్లు తగ్గితే అదే సమయంలో భారత్‌లో జనాభా 27.3 కోట్లు పెరగనుంది.

**2027 నాటికి అత్యధిక జనాభా కలిగిన టాప్ 5 దేశాలు**

| | |
|---|---|
| భారత్ | 150 కోట్లు |
| చైనా | 110 కోట్లు |
| నైజీరియా | 73.3 కోట్లు |
| అమెరికా | 43.4 కోట్లు |
| పాకిస్తాన్ | 40.3 కోట్లు |

- 2050 నాటికి జనాభా పెరిగే తొమ్మిది దేశాల జాబితాలో భారత్ మొదటి స్థానంలో నిలుస్తుంది.
- 2050 నాటికి 65 ఏళ్లకు పైబడిన వారు చాలా ఎక్కువగా ఉంటారు. ప్రస్తుతం ప్రతీ 11 మందిలో ఒకరు 65 ఏళ్లకు పైబడి ఉంటే 2050 నాటికి ప్రతీ ఆరుగురిలో ఒకరు 65 ఏళ్ల వయసు దాటినవారే ఉంటారు.

**భారతీయ అమెరికన్ల జనాభా పైపైకి**

**మరో 8 ఏళ్లలో చైనాను దాటేస్తాం**



అమెరికాలో ఉంటున్న భారత సంతతి జనాభా గత ఏడేళ్లలో గణనీయంగా పెరిగిందని ఒక సంస్థ అధ్యయనంలో తేలింది. 2010–2017 సంవత్సరాల మధ్య భారత సంతతి జనాభా 38 శాతం మేర పెరిగినట్లు గుర్తించింది. సౌత్ ఏసియన్ అమెరికన్స్ లీడింగ్ టుగెదర్(సాల్ట్) సంస్థ పరిశీలన ప్రకారం.. 2010 భారత సంతతి అమెరికన్లు 31, 83, 063 మంది ఉండగా 2017నాటికి వారి సంఖ్య 44, 02, 363కు పెరిగింది. వారిలో కనీసం 6.30 లక్షల మంది అనధికారికంగా ఉంటున్న వారే. వీసా పరిమితి ముగిసినా అనధికారికంగా అమెరికాలో ఉంటున్న వారి సంఖ్యలో 2010తో పోలిస్తే 72 శాతం పెరుగుదల నమోదైంది. 2016 గణాంకాల ప్రకారం వీసా కాల పరిమితి ముగిశాక కూడా ఉంటున్న భారతీయులు 2.25 లక్షల మంది. 2010–2017 సంవత్సరాల మధ్య కాలంలో అమెరికాలో ఉంటున్న దక్షిణాసియా దేశాల నుంచి వారి సంఖ్య కూడా 35 లక్షల నుంచి 54 లక్షలకు (40 శాతం) పెరిగింది. వీరిలో అత్యధికంగా నేపాలీలు (206.6 శాతం), భారతీయులు(38), భూటానీయులు(38), పాకిస్తానీయులు(33), బంగ్లాదేశీయులు(26), శ్రీలంక వాసులు (15 శాతం) ఉన్నారు. వీరితోపాటు బాల్యంలోనే అమెరికాకు వచ్చి ఇక్కడ ఉండేందుకు అనుమతి పొందిన దక్షిణాసియా దేశాల వారు 4,300 మంది కాగా భారతీయులు అత్యధికంగా 2,550 మంది ఉన్నారు. అమెరికాలో ఉంటున్న 50 లక్షల మంది దక్షిణాసియా వాసుల్లో 10 శాతం అంటే సుమారు 4.72 లక్షల మంది పేదరికంతో బాధపడుతున్నారు. పేదరికంలో ఉన్న భారతీయ అమెరికన్లలో 11 శాతం మంది ప్రభుత్వ సాయం అందుకుంటున్నారు. 1997 తర్వాత హెచ్–4 వీసా పొందిన హెచ్–1బీ వీసా దారుల జీవిత భాగస్వాముల సంఖ్య 17 లక్షలు. వీరిలో 86 శాతం మంది దక్షిణాసియా దేశాల ప్రజలే. 2017లో సుమారు 1.27 లక్షల మంది హెచ్–4 వీసా పొందారని సాల్ట్ తెలిపింది.

సాక్షి బిజినెస్
బుధవారం
19-6-2019
WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 86 ▲ | 19 ▲ |
| 39,046 | 11,692 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం...
www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం.లకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,960 | ▲ 115 |
| డోజోన్స్ | 26,450 | ▲ 338 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,443 | ▲ 86 |
| డాక్స్ | 12,332 | ▲ 246 |
| షాంఘై | 2,890 | ▲ 3 |
| నికాయ్ | 20,973 | ▼ 151 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 69.08 | 70.72 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.00 | 89.11 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.06 | 79.98 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.33 | 65.76 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.80 | 48.97 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.11 | 51.89 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.86 | 19.57 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.29 | 19.80 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.44 | 10.80 |

# ఓ అసమర్థుడి వ్యాపార యాత్ర...

# అయ్యో.. అ‘నిల్’!




**అడాగ్ వ్యాపారాల్లో అనిల్ అంబానీ తప్పటడుగులు**

- 2008లో ప్రపంచంలో టాప్–6 సంపన్నుడు
- ఇపుడేమో ఆయన గ్రూపు విలువ రూ.5,000 కోట్లు
- ప్రమోటర్ల వాటాల్లో సింహ భాగం తాకట్టులోనే
- తనఖాలో లేని అనిల్ వాటాల విలువ రూ.500 కోట్లు
- భవిష్యత్తుపై కూడా భరోసా లేని పరిస్థితి
- సోదరుడు ముకేశ్ సంపద రూ.3.68 లక్షల కోట్లు




**న్యూఢిల్లీ:** ఓడలు బళ్లు అవుతాయన్న సామెత... అడాగ్ గ్రూపునకు అతికినట్టు సరిపోతుంది. ఎందుకంటే 2008లో అడాగ్ గ్రూపు చైర్మన్ అనిల్ అంబానీ గ్రూపు విలువ 42 బిలియన్ డాలర్లు. అంటే సుమారు రూ.2.9 లక్షల కోట్లు. అప్పుడు ప్రపంచంలో అత్యంత సంపద కలిగిన వారిలో అనిల్‌ది 6వ స్థానం. కానీ ఆ తరువాతి 11 ఏళ్లలో అనిల్ అంబానీ ఎన్నెన్నో నిర్ణయాలు తీసుకున్నారు. ఉన్న కంపెనీల నుంచే కొత్త కంపెనీలను సృష్టించారు. విలువ పెంచుతానంటూ రకరకాల వ్యాపారాల్లోకి వచ్చారు. పెరగటం మాట అటుంచి... ఆయన గ్రూపు విలువ అత్యంత దారుణ స్థాయికి పడిపోయి రూ.5,000 కోట్లకు పరిమితమయ్యింది. గడిచిన ఏడాదిన్నరగా అడాగ్ గ్రూపు షేర్లు పతనమవుతూనే ఉన్నాయి. సోమవారం ముగింపు ధరలతో చూసినపుడు అడాగ్ గ్రూపు మార్కెట్ విలువ రూ.6,196 కోట్లు. అయితే మంగళవారం సైతం గ్రూపు కంపెనీల షేర్లు భారీగా 10 నుంచి 20 శాతం మధ్య నష్టపోయాయి. ఈ ప్రకారం ఆయన సంపద రూ.5,000 కోట్లకు దిగినట్టు భావించాలి. దీనికితోడు ప్రమోటర్లు తమ వాటాల్లో అత్యధిక భాగాన్ని తనఖా పెట్టి రుణాలు తీసుకున్నారు. షేర్లు ప్రతి రోజూ కొత్త కనిష్టాలకు పడిపోతుండటంతో రుణాలిచ్చిన సంస్థలు బహిరంగ మార్కెట్లో అడాగ్ గ్రూపు షేర్లను నిలువునా విక్రయించేస్తున్నాయి. ఈ రకంగా చూస్తే అడాగ్ గ్రూపు విలువ చూడటానికి రూ.5వేల కోట్లున్నప్పటికీ... ప్రమోటర్ అనిల్ అంబానీ తాకట్టు పెట్టకుండా ఉంచుకున్న వాటాల విలువ కేవలం రూ.500 కోట్లే ఉంటుందని అంచనా. అంటే 2008 నాటి సంపదలో 98 శాతాన్ని హారతి కర్పూరం చేసేశారు. అనిల్‌తో పాటు ఆయన గ్రూపు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు కూడా... దాదాపు 90 శాతం సంపదను కోల్పోయి కుదేలయ్యారు.

**వారం రోజులు కూడా కాలేదు...**

గడిచిన 14 నెలల కాలంలో రూ.35,000 కోట్ల మేర రుణాలను చెల్లించేశామని, భవిష్యత్తులో అన్ని రుణాలను సకాలంలో చెల్లిస్తామని అనిల్ అంబానీ సరిగ్గా వారం క్రితం ప్రకటించారు. కానీ, ఆ మరుసటి రోజే అంటే గత బుధవారం రిలయన్స్ క్యాపిటల్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ కంపెనీల ఆడిటింగ్ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ ప్రకటించింది. నిధుల మళ్లింపుపై ఆరోపణలు చేసింది. కోరిన సమాచారాన్ని అందించలేకపోయినట్టు పేర్కొంది. దీంతో అనిల్ గ్రూపు కంపెనీలపై మరిన్ని సందేహాలు తలెత్తాయి. సమీప కాలంలో అడాగ్ గ్రూపు షేర్లు కోలుకోకపోవచ్చన్న అంచనాలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గు చూపించారు. మంగళవారం రిలయన్స్ ఇన్‌ఫ్రా 19 శాతం నష్టపోయి రూ.45.80 వద్ద క్లోజవగా, రిలయన్స్ క్యాపిటల్ 11 శాతం నష్టంతో రూ.63.55 వద్ద ముగిసింది. రిలయన్స్ నావల్ అండ్ ఇంజనీరింగ్ 17 శాతానికి పైగా నష్టపోయి రూ.4.65 వద్ద, రిలయన్స్ పవర్ 13 శాతానికి పైగా క్షీణించి రూ.4.57 వద్దకు పడిపోయాయి. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ కూడా 10 శాతం నష్టంతో రూ.11.95కు చేరుకుంది. రిలయన్స్ నిప్పన్ అసెట్ మేనేజిమెంట్ (ఆర్‌నామ్) మాత్రం నష్టం లేకుండా రూ.220.80 వద్ద క్లోజయింది. అయితే ఆర్‌నామ్‌లో మొత్తం వాటాను జపాన్‌కు చెందిన నిప్పన్‌కు అడాగ్ గ్రూపు విక్రయించటం తెలిసిందే.

**వ్యాపారాల విక్రయం...**

రిలయన్స్ క్యాపిటల్‌కు ఉన్న రూ.18,000 కోట్లకుపైగా రుణ భారాన్ని తగ్గించుకునే కార్యక్రమంలో భాగంగా ఆర్‌నామ్‌లో ఉన్న 42.88 శాతానికి వాటాను విక్రయించి బయటపడాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆర్‌నామ్‌లో 10.75 శాతం వాటాను రూ.1,450 కోట్లకు రిలయన్స్ క్యాపిటల్ ఓపెన్ మార్కెట్లో విక్రయించింది. మిగిలిన వాటాను జపాన్‌కు చెందిన భాగస్వామి నిప్పన్ లైఫ్ కొనుగోలు చేయనుంది. బిగ్‌ఎఫ్‌ఎం రేడియోలోనూ వాటాలను రేడియో మిర్చికి విక్రయించేందుకు అనిల్ డీల్ కుదుర్చుకున్నారు. వీటన్నింటికంటే ముందే అత్యంత విలువైన ముంబైలోని విద్యుత్ ట్రాన్స్‌మిషన్ వ్యాపారాన్ని అదానీ గ్రూపునకు అమ్మేశారు. మిగిలిన ఆస్తులు, ప్రాజెక్టులను విక్రయించి రుణ భారాన్ని దింపుకుని అస్సెట్ లైట్ విధానానికి మళ్లనున్నట్టు అనిల్ ఇప్పటికే ప్రకటించేశారు. మరి వ్యాపారాలను విక్రయానికి పెడితే రుణాలు తీర్చడానికి సరిపడా నిధులయినా వస్తాయా? అన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాయి.


PROCESSWEAVER
INTEGRATED SHIPPING
Multi-Carrier Shipping Software
• EPR Shipping Solutions
• Inbound Solutions
• Desktop Shipping Solutions
• E-Commerce Shipping Solutions
Contact : 3 Cube Towers, 5th Floor, Kondapur,Hyderabad, Telangana.
+91 7702522233, sales@processweaver.com


## స్వయంకృతాపరాధం

అప్పట్లో ముకేశ్, అనిల్ ఇద్దరూ రిలయన్స్ సామ్రాజ్యాన్ని చెరిసగం పంచుకున్నారు. ప్రస్తుతం ముకేశ్ అంబానీ సంపద రూ.3.68 లక్షల కోట్లు. ఆయన గ్రూపు విలువైతే 7.5 లక్షల కోట్లపైమాటే. ఇక అనిల్ సంగతి చూస్తే ముకేశ్ సంపదలో 2 శాతం కూడా లేదు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రమోటర్‌గా ముకేశ్ అంబానీకి గత ఆర్థిక సంవత్సరంలో అందుకున్న డివిడెండ్ ఆదాయం రూ.14,500 కోట్లు. కానీ, అనిల్ కంపెనీల విలువ ముకేశ్ డివిడెండ్ ఆదాయం ముందు కూడా నిలబడలేని పరిస్థితి ఏర్పడింది.

దీనికి దారితీసిన కారణాలేంటని ప్రశ్నించుకుంటే... ‘‘ఇది ఆశ, భయం వంటి సాధారణ కథ మాదిరే. రిలయన్స్ కమ్యూనికేషన్ సంక్షోభానికి అధిక రుణాలే కారణం. పైగా సకాలంలో వ్యాపారం నుంచి బయటపడలేదు. ఫలితంగా గ్రూపు కంపెనీలపైనా ఈ ప్రభావం పడింది’’ అని ఐఐఎఫ్‌ఎల్ సెక్యూరిటీస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్ భాసిన్ పేర్కొన్నారు. గ్రూపు 90 శాతం మార్కెట్ విలువను కోల్పోవడంతోపాటు వాటాదారుల నమ్మకాన్ని కూడా దెబ్బతీసిందన్నారు. వ్యాపారాలను తప్పుగా నిర్మించటం, తనఖా ఉంచిన షేర్ల విక్రయాలు వాటాదారులకు కష్టంగా మారినట్టు చెప్పారు. అధిక రుణాలకు తోడు, తక్కువ మార్జిన్లు, తక్కువ క్యాష్ ఫ్లోతో కూడిన వ్యాపారాలే అనిల్ గ్రూపులో 80% ఉన్నట్టు టార్గెట్ ఇన్వెస్టింగ్ వ్యవస్థాపకుడు సమీర్‌కల్రా పేర్కొన్నారు. ‘‘అడాగ్ గ్రూపు వ్యాపారాల్లో పవర్, యుటిలిటీలు, ఎన్‌బీఎఫ్‌సీ ఇప్పటికీ ఆకర్షణీయంగా ఉన్నాయి. అయితే, వీటిల్లో కొన్ని ఆస్తులను వేగంగా విక్రయించడంపైనే భవిష్యత్తు ఆధారపడి ఉంది’’ అని భాసిన్ పేర్కొన్నారు. రానున్న బడ్జెట్ ఈ గ్రూపు పరిస్థితిని మార్చేది కావచ్చన్నారు.



**అనిల్ కంపెనీల షేర్ల ధరలు**

| కంపెనీ పేరు | 18/6 ధర | ఏడాది గరిష్ట ధర |
|---|---|---|
| రిలయన్స్ క్యాపిటల్ | 64 | 488 |
| రిలయన్స్ ఇన్‌ఫ్రా | 46 | 489 |
| ఆర్‌కామ్ | 1 | 22 |
| రిలయన్స్ పవర్ | 5 | 39 |
| రిలయన్స్ నావల్ | 5 | 21 |
| రిలయన్స్‌హోమ్‌ఫైనాన్స్ | 12 | 77 |

## అడాగ్ కంపెనీల పతనం ఇలా..

| కంపెనీ పేరు | మార్కెట్ క్యాప్ రూ. కోట్లలో | ప్రమోటర్ వాటా విలువ | తనఖాలో ఉన్న ప్రమోటర్ వాటా(%) |
|---|---|---|---|
| రిలయన్స్ క్యాపిటల్ | 1,605 | 762 | 96.93 |
| రిలయన్స్ ఇన్‌ఫ్రా | 1,204 | 493 | 98.34 |
| ఆర్‌కామ్ | 368 | 81 | 22 |
| రిలయన్స్ పవర్ | 1,282 | 721 | 78.72 |
| రిలయన్స్ నావల్ | 343 | 102 | 100 |
| రిలయన్స్‌హోమ్‌ఫైనాన్స్ | 579 | 434 | 31.8 |

## ‘ఆర్‌వీ400’ ఎలక్ట్రిక్ బైక్ ఆవిష్కరణ

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత బైక్
- ఒక్కసారి చార్జింగ్‌తో 156 కి.మీ ప్రయాణం



**న్యూఢిల్లీ:** అంకుర ఎలక్ట్రిక్ సంస్థ రివోల్ట్ ఇంటెల్లీకార్ప్.. ‘ఆర్‌వీ400’ పేరిట తన అధునాతన ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్‌ను మంగళవారం ఆవిష్కరించింది. కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఈ బైక్... ఒక్కసారి చార్జ్ చేస్తే 156 కి.మీ ప్రయాణిస్తుందని కంపెనీ ప్రకటించింది. బ్యాటరీని పూర్తిగా చార్జ్ చేయడానికి నాలుగు గంటలు పడుతుండగా.. చార్జింగ్ ఇబ్బందులను అధిగమించడం కోసం ఆన్ బోర్డ్, పోర్టబుల్ చార్జింగ్‌తో పాటు హోమ్ డెలివరీ ఆప్షన్లను తీసుకొచ్చినట్లు కంపెనీ తెలిపింది. వచ్చే నాలుగు నెలల్లో దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో ఈ బైక్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో భాగంగా జూన్ 25 నుంచి ముందస్తు బుకింగ్స్ ప్రారంభంకానున్నట్లు తెలిపింది. కంపెనీ సొంత వెబ్‌సైట్‌తో పాటు అమెజాన్‌లోనూ ప్రీ–బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. తొలుత హైదరాబాద్, ఢిల్లీ–ఎన్‌సీఆర్, పుణే, బెంగళూరు, నాగ్‌పూర్, అహ్మదాబాద్, చెన్నై నగరాల్లో ఈ ఎలక్ట్రిక్ బైక్ అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ‘ప్రతి భారతీయ ఇంటికి అందుబాటు ధరల్లో వాహనాలను అందించే దిశగా కొనసాగుతున్న మా ప్రయాణానికి ఇది మొదటి అడుగుగా భావిస్తున్నాం’ అని అన్నారు. ఇక హరియాణాలో ఏటా 1.2 లక్షల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను కంపెనీ కలిగి ఉంది.

## గో ఎయిర్ చౌక ధరలు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** విమానయాన సంస్థ గో ఎయిర్ మినికేషన్ పేరుతో హైదరాబాద్ నుంచి పలు నగరాలకు టికెట్ ధరలను రూ.1,798 నుంచి ఆఫర్ చేస్తోంది. హైదరాబాద్ నుంచి అహ్మదాబాద్‌కు రూ.1,798, బెంగళూరు, లక్నో రూ.1,799, కోల్‌కతా రూ.1,983, కొచ్చి రూ.2,499, ఢిల్లీకి రూ.2,599 చార్జీ చేస్తారు. బుకింగ్ పీరియడ్ జూన్ 18 నుంచి 23 వరకు ఉంది. జూలై 1 నుంచి సెప్టెంబరు 30లోగా కస్టమర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. గో ఎయిర్ మొబైల్ యాప్ ద్వారా టికెట్ బుక్ చేస్తే అదనంగా 10 శాతం డిస్కౌంట్ లభిస్తుంది.




## ఎన్‌సీఎల్‌టీ ముంగిట జెట్

- పిటిషన్ దాఖలు చేసిన బ్యాంకులు
- విచారణ బుధవారానికి వాయిదా

**ముంబై:** దాదాపు రూ.8,500 కోట్ల రుణ బకాయిలను రాబట్టుకునే దిశగా ప్రైవేట్ రంగ విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్‌పై బ్యాంకులు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను (ఎన్‌సీఎల్‌టీ) ఆశ్రయించాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సారథ్యంలోని 26 బ్యాంకులు మంగళవారం పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై విచారణను ట్రిబ్యునల్ బుధవారానికి వాయిదా వేసింది. రుణాలు, నష్టాల భారం పేరుకుపోవడంతో జెట్ ఎయిర్‌వేస్ ఏప్రిల్ 17న కార్యకలాపాలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. కొన్నాళ్లుగా కంపెనీని విక్రయించడానికి బ్యాంకులు ప్రయత్నిస్తున్నప్పటికీ... వివిధ కారణాల వల్ల సాధ్యపడటం లేదు.

బ్యాంకులకు రూ. 8,500 కోట్లతో పాటు, వందల కొద్దీ వెండార్లకు (విమానాలు లీజుకిచ్చిన సంస్థలు మొదలైనవి) రూ.10,000 కోట్లను జెట్ చెల్లించాల్సి ఉంది. ఇక మార్చి నుంచి ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించడం లేదు. దీంతో 23,000 మంది పైచిలుకు ఉద్యోగులకు రూ.3,000 కోట్ల మేర జీతాల బకాయిలు చెల్లించాల్సి ఉంది. మంగళవారం జెట్ షేరు 41 శాతం క్షీణించి రూ. 40.45 వద్ద క్లోజయ్యింది. ఒక దశలో 53 శాతం క్షీణించి రూ.32.25 ఆల్‌టైం కనిష్ట స్థాయిని కూడా తాకింది. గడిచిన అయిదు ట్రేడింగ్ సెషన్లలో షేర్ల విలువ 73 శాతం పైగా హరించుకుపోయింది.




## అమెరికా బాదంపప్పుకు సుంకాల సెగ

**వాషింగ్టన్:** భారత ఎగుమతులపై సుంకాల వడ్డింపుతో వాణిజ్య పోరుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కయ్యానికి కాలు దువ్వడాన్ని అమెరికన్ నేతలు తప్పు పడుతున్నారు. ప్రతిగా భారత్ కూడా అమెరికా నుంచి దిగుమతయ్యే బాదంపప్పు తదితర ఉత్పత్తులపై సుంకాలను విధించడంతో స్థానిక రైతుల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత్‌తో వాణిజ్య సంబంధాలను ట్రంప్ నాశనం చేశారని కాలిఫోర్నియా సెనేటర్ డయానె ఫెయిన్‌స్టెయిన్ విమర్శించారు. ప్రతీకారంగా భారత్ సుంకాలు పెంచడంతో కాలిఫోర్నియా బాదం, వాల్‌నట్ రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. దీనితో భారత్‌కు 217 మిలియన్ డాలర్ల మేర అదనపు ఆదాయం లభించనుంది. అమెరికా నుంచి ఏటా 650 మిలియన్ డాలర్ల విలువైన పప్పులు భారత్‌కు దిగుమతవుతున్నాయి.

## బొలెరో విక్రయాల్లో 12 శాతం వృద్ధి



వాహనాన్ని విడుదల చేస్తున్న విక్రమ్ గార్గా

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఈ ఆర్థిక సంవత్సరంలో మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్‌ఎం) వాణిజ్య వాహనమైన బొలెరో అమ్మకాల్లో 12 శాతం వృద్ధిని లక్ష్యించింది. గత ఆర్థిక సంవత్సరంలో 1.62 లక్షల వాహనాలను, 2018 ఆర్థికంలో 1.49 లక్షలను విక్రయించామని.. ఏడాదిలో 9 శాతం వృద్ధిని నమోదు చేశామని ఎం అండ్ ఎం వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్– ఆటోమోటివ్ డివిజన్) విక్రమ్ గార్గా తెలిపారు. మంగళవారం కొత్త బొలెరో క్యాంపర్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య వాహన శ్రేణిలో బొలెరో ఫ్లాగ్‌షిప్ బ్రాండ్ అని, 86 శాతం మార్కెట్ వాటా దీని సొంతమని ఆయన తెలిపారు.

**3 రకాలు; ధర రూ.7.28 లక్షలు**

క్యాంపర్ నాన్ ఏసీ, క్యాంపర్ 4డబ్ల్యూడీ, క్యాంపర్ గోల్డ్ వీఎక్స్ మూడు వేరియంట్లలో మార్కెట్లో అందుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది. హైదరాబాద్‌లో ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధర రూ.7.28 లక్షలు. మూడేళ్లు లేదా లక్ష కి.మీ. వరకూ వారంటీ ఇస్తుంది.

# మెగా బీమా సంస్థ

- మూడు జనరల్ ఇన్సూరెన్స్ సంస్థల విలీన ప్రతిపాదన
- అటుపై న్యూ ఇండియా అష్యూరెన్స్‌తో కలయిక
- ఎల్‌ఐసీ తరహా దిగ్గజం ఏర్పాటుపై కేంద్రం కసరత్తు
- ఇక ప్రభుత్వ రంగంలో ఒకే సాధారణ బీమా సంస్థ

**న్యూఢిల్లీ:** జీవిత బీమాకు సంబంధించి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) తరహాలో... ప్రభుత్వ రంగంలోని సాధారణ బీమా సంస్థలన్నింటినీ కలిపి ఒకే దిగ్గజ సంస్థగా ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తోంది. న్యూ ఇండియా అష్యూరెన్స్ గొడుగు కిందికి మిగతా మూడింటినీ తెచ్చే దిశగా సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తోంది. ప్రభుత్వ రంగంలో ప్రస్తుతం న్యూ ఇండియా అష్యూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ సంస్థలు నాలుగూ సాధారణ బీమా సేవలు అందిస్తున్నాయి. వీటిల్లో న్యూ ఇండియా అష్యూరెన్స్ దేశంలోనే అతి పెద్ద జనరల్ ఇన్సూరర్ కాగా, లిస్టెడ్ కంపెనీ కూడా. గతంలో దీన్ని ప్రత్యేకంగా కొనసాగనిస్తూ, మిగతా మూడింటిని కలిపేయడం ద్వారా ప్రభుత్వ రంగంలో రెండు భారీ సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. 2019 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఓరియంటల్, నేషనల్, యునైటెడ్ ఇన్సూరెన్స్‌లను కలిపి ఒకటిగా చేసి.. న్యూ ఇండియా అష్యూరెన్స్‌ను విడిగా ఉంచాలని యోచించింది. ఈ మూడు సంస్థలు అన్‌లిస్టెడ్ కంపెనీలు. అయితే, తాజాగా ఈ ప్రతిపాదన మారింది.

**కొత్త ప్రణాళిక ఇలా..**

ఇప్పటికే ఈ రంగంలో అనేక ప్రైవేట్ కంపెనీలు మార్కెట్లో వాటా కోసం పోటీ పడుతూ ఉన్నాయి. మళ్లీ ప్రభుత్వ రంగంలో రెండు పెద్ద కంపెనీలు ఏర్పాటు చేస్తే.. ఈ రెండూ ఒకదాని వాటా మరొకటి కొల్లగొట్టే అవకాశం ఉంది. దీంతో గత ప్రతిపాదన పక్కన పెట్టి కొత్తది రూపొందించాలని కేంద్రం యోచిస్తోంది. దీని ప్రకారం.. ముందుగా అన్‌లిస్టెడ్ సంస్థలు మూడింటినీ విలీనం చేస్తారు. ఆ తర్వాత న్యూ ఇండియా అష్యూరెన్స్.. ఈ సంస్థను కొనుగోలు చేస్తుంది. ఈ ప్రక్రియలో వాటాల విక్రయ రూపంలో ప్రభుత్వానికి కూడా కొంత లబ్ధి చేకూరనుంది. అయితే, ఇదంతా న్యూ ఇండియా కొనుగోలు సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. స్థూల ప్రీమియం పరంగా బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) మే నెలాఖరు గణాంకాల ప్రకారం న్యూ ఇండియాకు 16.80% మార్కెట్ వాటా ఉంది. మూడు ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థల మార్కెట్ వాటా 25%. నష్టాల్లో ఉన్న పోర్ట్‌ఫోలియోలను సవరించుకోవాలని, క్లెయిమ్ మేనేజ్‌మెంట్‌ను మెరుగుపర్చుకోవాలని కొన్నేళ్లుగా ఆర్థిక శాఖ ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థలకు సూచిస్తూ వస్తోంది. మరోవైపు మూడు చిన్న సంస్థలను విలీనం చేసి, అవి కాస్త స్థిరపడే దాకా సమయం ఇవ్వడం శ్రేయస్కరమని ఓరియంటల్ ఇన్సూరెన్స్ సంస్థ మాజీ చైర్మన్ ఆర్‌కే కౌల్ అభిప్రాయపడ్డారు. న్యూ ఇండియా అష్యూరెన్స్ భేషుగ్గానే రాణిస్తోందని, అంతర్జాతీయ స్థాయిలో కూడా గణనీయంగా కార్యకలాపాలున్నాయని ఆయన తెలిపారు. ఇలాంటి సందర్భంలో కార్యకలాపాలకు ఆటంకం కలిగించే చర్యలు తీసుకోవడం సరికాకపోవచ్చన్నారు.




**మూలధన అవసరాలపైనా దృష్టి..**

ప్రభుత్వ రంగ బీమా సంస్థల నష్టాలు 2017 ఆర్థిక సంవత్సరంలో రూ. 16,012 కోట్లుగా ఉండగా, 2018 ఆర్థిక సంవత్సరంలో రూ.12,603 కోట్లకు తగ్గాయి. తాజా విలీన యోచన నేపథ్యంలో ఆయా సంస్థల మూలధన అవసరాల అంశంపైనా ప్రభుత్వం దృష్టి పెడుతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఐఆర్‌డీఏఐ ఇచ్చిన వెసులుబాటుతో ఓరియంటల్, యునైటెడ్, నేషనల్ సంస్థలు 2018 మార్చి ఆఖరు నాటికి తప్పనిసరైన 1.50 శాతం సాల్వెన్సీ రేషియో నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయి. బీమా పాలసీలకు జరపాల్సిన చెల్లింపులకు మించి అదనంగా ఉండే మూలధనం, అసెట్స్ విలువను సాల్వెన్సీ నిష్పత్తిగా వ్యవహరిస్తారు. అనూహ్య, అత్యవసర పరిస్థితులేమైనా తలెత్తినా కూడా క్లెయిమ్స్‌ను సెటిల్ చేయగలిగేందుకు బీమా సంస్థ దగ్గర ఉన్న నిధుల పరిస్థితులను ఇది సూచిస్తుంది.



# అరౌరా.. ఔరౌరా..

లేజర్ షో కాదు.. గ్రాఫిక్స్ అంతకన్నా కాదు.. ఇది ప్రకృతి గీసిన చిత్రం.. ఖగోళ అద్భుతం.. బూడిద నుంచి పునర్జన్మ పొందిన ఫీనెక్స్ పక్షి రూపంలో కనిపిస్తున్న ఈ ధృవ కాంతులు (అరౌరా) సూపర్‌గా ఉన్నాయి కదూ.. అందుకే ఖగోళ వింతలను, విచిత్రాలను తమ కెమెరా కన్నులో బంధించే ఫొటోగ్రాఫర్లకు ఏటా ఇచ్చే 2019 ఆస్ట్రానమీ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ తుది జాబితాకు ఈ చిత్రం ఎంపికైంది. ఆగ్నేయ లండన్‌లోని గ్రెనిచ్ రాయల్ అబ్జర్వేటరీ మొత్తం 9 విభాగాల్లో పురస్కారాలను ప్రదానం చేస్తుంది. ఈ చిత్రాన్ని వాంగ్‌జెంగ్ అనే ఫొటోగ్రాఫర్ ఐస్‌లాండ్‌లోని గోల్డెన్ సర్కిల్ వద్ద తీశారు. 90 దేశాల నుంచి వేలాది ఎంట్రీలు రాగా.. ఆయా విభాగాల్లో తుది జాబితాలను ప్రకటించారు. ఇంతకీ ఈ ధృవ కాంతులు ఎలా వస్తాయో తెలుసా? సూర్యుడి నుంచి వెలువడే విద్యుదావేశ కణాలు భూ వాతావరణంలోకి వచ్చినప్పుడు ఇవి ఏర్పడతాయి. సౌర తుపానుగా పేర్కొనే వీటిని సాధారణంగా భూ అయస్కాంత వలయం అంతరిక్షంలోకి తిప్పి పంపేస్తుంది. అయితే బలమైన సౌర తుపానులు మాత్రం భూ వాతావరణంలోకి చొచ్చుకొని వచ్చి.. ఇక్కడి వాయు కణాలతో ముఖ్యంగా హైడ్రోజన్, హీలియం వాయువులతో ఢీకొంటాయి.. అప్పుడు ఇలా కాంతి వెలువడుతుంది. దీన్నే ధృవ కాంతి అంటారు. ఇవి అనేక రంగుల్లో ఉంటాయి. ఎక్కువగా ఆకుపచ్చ, గులాబీ వర్ణంలో కనిపిస్తాయి.

# బాహుబలి రైలింజిన్..

## మన గూడ్సు రైలుకు అమెరికా లోకోమోటివ్

**6 వేల హెచ్‌పీ శక్తి... బరువు తక్కువ, వేగమెక్కువ**

**రెండు ఇంజిన్లలో ఒకటి దక్షిణ మధ్య రైల్వేకు కేటాయింపు**

**వికారాబాద్‌-వాడీ సెక్షన్ మధ్య త్వరలో పరుగులు**

**సాక్షి, హైదరాబాద్:** ఆధునిక రూపాన్ని సంతరించుకుంటున్న భారతీయ రైల్వే అధునాతన లోకోమోటివ్ (ఇంజిన్లు)లపై దృష్టి సారించింది. ముఖ్యంగా సరుకు రవాణా రైళ్లకు శక్తివంతమైన ఇంజిన్లు అవసరం కావటంతో ఇప్పుడు భారీ లోకోమోటివ్‌లను సమకూర్చుకుంటోంది. ఇప్పటివరకు సంప్రదాయ ఇంజిన్లనే వాడుతుండటంతో ఎక్కువ లోడ్ ఉండే సరుకు రవాణా రైళ్లను వేగంగా గమ్యం చేర్చటం ఇబ్బందిగా మారింది. ఎక్కువ లోడ్‌ను తక్కువ సమయంలో తరలించేందుకుగాను అత్యంత శక్తివంతమైన లోకోమోటివ్‌లు వాడాలని గతంలోనే మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అమెరికా పెన్సిల్వేనియాలో ఉండే జనరల్ ఎలక్ట్రికల్స్ కంపెనీ రూపొందించిన ఇంజిన్లు వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవలే పెన్సిల్వేనియా ప్లాంట్ నుంచి కొన్ని ఇంజన్లను తెప్పించుకోగా తాజాగా మరో రెండు వచ్చాయి. వీటిల్లో ఒకదాన్ని దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్న మౌలాలి లోకో వర్క్‌షాప్‌కు కేటాయించారు. దీన్ని వికారాబాద్–వాడీ సెక్షన్ల మధ్య నడపనున్నారు. త్వరలో ట్రయల్ రన్ మొదలుపెడతారు.

### 6 వేల హార్స్‌పవర్ శక్తి...

ప్రస్తుతం మన రైల్వేలో దాదాపు నాలుగు వేలు, నాలుగున్నర వేల హార్స్‌పవర్ శక్తి ఉండే




ఇంజిన్లను వినియోగిస్తున్నారు. బొగ్గు, సిమెంటు లాంటి బరువైన సరుకును రవాణా చేసేందుకు ఈ ఇంజిన్ల శక్తి సరిపోవటం లేదు. దీంతో రెండుమూడు ఇంజిన్లు ఏర్పాటు చేసి లాగుతున్నారు. దీనివల్ల సాంకేతిక సమస్యలు రావటం, నెమ్మదిగా రైలు కదలటంతో సరుకు రవాణాలో జాప్యం జరుగుతోంది. రైల్వేకు ప్రధాన ఆదాయ వనరు సరుకు రవాణానే కావటంతో, ఆదాయాన్ని భారీగా పెంచుకోవాలంటే సరుకును వేగంగా తరలించడమే మార్గమని రైల్వే నిర్ణయించింది. ఇందుకోసం ఎక్కువ శక్తి ఉండే ఇంజిన్లను ఏర్పాటు చేయాలని తీర్మానించింది. కానీ మన దగ్గర అంతకంటే శక్తివంతమైన లోకోలు తయారు కావటం లేదు. దీంతో అమెరికాకు చెందిన జీఈ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. ఈ కంపెనీ ఆరు వేల హార్స్‌పవర్ ఉండే లోకోమోటివ్‌లను మన దేశానికి ఎగుమతి చేస్తుంది. ప్రస్తుతం వచ్చిన రెండు ఇంజిన్లు కూడా ఇంతే శక్తివంతమైనవి. ఇవి తేలికగా ఉండటంతోపాటు ఎక్కువ సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. దీంతో తక్కువ నిర్వహణ ఖర్చు, ఎక్కువ పని అందిస్తాయని అధికారులు అంటున్నారు. వీ6 ఎవల్యూషన్ కలిగిన 16 సిలిండర్లతో కూడిన 4 స్ట్రోక్ టర్బో చార్జ్‌డ్, ఇంటర్ కూల్డ్ ఇంజిన్‌తో ఇది పనిచేస్తుంది. దీని నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు కూడా చాలా తక్కువ అయినందున పర్యావరణానికి అనుకూలంగా ఉంటుంది. దాదాపు 100 కి.మీ. వేగంతో దూసుకుపోతుంది.



### వేయి ఇంజన్ల ఆర్డర్..

మన రైల్వే జీఈ కంపెనీతో వేయి ఇంజిన్ల కోసం ఒప్పందం చేసుకుంది. దీంతో తొలుత పెన్సిల్వేనియాలోని ప్లాంట్ నుంచే కొన్ని ఇంజన్లను దిగుమతి చేసుకున్నా... బీహార్‌లో ఆ కంపెనీ సొంతంగా ఓ తయారీ సంస్థను ఏర్పాటు చేసుకుంది. ఇక ఇక్కడే వాటిని రూపొందించనుంది. ఇక్కడే దాదాపు వేయి లోకోమోటివ్‌లను రూపొందించి మన రైల్వేకు అప్పగించనుంది. ప్రస్తుతం ఒక్కో లోకోమోటివ్‌కు రైల్వే శాఖ రూ.15 కోట్ల నుంచి రూ.18 కోట్ల వరకు చెల్లిస్తున్నట్టు సమాచారం.

### ఎలక్ట్రిక్ అన్నారు.. డీజిల్ ఇంజిన్లు తెచ్చారు!

ప్రస్తుతం జీఈ కంపెనీ సరఫరా చేస్తున్న ఇంజిన్లు డీజిల్‌తో నడిచేవి. 2022 నాటికి రైల్వే మొత్తాన్ని ఎలక్ట్రిఫికేషన్ చేయనున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఆ మేరకు వేగంగా కారిడార్లను ఎలక్ట్రిఫై చేస్తున్నారు. కానీ ఇప్పుడు జీఈ కంపెనీ నుంచి చాలా ధర పెట్టి డీజిల్ ఇంజిన్లు కొంటున్నారు. ప్రతి రెండు మూడు కి.మీ.కు లీటర్ డీజిల్‌ను ఈ లోకోమోటివ్‌లు ఖర్చు చేస్తాయని పేర్కొంటున్నారు. త్వరలో మౌలాలి వర్క్‌షాప్‌కు చేరే కొత్త లోకోమోటివ్ వికారాబాద్–వాడీ సెక్షన్ల మధ్య తిరుగుతుంది. దాదాపు 200 కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ మార్గంలో ఎత్తుపల్లాలు, వంకరటింకర మలుపులు ఎక్కువగా ఉన్నందున కొత్త ఇంజిన్ పనితీరును సులభంగా అంచనా వేసే అవకాశం ఉంటుందని అధికారులంటున్నారు.

# మిధాని స్టెంట్ వచ్చేస్తోంది!

- త్వరలో తక్కువ ధరకే మార్కెట్‌లోకి
- అభివృద్ధిపరిచిన 'మిధాని' సంస్థ

**సాక్షి, హైదరాబాద్:** గుండెజబ్బుల చికిత్స కోసం ఉపయోగించే స్టెంట్లు మరింత చౌక కానున్నాయి. నికెల్, టైటానియం డయాక్సైడ్‌ల మిశ్రమంతో తయారైన సరికొత్త స్టెంట్‌ను హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న రక్షణ శాఖ సంస్థ మిధాని (మిశ్ర ధాతు నిగమ్) అభివృద్ధి చేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్టెంట్ల ధరలో సగానికే కొత్తవి అందుబాటులోకి వస్తాయని, ప్రస్తుతం వీటిని ఓ మెడికల్ యూనివర్సిటీ పరీక్షిస్తున్నట్లు మిధాని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ దినేశ్ లేఖీ తెలిపారు. 'షేప్ మెమరీ అల్లాయ్'గా పిలిచే ఈ కొత్త లోహ మిశ్రమాన్ని కొన్ని నెలల కిందే అభివృద్ధి చేశామని చెప్పారు. అన్నీ సవ్యంగా సాగితే మరో ఏడాదిన్నరలో ఈ కొత్త స్టెంట్ అందుబాటులోకి రావొచ్చని చెప్పారు. స్టెయిన్‌లెస్ స్టీల్ కంటే ఎంతో మెరుగైన టైటానియం, ఇతర లోహాల తయారీలో ప్రఖ్యాతిగాంచిన మిధాని ఈ ఏడాది నుంచి బయో ఇంప్లాంట్స్ మార్కెటింగ్ రంగంలోకి అడుగుపెడుతోందని హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో తెలిపారు. కృత్రిమ పళ్లు బిగించేందుకు అవసరమైన స్క్రూ మొదలుకొని, కృత్రిమ కీళ్లు, భుజాలు, మోకాలు చిప్ప, తుంటి ఎముకలను తాము చాలా కాలంగా తయారు చేస్తున్నామని, ఇప్పటివరకు వాటి మార్కెటింగ్‌కు ప్రయత్నాలు చేయలేదని చెప్పారు. హిందుస్తాన్ యాంటీ బయోటిక్స్ లిమిటెడ్‌తో బయో ఇంప్లాంట్స్ మార్కెటింగ్‌కు సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు.



**పరీక్షలు అవసరం..**

టైటానియం, నికెల్ స్టెంట్ల గురించి మాట్లాడుతూ వీటి సామర్థ్యాన్ని ప్రపంచానికి నిరూపించేందుకు విస్తృత స్థాయిలో వందల మందితో పరీక్షలు నిర్వహించాల్సి ఉందని.. ఇందుకోసం మిలటరీ ఆసుపత్రులను ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు దినేశ్ లేఖీ చెప్పారు. ఈ పరీక్షలు తమ దేశంలోనే నిర్వహించాలని ఇందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని కజకిస్తాన్ ప్రతిపాదించిందని, సాధ్యాసాధ్యాలను బేరీజు వేసుకుని తగు నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో బయో ఇంప్లాంట్స్ మార్కెటింగ్ ద్వారా రూ.100 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఏఎల్ చైర్మన్, ఎండీ నీరజా సరాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో పీఆర్ శాఖ పాత్ర కీలకం

**మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడి**

**సాక్షి, హైదరాబాద్:** అధికారులు, సిబ్బందికి సంబంధించిన సర్వీసు, ఇతర అంశాలపై సానుకూల నిర్ణయానికి ప్రభుత్వం ఎప్పుడూ సుముఖంగానే ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వ్యాఖ్యానించారు. మంగళవారం మంత్రితో జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవో), ఈవోపీఆర్డీ సంఘాల ప్రతినిధులు విడివిడిగా సమావేశమయ్యారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో కీలకమైందని, గ్రామాల్లోని అనేక అంశాలు దీని పరిధిలోనే ఉన్నందున పల్లెల అభివృద్ధిలో ఈ శాఖ అధికారులది కీలక పాత్ర అని చెప్పారు. ప్రస్తుతం 9 జిల్లాలకే డీపీవోలు ఉన్నారని, కొత్త జిల్లాల ప్రకారం ప్రతి జిల్లాకు ఓ డీపీవోను నియమించాలని, డీపీవోలు, ఈవోపీఆర్డీలకు పదోన్నతి కల్పించాలని డీపీవోల సంఘం అధ్యక్షురాలు పద్మజ, కార్యదర్శి సురేశ్ కుమార్ మంత్రిని కోరారు. పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కల్పించి బదిలీలు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈవోపీఆర్డీల బదిలీల ప్రక్రియను చేపట్టి వెంటనే పూర్తి చేయాలని ఈవోపీఆర్డీల సంఘం అధ్యక్షుడు రంగాచారి, కార్యదర్శి యాదగిరి గౌడ్, పబ్లిసిటీ సెక్రటరీ జె.శంకర్‌నాయక్ వినతిపత్రం ఇచ్చారు.




# అమెరికా ఎన్నికల్లో పర్యావరణమే ప్రధాన ఎజెండా

- భవిష్యత్తులో భారత రాజకీయాలపైనా ప్రభావం
- హైదరాబాద్ మెట్రో బాగుంది
- వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించకపోతే విపత్తులే
- 'సాక్షి'తో అట్లాంటిక్ కౌన్సిల్ డిప్యూటీ డైరెక్టర్ డేవిడ్ లివింగ్‌స్టన్



**సాక్షి, హైదరాబాద్:** అమెరికాలో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో పర్యావరణమే ప్రధాన ఎజెండా అవుతుందని, త్వరలో భారత రాజకీయాల్లో కూడా కీలక అంశంగా మారుతుందని పర్యావరణ పరిశోధకుడు అట్లాంటిక్ కౌన్సిల్ డిప్యూటీ డైరెక్టర్ డేవిడ్ లివింగ్‌స్టన్ పేర్కొన్నారు. సంప్రదాయ ఇంధన వనరుల మితిమీరిన వినియోగం వల్ల భూమిపై వేగంగా సహజ వనరులు తరిగిపోతున్నాయని, వ్యవసాయం, పర్యావరణం దెబ్బతిని కరువు, విపత్తులు సంభవిస్తాయని, మానవాళి మనుగడకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగంపై మంగళవారం ఆయన హైదరాబాద్‌లో 'సాక్షి'తో మాట్లాడారు.

**హైదరాబాద్ మెట్రో బావుంది**

హైదరాబాద్ నగరం బాగుందని, రవాణా వ్యవస్థలో మెట్రో, ఎలక్ట్రిక్ బస్సులు రావడం శుభపరిణామమని లివింగ్‌స్టన్ పేర్కొన్నారు. పర్యావరణహితంగా స్థానిక ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని, ఇవి మరింత పెరగాలని ఆయన ఆకాంక్షించారు. బొగ్గు, డీజిల్, పెట్రోల్ లాంటి స్థానంలో వీలైనంత త్వరగా హైడ్రోజన్, విద్యుత్, న్యూక్లియర్ వంటి ఆధునిక ఇంధనాలు రావాలన్నారు. అమెరికా పర్యావరణంపై ప్రజల్లో, స్థానిక ప్రభుత్వాల్లో పర్యావరణ మార్పులపై అనేక ఆందోళనలు ఉన్నాయని, ప్రకృతి విపత్తులతో జరుగుతున్న ఆస్తి, ప్రాణనష్టాల నేపథ్యంలో రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో పర్యావరణమే ప్రధాన ఎజెండా అవుతుందన్నారు. ప్రస్తుతం ఢిల్లీ, ఉత్తర భారతదేశంలో కాలుష్య తీవ్రత పెరిగిపోయిన దరిమిలా.. వచ్చే ఎన్నికల్లో భారత రాజకీయాల్లోనూ పర్యావరణం కీలకాంశంగా ఉంటుందన్నారు. ఇండియాలో సౌర విద్యుత్తు పరికరాలపై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తే.. మరింత ఎక్కువ మంది వినియోగదారులకు చేరతారని అభిప్రాయపడ్డారు. పవన, సౌర టర్బైన్ల నిర్వహణ వివిధ శీతోష్ణస్థితుల వద్ద కష్టంగా మారుతోందని, దీన్ని అధిగమించేందుకు డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రిమోట్ సెన్సింగ్ వంటి పద్ధతులు ఉపయోగించుకోవచ్చన్నారు.

**లిథియం, కోబాల్ట్ మినరల్స్‌పై దృష్టి**

భవిష్యత్తులో సౌర, పవన, తదితర పద్ధతుల్లో ఇంధనాన్ని ఉత్పత్తి చేసినా..వాటి నిల్వ సవాలుగా మారుతుందన్నారు. అందుకే, ప్రస్తుతం బ్యాటరీలో వాడుతున్న లిథియం, కోబాల్ట్ మినరల్స్‌పై దేశాలు దృష్టి సారించాలని సూచించారు. వచ్చేవారం అమెరికా విదేశాంగ మంత్రితో భారత ప్రభుత్వం ఇదే విషయమై జరపనున్న చర్చల్లో దీనిపై నిర్ణయం తీసుకోవాలన్నారు. కర్బన ఉద్గారాలు వెలువరించే వాహనాలు, పరిశ్రమలపై కఠినమైన చలానాలు విధించడం ద్వారా స్వీడన్ ప్రపంచంలోనే సంప్రదాయేతర ఇంధనాల వినియోగంలో మొదటి స్థానంలో ఉందని, ప్రపంచమంతా ఈ బాటలో నడవాలని సూచించారు. జర్మనీ, జపాన్, సౌదీ అరేబియా వివిధ వాహనాలు, పరిశ్రమల్లో హైడ్రోజన్‌ను ఇంధనంగా వాడుతూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కర్బన ఉద్గారాలను అరికట్టకపోతే భవిష్యత్తులో ప్రకృతి విపత్తులు, సునామీలు, తుపాన్లు, కరువు, వ్యవసాయ ఉత్పత్తి మందగించడం, వలసలు, దేశాల మధ్య కలహాలు రేగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్ని దేశాలు ఈ పరిస్థితి ఎదుర్కొంటున్నాయన్నారు. అందుకే, సంప్రదాయేతర ఇంధన వనరులపై ఇండియా– అమెరికా కలసి నూతన ఆవిష్కరణల కోసం పరిశోధనలు చేయాల్సిన అవసరముందని స్పష్టం చేశారు.

# లక్షలొచ్చి పడ్డాయ్!

- మేడ్చల్ వాసి ఖాతాలోకి 13.57 లక్షలు
- బిహార్ అధికారుల నిర్వాకం

**సాక్షి, హైదరాబాద్:** చిన్న పొరపాటు అధికారులకు చుక్కలు చూపెడుతోంది. సర్కారీ నిధులు ముక్కుమొహం తెలియని వ్యక్తి ఖాతాలో జమ కావడం అధికారుల ముప్పుతిప్పలకు కారణంగా మారింది. ఏకంగా రూ.13.57 లక్షలు మేడ్చల్ జిల్లా వాసి ఖాతాలో జమ కావడంతో ఈ నిధులను రాబట్టేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక కలెక్టర్ సాయం కోరింది. బిహార్ పంచాయతీరాజ్ శాఖ 14వ ఆర్థిక సంఘం నిధులను పట్నాలోని ఎస్‌బీఐ బహేలి రోడ్డు బ్రాంచి నుంచి ఒకసారి రూ.5,946, రెండోసారి రూ.13,51,898.99లను ఆర్‌టీజీఎస్ ద్వారా బదిలీ చేయాలని కోరింది. అయితే సదరు ఎస్‌బీఐ బ్యాంకు నిర్వాకమో.. అధికారుల నిర్లక్ష్యమో కానీ, నిధులు బదలాయించాలని పేర్కొన్న బ్యాంకు ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ నంబర్‌ను తప్పుగా నమోదు చేయడంతో ప్రభుత్వ పద్దులో జమ కావాల్సిన నిధులు కాస్తా మేడ్చల్ జిల్లా వాసి ఖాతాలోకి వెళ్లాయి. బోడుప్పల్‌లోని బృందావన్ కాలనీలో నివాసముండే చల్లా విక్రమ్‌రెడ్డి ఖాతాలోకి రూ.13.57 లక్షలు జమయ్యాయనే విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన బిహార్ ప్రభుత్వం, నిధుల రికవరీకి నానా తంటాలు పడుతోంది. ఈ మేరకు ఆ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శి అమృత్‌లాల్ మీనా మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. విక్రమ్‌రెడ్డి చిరునామాను పేర్కొంటూ డబ్బులు వసూలు చేయాలని కోరారు. అయితే విక్రమ్‌రెడ్డి ఖాతాలో జమ అయిన నిధులను ఆయన ఖర్చు చేయకుంటే ఇబ్బంది లేదు.. లేదంటే అతడి నుంచి నిధులెలా రికవరీ చేయాలనే దానిపై పంచాయతీరాజ్ శాఖ తలపట్టుకుంటోంది.

# ప్రతిష్టాత్మకంగా 'ఇస్టా' నిర్వహించాలి

**వ్యవసాయమంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశం**

**సాక్షి, హైదరాబాద్:** అంతర్జాతీయ విత్తన కాంగ్రెస్ (ఇస్టా)ను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమిషనర్ రాహుల్ బొజ్జా, రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు హాజరయ్యారు. ఇస్టా సదస్సు విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. 70 దేశాల నుంచి 800 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, తొలిసారి ఆసియాలో, అదీ భారతదేశంలో ఇస్టా కాంగ్రెస్ జరుగుతుందన్నారు. దాని నిర్వహణ తెలంగాణకు దక్కడం, హైదరాబాద్‌లో నిర్వహిస్తుండటం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఏర్పాట్లు రెండు మూడు రోజులలో పూర్తికావాలని, ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదన్నారు. సదస్సులో భాగంగా 1,500 మంది రైతులతో తెలంగాణ విత్తన రైతుల సమావేశాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. అంతర్జాతీయ విత్తన సదస్సులో 65 దేశ విదేశీ సంస్థల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే విత్తన సంస్థలతో ఇస్టా ప్రతినిధుల ముఖాముఖి ఏర్పాటు చేశామన్నారు. విత్తన సాంకేతిక సమావేశాలు, విత్తన రైతుల సమావేశాలు, ఎగ్జిబిషన్లు, సదస్సుకు భద్రత, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖులకు ఆహ్వానాలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలపై ఆయన పలు సూచనలు చేశారు. ఆహ్వానాలు సకాలంలో అందజేయాలని, అన్ని రాష్ట్రాల వ్యవసాయ మంత్రులను ఆహ్వానించాలని ఆదేశించారు.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792